thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 93 కరీంనగర్ గురువారం, 12 జూన్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## జాతీయ భద్రత సలహా మండలి సభ్యుడిగా సతీశ్‌రెడ్డి

న్యూఢిల్లీ: జాతీయ భద్రత సలహా మండలి (ఎన్‌ఎస్‌ఏబీ) సభ్యుడిగా డీఆర్‌డీవో మాజీ చైర్మన్ ప్రొఫెసర్ జి.సతీశ్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ భద్రత మండలి సచివాలయం ఉప కార్యదర్శి పుష్పేంద్ర కుమార్ ఉత్తర్వులిచ్చారు. సతీశ్‌రెడ్డి ఈ పదవిలో రెండేళ్లపాటు కొనసాగుతారు. 2027 జూన్ 9 వరకు.. లేదా తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు ఆయన ఎన్‌ఎస్‌ఏబీ సభ్యుడిగా ఉంటారు. కాగా.. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం మహిమలూరు గ్రామానికి చెందిన సతీశ్‌రెడ్డి డీఆర్‌డీవో చైర్మన్‌గా, భారత రక్షణ మంత్రి సాంకేతిక సలహాదారుగా సేవలందించారు. ఆంధ్రప్రదేశ్ ఆయనను విమానయానం, రక్షణ రంగాల్లో గౌరవ సలహాదారు(రాష్ట్ర క్యాబినెట్ హోదా)గా ఈ ఏడాది మార్చి 19న నియమించింది. ఆయన భారతదేశ క్షిపణి వ్యవస్థలపై పరిశోధన, అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు.

# తెలంగాణకు గుడ్‌న్యూస్..

## కొత్త ఎయిర్‌పోర్ట్స్ అందుబాటులోకి వచ్చేస్తున్నాయ్.. ఎప్పుడంటే..?




హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రం వైమానిక రంగంలో సరికొత్త శకానికి నాంది పలుకుతోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన మేరకు.. వరంగల్ శివారులోని మామునూరు, ఆదిలాబాద్ శివారులోని శాంతినగర్‌లో రెండు కీలక విమానాశ్రయాలు 2027 చివరికల్లా పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ మహత్తర ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన టెండర్లను ఈ ఏడాది చివరిలో ఆహ్వానించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రస్తుతం శంషాబాద్ విమానాశ్రయం మాత్రమే అందుబాటులో ఉన్న నేపథ్యంలో.. ఈ రెండు కొత్త ఎయిర్‌పోర్టులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు, వాణిజ్య కార్యకలాపాలకు, పర్యాటక రంగానికి గణనీయమైన ఊపునివ్వనున్నాయి. వరంగల్‌లోని మామునూరు ప్రాంతానికి ఒక సుదీర్ఘ వైమానిక చరిత్ర ఉంది. నిజాం కాలంలో.. 1930లోనే నిర్మించబడిన ఈ విమానాశ్రయం 1981 వరకు సేవలందించింది. దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం, మామునూరు ఎయిర్‌పోర్టు విస్తరణకు తెలంగాణ ప్రభుత్వం సన్నద్ధమైంది. 2023 జూలై 31న రాష్ట్ర మంత్రివర్గం ఈ కొత్త ఎయిర్‌పోర్టుకు అధికారికంగా ఆమోదముద్ర వేసింది. దీనిని బ్రౌన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుగా అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం కూడా పచ్చజెండా ఊపింది. విమానాశ్రయం పరిధిలో ఇప్పటికే 696 ఎకరాల భూమి అందుబాటులో ఉండగా, విస్తరణకు అవసరమైన అదనపు 253 ఎకరాల భూసేకరణకు తెలంగాణ ప్రభుత్వం రూ.205 కోట్లను కేటాయించి, పనులను వేగవంతం చేస్తోంది. విమానాశ్రయం నిర్మాణానికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక మరియు డిజైన్లను సిద్ధం చేయాలని రోడ్లు, భవనాల శాఖ ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకి లేఖ రాసింది. ఉడాన్ పథకం కింద ఈ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించడం, దీని ప్రాముఖ్యతను మరింత పెంచుతుంది. ఇది అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణతో పాటు, దక్షిణ మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల ప్రజలకు కూడా ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడతాయి.

**ఆదిలాబాద్ విమానాశ్రయం.. దశాబ్దాల కల సాకారం...** ఆదిలాబాద్‌లో విమానాశ్రయం ఏర్పాటు కల కూడా చాలా కాలంగా ఉంది. స్వాతంత్ర్యానికి ముందే, 1930లో, నిజాం కాలంలోనే యుద్ధ విమానాలకు ఇంధనం నింపడానికి 369 ఎకరాల భూమిలో ఏరోడ్రోమ్‌ను స్థాపించిన చరిత్ర ఈ ప్రాంతానికి ఉంది. జిల్లా అభివృద్ధికి విమానాశ్రయం అవసరమని స్థానికులు దీర్ఘకాలంగా కోరుతున్నారు. వారి ఆకాంక్షలను నెరవేరుస్తూ, కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆదిలాబాద్‌లో పౌర విమానాశ్రయానికి అనుమతి మంజూరు చేసింది. ఈ మేరకు భారత వాయుసేన నుంచి కూడా గ్రీన్ సిగ్నల్ లభించిందని ఇటీవల రాష్ట్ర మంత్రి కొమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఈ విమానాశ్రయాన్ని పౌర విమానాలు, ఎయిర్ ఫోర్స్ విమానాల రాకపోకలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని వాయుసేన సూచించింది. ప్రస్తుతం రక్షణ శాఖ అధీనంలో ఉన్న 369 ఎకరాల భూమిని ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు అప్పగిస్తే.. ఇప్పట్లో అదనపు భూసేకరణ అవసరం ఉండకపోవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ రెండు విమానాశ్రయాల నిర్మాణానికి ఒక్కోదానికి సుమారు రూ.500 నుంచి రూ.600 కోట్లు ఖర్చవుతుందని అంచనా. ఇందులో 80 శాతం ఖర్చును కేంద్రం, 20 శాతం ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం భరిస్తాయి. ఈ విమానాశ్రయాల ఏర్పాటుతో తెలంగాణలో ప్రయాణ సమయం తగ్గుతుంది. ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయి. పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుంది.

స్థానికులకు కొత్త ఉద్యోగావకాశాలు లభించి, ప్రాంతీయ అసమానతలు తగ్గుతాయి. అంతే కాకుండా.. ఈ రెండు విమానాశ్రయాల సరిహద్దులోని ప్రాంతాల్లో భూములకు అధిక ధర పలుకుతాయి.




హైదరాబాద్ : మృగశిర కార్తితో రైతులు వానాకాలం సాగు పనులు మొదలు పెట్టారు. దుక్కులు దున్ని సాగుకు భుములు సిద్ధం చేసుకుని ఎరువులు, విత్తనా లు సమకూర్చుకుంటున్నారు. ఎన్నో ఆశలతో పునాస సాగుకు సిద్ధమైన రైతులకు ఈసారి నైరుతి కూడా ముందే ఆశలను పెంచింది. దాదాపు 16 ఏళ్ల తర్వాత రోహిణితో వర్షాలు మొదలయ్యాయి. కానీ ప్రభుత్వం పెట్టు బడి సాయం మాత్రం ప్రతిసారి ఆలస్యంగానే అందిస్తోంది. యాసంగిలో ప్రభుత్వం ఎకరం, రెండెకరాలు ఇలా విడుతల వారీగా డబ్బులు అం దించింది. ఈ సారి ఒకేసారి రైతులకు ఇవ్వాలని నిర్ణయించడంతో రైతుల కొంత ఉరటగా కలుగుతున్నా డబ్బులు జమ అయిన తర్వాత మంచి రోజు చూసి విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. మంచి రోజు ఎప్పుడు వస్తుందని రైతులు ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వం ఎకరానికి రూ. 5 వేలు రైతుబంధు పేరుతో అందించారు. ప్రస్తుతం ముగిసిన యాసంగి సీజన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరానికి రూ. 6 వేలు అందించింది. ఎన్ని కల్లో రెండు సీజన్లో కలిపి రూ. 15 వేలు రైతు ఖాతాల్లో జమ చేస్తామని హామీ ఇచ్చారు. కానీ ఎకరానికి రూ. వెయ్యి మాత్రమే పెంచి అందించారు. జిల్లాలో యాసంగిలో 88,055 మంది రైతులకు రూ. 7.03 కోట్లు జమ చేశారు. ఐదు ఎకరాల వరకు మాత్రమే పంట పెట్టుబడి సాయం అం దించారు. దీంతో మిగతా వారిలో నిరాశ మిగిలింది. ఇప్పటికీ యాసంగిలో పూర్తిస్థాయిలో రైతు భరోసా ఇవ్వలేదనే విమర్శలు ఉన్నాయి. ఈ సారి వానకాలం సీజన్లో మళ్లీ ఎకరానికి రూ. 6వేలు మాత్రమే జమ చేస్తారని భావిస్తున్నారు. పెట్టుబడి సాయం లేక మళ్లీ రైతులు గత్యంతరం లేక వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు రైతులకు మే మొదటి వారంలోని పెట్టు బడి సాయం అందిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉండేదని, రైతులు వ్యాపా రుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండదనే అభిప్రాయం ఉన్నది.

**2.43 లక్షల ఎకరాల్లో వానాకాలం సాగు...** రాజన్న సిరిసిల్ల జిల్లాలో వానాకాలంలో 2 లక్షల 43 వేల 783 ఎకరాల్లో వివిధ పంటల సాగుకు రైతులు సిద్ధమయ్యారు. ఇందులో వరి 1 లక్షా 84 వేల 860 ఎకరాలు, పత్తి 49760 ఎకరాలు, పెసర 79 ఎకరాలు, కందులు 1155 ఎకరాలు, జొన్నలు 14, మొక్కజొన్న 1600 ఎకరాలు, ఇతర పంటలు 6,304 ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా వేశారు. మండలాల వారీగా గంభీరావుపేటలో 19,330 ఎకరాలు, ఇల్లంతకుంటలో 38,470 ఎకరాలు, ముస్తాబాద్‌లో 25,250 ఎకరాలు, సిరిసిల్లలో 5,883 ఎకరాలు, తంగళ్లపల్లిలో 22,031 ఎకరాలు, వీర్నపల్లిలో 8,792 ఎకరాలు, ఎల్లారెడ్డిపేటలో 21,130 ఎకరాలు, బోయినపల్లిలో 21,310 ఎకరాలు, చందుర్తిలో 21,610 ఎకరాలు, కోనరావుపేటలో 23,700 ఎకరాలు, రుద్రంగిలో 10,105 ఎకరాలు, వేములవాడ 10,578 ఎకరాలు, వేములవాడ రూరల్‌లో 15,614 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో వరి 1.84 లక్షల ఎకరాలు, పత్తి 49,760 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. పెసర 79 ఎకరాలు, కందులు 1,155 ఎకరాలు, మొక్కజొన్న 1,600 ఎకరాలు, జొన్నలు 14 ఎకరాలు, ఇతర పంటలు 6,304 ఎకరాలు సాగుకు సిద్ధమయ్యారు.

ఇందుకోసం జిల్లాలో రైతుల కోసం 56,568 క్వింటాళ్ల వరి విత్తనాలు, పెసర 4.08 క్వింటాళ్లు, మొక్కజొన్న 27.04 క్వింటాళ్లు పత్తి 1,28,650 ప్యాకెట్లు కందులు 122.5 క్వింటాళ్ల విత్తనాలు అవసరం అవుతాయని సిద్ధం చేశారు. వానా కాలం సాగులో ఎరువులు 56,060 మెట్రిక్ టన్నులు అవసరం అవుతా యని అంచనా వేశారు. ఇందులో యూరియా 25,370 మెట్రిక్ టన్నులు, డీఏపీ 3,460 మెట్రిక్‌టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 22,390 మెట్రిక్ టన్ను లు, ఎంఓపీ 4,115 మెట్రిక్ టన్నులు ఎస్ఎస్‌పీ 725 మెట్రిక్ టన్నులు అవసరం అవుతాయని అందుకు అనుగుణంగా సిద్ధం చేస్తున్నారు.




## కొత్త మంత్రులకు శాఖల కేటాయింపు పూర్తి!

హైదరాబాద్ :ఉత్కంఠ నడుమ కొత్త మంత్రులకు శాఖల కేటాయింపు పూర్తయ్యింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వద్ద ఉన్న శాఖల్లో ముఖ్యమైన హోంశాఖ, విద్య, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్, జనరల్ అడ్మినిస్ట్రేషన్ శాఖలను అట్టిపెట్టుకుని మిగిలిన శాఖలను కేటాయించారు. జి.వివేక్ వెంకటస్వామికి క్రీడ, కార్మిక, న్యాయ శాఖలను కేటాయించారు. అడ్లూరి లక్ష్మణ్‌కు ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖను ఇచ్చారు. ఇక వాకిటి శ్రీహరికి వాణిజ్యం, పశు సంవర్ధక శాఖలను కేటాయించారు.

# కేసీఆర్ కుటుంబమే...

## తెలంగాణకు అసలైన శత్రువు




## కేసీఆర్ కుటుంబంపై రేవంత్ కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, జూన్ 11: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన ముగిసింది. కొత్త మంత్రులపై శాఖల కేటాయింపుపై సీఎం స్పష్టత ఇచ్చారు. తన దగ్గర ఉన్న శాఖలను కొత్త మంత్రులకు ఇస్తానని చెప్పారు. బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో సీఎం మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో కొన్ని నెలల వరకు మంత్రి పదవులు ఇవ్వలేదని, ఇచ్చినప్పటికీ శాఖలను కేటాయించలేదన్నారు. తాను మాత్రం రెండు మూడు రోజులకే శాఖలను కేటాయించినట్లు చెప్పారు.

**కేసీఆర్ ఫ్యామిలీపై...** అలాగే కేసీఆర్ కుటుంబంపై సీఎం పలు కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణకు కేసీఆర్ కుటుంబ సభ్యులే శత్రువులని, తాను ఉన్నంత వరకు కేసీఆర్ ఫ్యామిలీకి కాంగ్రెస్‌లోకి ఎంట్రీ లేదని కామెంట్స్ చేశారు. కులగణన సమయంలో కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్, కిషన్ రెడ్డి అందరి నివాసాలకు ప్రత్యేకంగా వెళ్లి వివరాలు స్వీకరించాలని హైదరాబాద్ కలెక్టర్‌కు ప్రత్యేకంగా సూచించినట్లు తెలిపారు.

కేసీఆర్, కేటీఆర్, కిషన్ రెడ్డి, హరీష్ రావు సర్వేలో వివరాలు పంచుకోలేదన్నారు. కాళేశ్వరంలో ఏం జరిగింది, కాళేశ్వరంపై తనకు ఉన్న అభిప్రాయాలను రెండు మూడు రోజుల్లో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి వివరిస్తానని ముఖ్యమంత్రి తెలిపారు.

**కిషన్ రెడ్డిపై ఫైర్...** కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై కూడా ముఖ్యమంత్రి విరుచుకుపడ్డారు. రాష్ట్రానికి అడ్డుపడుతుంది కిషన్ రెడ్డే అంటూ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్రానికి ఒక ప్రాజెక్టు కూడా తీసుకురాలేదని విమర్శించారు.

తెలంగాణ అభివృద్ధికి కిషన్ రెడ్డి ముందుకు వస్తే వారితో కలిసి వెళ్లేందుకు తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రాజెక్టులపై కిషన్ రెడ్డితో సమీక్ష చేసేందుకు రెడీగా ఉన్నట్లు తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి ఏ రోజైనా తెలంగాణ ప్రాజెక్టులపై కిషన్ రెడ్డి నివేదిక ఇచ్చారా కనీసం తెలంగాణకు ప్రాజెక్టు ఇవ్వాలని డిమాండ్ చేశారా అని ప్రశ్నించారు. కేంద్ర కేబినెట్‌లో తెలంగాణ అంశాలను ఎప్పుడైనా కేంద్రమంత్రి ప్రస్తావించారా అంటూ నిలదీశారు. నిర్మల సీతారామన్ చెన్నైకు మెట్రో తీసుకువెళ్లారని.. ప్రహ్లాద్ కర్ణాటకకు మెట్రో తీసుకెళ్లారని.. తెలంగాణ నుంచి కేంద్రమంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి ఏమీ తీసుకురాలేదని మండిపడ్డారు.

తెలంగాణలో ప్రతీ అభివృద్ధి కార్యక్రమానికి కిషన్ రెడ్డి అడ్డుగా ఉన్నారన్నారు. తెలంగాణ మంత్రివర్గం విస్తరణలో సామాజిక న్యాయం పాటించామని.. 55 శాతం మేరకు ఇప్పటికే పదవులు కేయించామన్నారు. నక్సలిజానికి అంతం ఉండదని.. సామాజిక అసమానతలు ఉన్నంత వరకు నక్సలిజం ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

చురకలు






## కాళేశ్వరం కమిషన్ ఎదుట ముగిసిన కేసీఆర్ విచారణ

హైదరాబాద్: బీఆర్కే భవన్‌లో కాళేశ్వరం కమిషన్ ఎదుట మాజీ సీఎం, భారాస అధినేత కేసీఆర్ విచారణ ముగిసింది. ఆయన్ను పీసీ ఘోష్ కమిషన్ సుమారు 50 నిమిషాల పాటు విచారించింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి పలు ప్రశ్నలు సంధించింది. 115వ సాక్షిగా ఆయన్ను విచారించింది. విచారణ ముగిసిన అనంతరం కేసీఆర్ అభిమానులు, కార్యకర్తలకు అభివాదం చేస్తూ బీఆర్కే భవన్ నుంచి కారులో బయలుదేరి వెళ్లారు. ఆయన వెంట హరీశ్‌రావు ఉన్నారు.

**ఆనకట్టల నిర్మాణంపై నిర్ణయం ఎవరిది.. ప్రశ్నించిన కమిషన్...**
విచారణ సందర్భంగా కేసీఆర్‌ను కాళేశ్వరం కమిషన్ 18 ప్రశ్నలు అడిగింది. ఆనకట్టల నిర్మాణానికి ఎవరు నిర్ణయం తీసుకున్నారని ప్రశ్నించింది. ఈక్రమంలో కాళేశ్వరం రీఇంజినీరింగ్ గురించి కేసీఆర్ వివరించారు. ఆనకట్టల నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం ఉందా అని కమిషన్ ప్రశ్నించింది. క్యాబినెట్, ప్రభుత్వ ఆమోదంతోనే ఆనకట్టల నిర్మాణం జరిగిందని కేసీఆర్ బదులిచ్చారు. వ్యాప్కోస్ సిఫారసుల ప్రకారమే నిర్మాణం జరిగిందని.. అన్ని అనుమతులు తీసుకున్నట్లు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అన్ని అంశాలతో ఉన్న పుస్తకాన్ని కమిషన్‌కు అందజేశారు. కాళేశ్వరం కార్పొరేషన్ గురించి కమిషన్ ఆరా తీసింది. కొత్త రాష్ట్రంలో నిధులను దృష్టిలో ఉంచుకొని కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్లు కేసీఆర్ తెలిపారు. ప్రాజెక్టు వేగంగా పూర్తి చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. బ్యారేజీల్లో నీటి నిల్వ గురించి కేసీఆర్‌ను కమిషన్ అడిగింది. ఎంత నీరు నిల్వ చేయాలన్నది ఇంజినీర్లు చూసుకుంటారని కేసీఆర్ చెప్పారు. బ్యారేజీల నిర్మాణ స్థలం ఎంపిక, మార్పు సాంకేతికపరమైన అంశమన్నారు. నీటి లభ్యత దృష్టిలో ఉంచుకొని కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టినట్లు తెలిపారు. జీవో నంబర్ 45ను, ఆపరేషన్స్ అండ్ మెంటినెన్స్ బుక్‌ను కమిషన్‌కు అందజేశారు.




దిల్లీ: తాను ఉన్నంత వరకు కాంగ్రెస్‌లోకి మాజీ సీఎం కేసీఆర్ కుటుంబానికి ఎంట్రీ లేదని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రానికి ఆ కుటుంబమే ప్రధాన శత్రువని మండిపడ్డారు. దిల్లీలో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో సీఎం మాట్లాడారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణ, శాఖల కేటాయింపుపై దిల్లీలో ఎలాంటి చర్చ జరగలేదని సీఎం చెప్పారు. హైదరాబాద్ వచ్చాక అందరితో సంప్రదించి శాఖలు నిర్ణయిస్తామని తెలిపారు. కర్ణాటక కులగణనపై మాత్రమే అధిష్ఠానం వద్ద చర్చలు జరిగాయన్నారు. కాళేశ్వరంపై రెండు రోజుల్లో మీడియా సమావేశం నిర్వహిస్తానని రేవంత్‌రెడ్డి వెల్లడించారు. కాళేశ్వరం డాక్యుమెంట్లు అన్నింటినీ బయటపెడతానన్నారు. తెలంగాణకు సంబంధించి కేంద్రంలో అన్నింటికీ అడ్డుపడుతోంది కిషన్‌రెడ్డేనని ఆరోపించారు. రాష్ట్రంలోని ఏ ఒక్క ప్రాజెక్టుకూ ఆయన నిధులు సాధించలేదని విమర్శించారు.

## ప్రాజెక్టుల పేరుతో పింక్ వ్యవస్థను బలోపేతం చేసుకున్నారు

ములుగు: గత భారాస ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం, ధరణి, మిషన్ భగీరథ పథకాలు పెద్ద స్కామ్ అని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు.

ములుగులో ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ... గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రాజెక్టుల పేరుతో పింక్ వ్యవస్థను బలోపేతం చేసుకున్నారని ధ్వజమెత్తారు. జాతిపితగా ప్రకటించుకునే వ్యక్తి దర్యాప్తు సంస్థ ముందు విచారణకు వచ్చారని, ఎంతటి వారైనా తప్పు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.





## ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని పరామర్శించిన కేసీఆర్

హైదరాబాద్: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పరామర్శించారు. కాలు జారి కిందపడటంతో గాయపడి సోమాజీగూడ యశోద ఆసుపత్రిలో పల్లా చికిత్స పొందుతున్నారు. భారాస నేతలతో కలిసి యశోద ఆసుపత్రికి వెళ్లిన కేసీఆర్.. పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.
కేసీఆర్‌తో పాటు మాజీ మంత్రులు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, పలువురు భారాస నేతలు పల్లాను పరామర్శించిన వారిలో ఉన్నారు.

## గ్రూప్-1 నియామకాలపై స్టే ఎత్తివేయాలని హైకోర్టులో 4 పిటిషన్లు

హైదరాబాద్: తెలంగాణలో గ్రూప్–1 నియామకాలపై స్టే ఎత్తివేయాలని కోరుతూ హైకోర్టులో నాలుగు పిటిషన్లు దాఖలయ్యాయి. గ్రూప్–1 మెయిన్స్ పరీక్షా కేంద్రాల కేటాయింపు, మూల్యాంకనంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని పలువురు అభ్యర్థులు గతంలో హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. గత నెలలోనే ఈ పిటిషన్లపై వాదనలు జరిగాయి. పునర్‌మూల్యాంకనం చేయాలని లేదా మరోసారి మెయిన్స్ నిర్వహించాలని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోరారు. అభ్యర్థులు కేవలం అపోహపడుతున్నారని, నిపుణులతో మెయిన్స్ పత్రాల మూల్యాంకనం చేయించామని టీజీపీఎస్సీ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. గ్రూప్–1 నియామకాలు ఆలస్యమైతే ఎంపికైన అభ్యర్థులు నష్టపోతారని పేర్కొన్నారు. వాదనలు విన్న న్యాయస్థానం గ్రూప్–1 నియామకాలపై స్టే విధించింది. సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేయొచ్చని ఆదేశించింది. గ్రూప్–1 నియామకాలపై విధించిన స్టేను ఎత్తివేయాలని కోరుతూ గ్రూప్–1కు ఎంపికైన నలుగురు అభ్యర్థులు ఉన్నత న్యాయస్థానంలో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ



రోజు విచారణ సందర్భంగా స్టే వెకెట్ పిటిషన్లపై వాదనలు జరిగాయి. కౌంటరు దాఖలు చేయడానికి టీజీపీఎస్సీ, ఇతర న్యాయవాదులు సమయం కోరారు. విచారణను ఆలస్యం చేయొద్దని, దీని వల్ల ఎంపికైన అభ్యర్థులకు ఇబ్బందులు ఉంటాయని హైకోర్టు తెలిపింది. వినిపించిన వాదనలే మళ్లీ వినిపించొద్దని, ఈనెల 30న పూర్తి స్థాయి వాదనలు వింటామని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.




## ఎమ్మెల్యే కోసం యువకులు వీరంగం.. ఎందుకంటే..

నల్గొండ : మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి రాకపోవడంతో ఆయన అభిమానులు తీవ్ర నిరాశ నిస్పృహలకు లోనయ్యారు. ఆ క్రమంలో చండూరులో ఇద్దరు యువకులు వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వకుంటే.. తాము వాటర్ ట్యాంక్‌పై నుంచి దూకేస్తామంటూ వారు బెదిరించారు. దీంతో స్థానికులు వెంటనే స్పందించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వాటర్ ట్యాంక్ వద్దకు చేరుకుని.. వారిని కిందకు దింపేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు తనకు మంత్రి పదవి రాకపోవడంపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తన ఎక్స్ ఖాతా వేదికగా బుధవారం స్పందించారు. కొత్తగా మంత్రి పదవులు పొందిన ఎమ్మెల్యేలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఇంతకీ ఆయన ఏమన్నారంటే.. తెలంగాణ కేబినెట్‌లో నూతనంగా నియమితులైన మంత్రులను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. ప్రజలకు సేవ చేయడంలో వారికి సంపూర్ణ విజయం కోరుకుంటున్నాను. నాకు రాజకీయాలు అంటే పదవులు గానీ, అధికారాలు గానీ కాదు. ప్రజల పట్ల నా నిబద్ధత, తెలంగాణ పునర్నిర్మాణం పట్ల నా కలలే నాకు ప్రేరణగా నిలిచాయి. అదే కారణంగా నేనే తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చాను. ఈ రోజు నేను మంత్రిగా లేక పోయినా, పార్టీని బలపరిచే ప్రయత్నాల్లో, ప్రజల మద్దతుతో ముందుకు సాగుతాను. ప్రజల సమస్యలు వినడంలో, వారి హక్కుల కోసం పోరాడడంలో, వారి గొంతుకను ప్రభుత్వం వరకు తీసుకెళ్లడంలో నేను ఎప్పటికీ ముందుంటాను. నా రాజకీయ ప్రయాణం ఇక్కడితో ఆగదు. కొన్నిసార్లు, పదవి లేకుండానే ప్రజల మధ్య పని చేసే అవకాశం ఎంతో శక్తివంతంగా మారుతుంది. అదే మార్గాన్ని నేను ఎంచుకున్నానన్నారు.

**ఇంతకీ ఏమైందంటే..** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. తన కేబినెట్‌ను ఇటీవల పునర్వ్యవస్థీకరించారు. ఈ నేపథ్యంలో ముగ్గురు కొత్త వారికి ఆ కేబినెట్‌లో చోటు కల్పించారు. అయితే ఈ కేబినెట్‌లో తమకు చోటు దక్కుతోందంటూ పలువురు సీనియర్ ఎమ్మెల్యేలు ఆశించారు. కానీ వారికి చోటు దక్కలేదు. ఈ నేపథ్యంలో వారంతా తీవ్ర నిరాశ చెందారు. ఆ క్రమంలో తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల బాధ్యురాలు మీనాక్షి నటరాజన్‌తోపాటు మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు.. సదరు ఆశావాహుల ఇళ్లకు వెళ్లి బుజ్జగించిన సంగతి తెలిసిందే. ఇక ఈ జాబితాలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సైతం ఉన్నారు. ఆయన కూడా తీవ్ర నిరాశకు గురయ్యారు. ఆయన్ని సైతం పార్టీ పెద్దలు బుజ్జగించినట్లు సమాచారం.

అదీకాక రేవంత్ రెడ్డి కేబినెట్‌లో పలువురు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు ఉన్నారు. ఈ నేపథ్యంలో సామాజిక వర్గాల సమీకరణాల దృష్ట్యా వివిధ వర్గాల వారికి ఈ కేబినెట్‌లో చోటు కల్పించాలని పార్టీ అధిష్టానం నిర్ణయించింది. అందులోభాగంగా వివిధ సామాజిక వర్గాలకు చెందిన ముగ్గురికి కేబినెట్‌లో చోటు కల్పించింది. ఇంకోవైపు రేవంత్ రెడ్డి కేబినెట్‌లో మరో మూడు మంత్రి పదవులను భర్తీ చేయాల్సి ఉంది. వాటిని భవిష్యత్తులో భర్తీ చేసే అవకాశముందని పార్టీ వర్గాల్లో ఒక చర్చ అయితే నడుస్తోంది.

## అలా చేస్తే ఎంతటి వారినైనా వదలం.. పోలీస్ శాఖ హెచ్చరిక

హైదరాబాద్, జూన్ 11: చేవెళ్లలోని త్రిపుర రిసార్ట్‌పై పోలీసులు ఆకస్మిక దాడులు చేశారు. ఈ రిసార్ట్‌లో ఫోక్ సింగర్ మంగ్లీ బర్త్‌డే పార్టీ నిర్వహిస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి దాటక కూడా పెద్దఎత్తున డీజే శబ్దాలు రావడంతో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు రిసార్ట్‌పై ఒక్కసారిగా మెరుపు దాడి చేశారు. ఈ క్రమంలో పార్టీలో పెద్దఎత్తున విదేశీ లిక్కర్ పట్టుబడింది. అంతేకాకుండా గంజాయి సేవిస్తూ ఓ వ్యక్తి పోలీసులకు చిక్కాడు. మంగ్లీ తీరుపై సీరియస్ అయిన పోలీసులు ట్వీట్ వేదికగా కౌంటర్ ఇచ్చారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారిపై అయినా చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు.




**పోలీసుల ట్వీట్....** 'అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్న రిసార్ట్‌పై చేవెళ్ల పోలీసులు దాడి చేశారు. చట్టాలు పాటించకుండా ఎలా పడితే అలా వ్యతిరేకంగా వ్యవహరిస్తామంటే పోలీసులు ఝులిపించి గాడినపెట్టాల్సి వస్తుంది. ఎంతటి ప్రముఖులైనా డ్రగ్స్ లాంటి వాటిని వాడే వారి పట్ల కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడం' అంటూ తెలంగాణ పోలీసు శాఖ ట్వీట్ చేసింది. కాగా.. సింగర్ మంగ్లీ బర్త్‌డే పార్టీలో గంజాయి కలకలం రేపింది. చేవెళ్లలోని త్రిపుర రిసార్ట్‌లో నిన్న (మంగళవారం) రాత్రి సింగర్ మంగ్లీ పుట్టిన రోజు పార్టీని నిర్వహించారు. ఈ పార్టీకి సెలబ్రిటీలు దివి, కాసర్ల శ్యామ్, జబర్దస్త్ రవి, సింగర్ ఇంద్రావతి హాజరయ్యారు. అయితే ఎంతో ఉల్లాసంగా జరుగుతున్న బర్త్‌వేడుకల్లో పోలీసులు ఎంట్రీ ఇచ్చి షాకిచ్చారు. రిసార్ట్ నుంచి పెద్ద శబ్దాలు రావడంతో స్థానికులు ఇచ్చిన సమాచారంతో చేవెళ్ల పోలీసులు రిసార్ట్‌పై దాడి చేశారు. త్రిపుర రిసార్ట్‌లో విపరీతమైన సౌండ్ పొల్యూషన్‌తో మంగ్లీ పార్టీ నిర్వహించింది. పార్టీకి వచ్చిన ఫ్రెండ్స్‌కు మంగ్లీ లిక్కర్ సరఫరా చేయించింది. పార్టీ కోసం పెద్దఎత్తున విదేశీ లిక్కర్‌ను తెప్పించారు. పార్టీకి అటెండ్ అయిన ఓ వ్యక్తికి గంజాయి పాజిటివ్ అని నిర్ధారణ అయ్యింది. రైడ్ చేసే సమయంలో రిసార్ట్‌లో మంగ్లీకి సంబంధించిన 50మంది సన్నిహితులు ఉన్నారు. మొత్తం 48 మందికి పోలీసులు డ్రగ్స్ టెస్ట్ చేశారు. టెస్ట్ సమయంలో పార్టీలో పాల్గొన్నవారు పోలీసులను ముప్పు తిప్పలు పెట్టారు. డ్రగ్ పరీక్షల సమయంలో పోలీసులతో మంగ్లీ స్నేహితురాలు దివి ర్యాష్‌గా బిహేవ్ చేసినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా సోదాలు జరపడానికి వచ్చిన పోలీసులపై సింగర్ మంగ్లీ వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. పార్టీకి ఎలాంటి అనుమతి లేదని పోలీసులు చెబుతున్నా సరే.. సింగర్ మంగ్లీ వారిపై దురుసుగా ప్రవర్తించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో బర్త్‌డే రోజే మంగ్లీపై చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది.

## మోదీ ఇచ్చిన హామీల పరిష్కారానికి డేట్ చెప్పాలి: తమ్మినేని వీరభద్రం




హైదరాబాద్: ఆపరేషన్ కగార్ పేరుతో చేస్తున్న హత్యాకాండను తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఎం కేంద్రకమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆపరేషన్ కగార్ నిలిపివేయాలంటూ శాంతిచర్చల కమిటీ హైదరాబాద్‌లో మీడియా సమావేశం నిర్వహించింది. కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ... దేశంలో పేదరికాన్ని తొలగిస్తే వామపక్ష ఉగ్రవాదం ఉండదన్నారు. "మావోయిస్టులను 2026 మార్చి 31 నాటికి అంతం చేస్తామని ప్రకటిస్తున్నారు. నరేంద్రమోదీ ఇచ్చిన హామీల పరిష్కారానికి డేట్ చెప్పాలి. శాంతి చర్చల కమిటీ 17న చేపట్టే మహాధర్నాను పార్టీలకు అతీతంగా విజయవంతం చేయాలి" అని కోరారు. కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే అనిల్ కుమార్, ప్రొఫెసర్ హరగోపాల్, జస్టిస్ చంద్రకుమార్, చెరుకు సుధాకర్, వామపక్ష పార్టీల నేతలు సమావేశంలో పాల్గొన్నారు.

## కేసీఆర్‌ను అర్థం చేసుకునేందుకు కాంగ్రెస్ నేతలకు జీవితకాలం చాలదు: కేటీఆర్



హైదరాబాద్: మాజీ సీఎం, భారాస అధినేత కేసీఆర్ జీవితం ఒక చరిత్రగా నిలిచిపోతుందని పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఈమేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. 60 ఏళ్లలో జరగని పనులను కేసీఆర్ విజయవంతంగా పూర్తి చేశారని పేర్కొన్నారు. కేవలం తెలంగాణ కోసమే ఆయన పనిచేశారని చెప్పారు. కాళేశ్వరం ద్వారా కరవుకు పరిష్కారం చూపించారని వివరించారు. కేసీఆర్‌ను అర్థం చేసుకునేందుకు కాంగ్రెస్ నేతలకు జీవితకాలం చాలదన్నారు. కాళేశ్వరం కమిషన్ ముందు కేసీఆర్ మరికాసేపట్లో హాజరు కానున్నారు. బీఆర్కే భవన్‌లో విచారణకు వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలోనే కేటీఆర్ 'ఎక్స్'లో తాజాగా పోస్టు చేశారు.

**చేవెళ్ల గ్రామీణం: సింగర్ మంగ్లీ బర్త్‌డే పార్టీలో విదేశీ మద్యం, గంజాయి లభ్యమయ్యాయి. పుట్టినరోజు సందర్భంగా రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఈర్లపల్లి శివారులోని రిసార్టులో స్నేహితులకు మంగళవారం రాత్రి ఆమె పార్టీ ఇచ్చారు. ఈ వేడుకలకు సుమారు 50 మంది వరకు మంగ్లీ కుటుంబ సభ్యులు, స్నేహితులు హాజరయ్యారు. వీరిలో సినీ పరిశ్రమకు చెందిన వారు కూడా ఉన్నట్లు సమాచారం. ఈక్రమంలో రాత్రి 2 గంటల సమయంలో ఎస్‌వోటీ పోలీసులు రిసార్టుపై దాడులు చేశారు. పార్టీకి వచ్చిన వారిలో 48 మందికి గంజాయి పరీక్షలు నిర్వహించగా 9 మందికి పాజిటివ్ వచ్చినట్లు అధికారులు తెలిపారు. దీంతో వారిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.**



చురకలు


# ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధికి జలగం అవిశ్రాంత కృషి

## - జూన్ 12.... జలగం వెంగళరావు వర్ధంతి



జలగం వెంగళరావు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ కు 6 వ ముఖ్యమంత్రి, నక్సలైట్లను ఉక్కుపాదంతో అణచి వేసిన ముఖ్యమంత్రిగా ఆయన దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాడు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో మంత్రిపదవులు నిర్వహించాడు. జలగం వెంగళరావు 1922, మే 4న శ్రీకాకుళం జిల్లా రాజాంలో జన్మించాడు. 20వ ఏట ఖమ్మం జిల్లా, పెనుబల్లి మండలం బయ్యన్నగూడెం వచ్చి స్థిరపడి, నైజాం వ్యతిరేక పోరాటాన్ని ఆ ప్రాంతం నుంచే ప్రారంభించిన వెంగళరావు.. జెడ్పీ చైర్మన్‌గా, రాష్ట్ర హోం మంత్రిగా, ముఖ్యమంత్రిగా, పీ సీ సీ అధ్యక్షునిగా, కేంద్ర మంత్రిగా విధులు నిర్వర్తించారు. తన 20 వ ఏట నిజాముకు వ్యతిరేకంగా సాయుధ పోరాటంలో పాల్గొన్నాడు. తెలంగాణ ప్రాంతంలో అమలవుతున్న కౌలుదారీ చట్టాలను నిరసిస్తూ చేపట్టిన ఈ ప్రచారంలో పాల్గొని రెండు సార్లు జైలుకు వెళ్ళాడు. 1952 లో శాసనసభకు స్వతంత్రుడిగా పోటీ చేసి ఓడిపోయాడు. 1952 నుండి 1962 వరకు ఆయన కాంగ్రెసు పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా ఉన్నాడు. 1962లో కాంగ్రెసు పార్టీ అభ్యర్థిగా ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం నుండి గెలిచి, 1978 వరకు మరో మూడు సార్లు సత్తుపల్లి నియోజకవర్గానికి శాసనసభలో ప్రాతినిధ్యం వహించాడు. 1967లో పంచాయితీరాజ్ ఛాంబరు చైర్మనుగా ఎన్నికయ్యాడు. కాసు బ్రహ్మానంద రెడ్డి మంత్రివర్గంలో 1969 నుండి 1971 వరకు హోంమంత్రిగా, పి.వి.నరసింహారావు మంత్రివర్గంలో 1972-73 లో పరిశ్రమల మంత్రిగా పనిచేసాడు. జై ఆంధ్ర ఉద్యమ ఫలితంగా రాష్ట్రంలో విధించిన రాష్ట్రపతి పాలన ఎత్తివేసిన తరువాత వెంగళరావు ముఖ్యమంత్రి పదవికి ఎంపికయ్యాడు. 10 డిసెంబర్ 1973 నుండి 6 మార్చి 1978 వరకు ఆంధ్రప్రదేశ్ 5వ ముఖ్యమంత్రిగా పనిచేశాడు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణ ప్రాంతంలో కాకతీయ విశ్వవిద్యాలయం, కోస్తా ఆంధ్ర ప్రాంతంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, రాయలసీమ ప్రాంతంలో శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అనే మూడు విశ్వవిద్యాలయాలు ప్రారంభించబడ్డాయి. 1975లో హైదరాబాద్ నగరంలో ప్రపంచ తెలుగు మహాసభలు ప్రారంభించాడు. ఆయన పాలనా కాలంలోనే ఇందిరా గాంధీ దేశంలో ఎమర్జెన్సీ (ఆత్యయిక పరిస్థితి) ని విధించింది. ముఖ్యమంత్రిగా వెంగళరావు మంచి పరిపాలకుడిగా పేరుతెచ్చుకున్నాడు. నక్సలైటు ఉద్యమాన్ని కఠినంగా అణచి వేసాడు. ఎన్‌కౌంటర్ల వ్యాప్తికి కారకుడిగా విమర్శలు తెచ్చుకున్నాడు. తెలుగు సినిమా పరిశ్రమ హైదరాబాదులో నిలదొక్కుకొనేందుకు చేయూత నిచ్చాడు. మొదటి ప్రపంచ తెలుగు మహాసభలను విజయవంతంగా నిర్వహించాడు. అప్పటికి కొన్ని సంవత్సరాల ముందే ముగిసిన ప్రత్యేక తెలంగాణా ఉద్యమం, జై ఆంధ్ర ఉద్యమాల నేపథ్యంలో ఈ సభలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. 1975 సంవత్సరాన్ని తెలుగు సాంస్కృతిక సంవత్సరంగా ప్రకటించి పలు కార్యకలాపాలు చేపట్టారు. నాగార్జున సాగర్ ఎడమ కాలువను ఏన్నొ వ్యయప్రయాసలకు ఓర్చి అభివృద్ధికి కృషి చేశాడు. కాంగ్రెసు పార్టీ చీలిపోయి కాంగ్రెసు (ఐ) ఏర్పడినపుడు, వెంగళరావు కొన్నాళ్ళు పార్టీకి దూరమయి,. మళ్ళీ 1984 లో కాంగ్రెసుకు తిరిగి వచ్చి, 1984, 1991 మధ్య ఖమ్మం నియోజకవర్గం నుండి లోక్‌సభకు రెండుసార్లు ప్రాతినిధ్యం వహించాడు. 1986 నుండి 1989 వరకు కేంద్ర పరిశ్రమల మంత్రిగా పనిచేసాడు. మంజీరాపై సింగూరు ప్రాజెక్ట్, పోచంపాడు ప్రాజెక్టు, కరీంనగర్ దిగువ మానేరు బ్యాలెన్స్ రిజర్వాయర్, శ్రీశైలం హైడల్ పాజెక్ట్ , రామగుండం సూపర్ ధర్మల్ స్టేషన్, పాల్వంచ విజయవాడ దిగువ సిలేరులలో విధ్యుత్ కేంద్రాలు, ప్రతీ గ్రామంలో ప్రాధమిక పాటశాలలు, ఎన్నో కళాశాలలు నెలకొల్పడం లాంటి ఎన్నో చిర కాలం గుర్తుంది పోయే కార్యక్రమాలు చేశాడు. 1999 జూన్ 12 న హైదరాబాదులో వెంగళరావు మరణించాడు. ఆయన ఇద్దరు కుమారులు... జలగం ప్రసాదరావు, జలగం వెంకటరావు రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్నారు. **రామ కిష్టయ్య సంగనభట్ల...9440595494**

# హెచ్.ఎం. రెడ్డి: తెలుగు సినిమా ఆద్యుడు

## జూన్ 12...హనుమప్ప మునియప్ప రెడ్డి జయంతి



తెలుగు సినిమా చరిత్రను పరిశీలించిన ప్రతీసారీ ముందు కనిపించే వ్యక్తిత్వం హెచ్.ఎం. రెడ్డి %-% హనుమప్ప మునియప్ప రెడ్డి. ఆయన తెలుగు సినిమాకు శబ్దాన్ని ఇచ్చిన దర్శకుడు, తొలి టాకీ చిత్రానికి దర్శకుడు, నిర్మాణానికి పునాదులు వేసిన విజనరీ. 1892 జూన్ 12న మద్రాసు ప్రెసిడెన్సీ లోని అనంతపురం జిల్లా చిత్తంపల్లి గ్రామంలో జన్మించిన ఆయన, బాల్యంలో నుంచే నాటకాలపై మక్కువ కలిగి, అనంతపురంలో విద్యాభ్యాసం పూర్తిచేశారు. తరువాత ముంబైకి వెళ్లిన హెచ్.ఎం. రెడ్డి, అక్కడి రాయల్ టర్ఫ్ క్లబ్‌లో ఉద్యోగం చేస్తూ, సినిమాలపై ఆసక్తిని పెంచుకున్నారు. కొల్హాపూర్‌లో బాబురావు పెయింటర్ వద్ద దర్శకత్వ విద్యాభ్యాసం పూర్తి చేసిన అనంతరం, బొంబాయిలో అర్దేషీర్ ఇరానీ స్థాపించిన ఇంపీరియల్ ఫిలిం కంపెనీలో చేరి, స్క్రిప్టింగ్, సహాయ దర్శకత్వంలో అనుభవాన్ని సంపాదించారు. భారతదేశ తొలి టాకీ చిత్రం "ఆలం ఆరా" (1931) విజయాన్ని చూసిన వెంటనే, తెలుగులో కూడా టాకీ చిత్రాన్ని తీసే సంకల్పంతో ఆయన ముందు కొచ్చారు. ధర్మవరం రామకృష్ణమాచార్యుల రచన ఆధారంగా, ముంబైలోని ఇంపీరియల్ ఫిలిం కంపెనీ భాగస్వామ్యంతో 1931లో "భక్త ప్రహ్లాద" చిత్రాన్ని నిర్మించి, దర్శకత్వం వహించారు. సెప్టెంబరు 15న విడుదలైన ఈ చిత్రం తెలుగు సినీ చరిత్రలో ఓ శాశ్వత స్థానాన్ని సంపాదించగా, హెచ్.ఎం. రెడ్డి పేరు తొలి తెలుగు టాకీ దర్శకుడిగా చరిత్రలో మిగిలి పోయింది. ఆయన చిత్రాలు పౌరాణికం నుంచి సామాజిక అంశాల వరకు విస్తరించాయి. "ద్రౌపదీ వస్త్రాపహరణం" (1936) వంటి పౌరాణిక చిత్రాలతో పాటు, "ఇలవేలుపు" (1951), "నిర్దోషి" (1951), "ఎవరు దొంగ" (1961), "పూజ" (1967) వంటి సామాజిక చిత్రాలతోనూ ఆయన విలక్షణతను చూపించారు. కథన శైలిలో లోతు, పాత్రలలో సజీవత, సాంకేతిక నైపుణ్యంలో చాతుర్యం ఆయన దర్శకత్వాన్ని ప్రత్యేకంగా నిలిపాయి. కమలాకర కామేశ్వరరావు, సదాశివ బ్రహ్మం, కొండముది గోపాలరాయ శర్మ, మల్లాది వెంకటకృష్ణ శర్మ, కొవ్వలి, భమిడిపాటి కామేశ్వరరావు, శ్రీశ్రీ - ఇలా ఎందరో మహామహులను వెండి తెరకు పరిచయం చేసిన ఘనులు హెచ్.ఎమ్.రెడ్డి కేవలం సినిమాలు తీయడమే కాకుండా, పరిశ్రమకు మౌలిక నిర్మాణాన్ని కల్పించాలన్న లక్ష్యంతో 1947లో చెన్నైలో "రోహిణి పిక్చర్స్" అనే తొలి తెలుగు నిర్మాణ సంస్థ స్థాపించారు. ఈ సంస్థ ద్వారా పలు ప్రతిభావంతులను తెలుగు సినీ ప్రపంచానికి పరిచయం చేశారు. తరువాతి రోజుల్లో వచ్చిన బి.ఎన్. రెడ్డి, కె.వి. రెడ్డి, ఎల్.వి. ప్రసాద్ వంటి దర్శకులపై ఆయన ప్రభావం స్పష్టంగా కనిపించింది. మద్రాసులో రోహిణి స్టూడియో కట్టారు. ప్రయోగాలు చెయ్యడంలో కూడా హెచ్.ఎమ్.దిట్ట. అంతవరకూ విలన్ వేషాలే వేస్తున్న ముక్కామలని నిర్దోషిలో హీరోని చేశారు. వాంప్ వేషాలు ఎక్కువగా వేసిన అంజలీ దేవిని నిర్దోషి (1951) తో హీరోయిన్‌ని చేశారు. నిర్దోషిలో ఓ చిన్నవేషంలో కనిపించిన కాంతారావుని ప్రతిజ్ఞతో హీరోని చేశారు. అలాగే ప్రతిజ్ఞలో విలన్ రాజనాలకు అదే తొలిచిత్రం. సినిమాను కేవలం వినోదంగా కాకుండా, సమాజంలోని సమస్యలపై చైతన్యం కలిగించే మాధ్యమంగా ఆయన అభివృద్ధి చేశారు. పాత్రలలో తాత్వికత, కథలలో సందేశాత్మకత, దృశ్యాలలో నైతికతను సమపాళ్లలో మిళితం చేసి ప్రేక్షకుల మనస్సుల్లో స్థిరమైన ముద్రవేశారు. హెచ్.ఎం. రెడ్డి 1960 జనవరి 14న కన్ను మూశారు. కానీ ఆయన సేవలు, భవిష్యత్ తెలుగు సినిమాకు పునాదులుగా నిలిచిన మార్గదర్శకత్వం, ఆయన సినిమాల్లో ప్రతిఫలించిన విజ్ఞాన దృష్టి, నేటికీ సినీ చరిత్రలో జీవించిపోతున్నాయి. తెలుగు చలనచిత్రం రూపు దిద్దుకున్న దశలో ఆయన చూపిన దిక్సూచి, నేటి తెలుగు సినీ రంగపు శక్తివంతమైన వ్యవస్థకు మూలస్తంభంగా నిలిచింది. తెలుగు సినిమా పితా మహుడు అనిపించుకున్న హెచ్.ఎం. రెడ్డి కళా తపస్సు, సంకల్ప బలం, సాంకేతిక సాహసాన్ని మరవ లేము. ఆయన పాటించిన మార్గం, చూపిన దారిలోనే తెలుగు సినిమా వృద్ధి చెందింది. ఆయన ఆవేశం, ఆలోచన, ఆరాధన %-% ఇవన్నీ కలిసిన రూపమే నేటి తెలుగు సినిమా మహా సాగరం. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**




యాచారం: రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని మాల్ వద్ద రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. నాగార్జునసాగర్ రహదారిపై కారును బస్సు ఢీకొట్టిన ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతులను మహబూబ్‌నగర్‌కు చెందిన సాయితేజ, పవన్, రాఘవేంద్రగా గుర్తించారు. వీరంతా ఉద్యోగాలు చేస్తూ హైదరాబాద్‌లో నివాసముంటున్నారు.

మంగళవారం ఏడుగురు స్నేహితులు నాగార్జునసాగర్ పరిధిలోని వైజాగ్ కాలనీకి విహారానికి వెళ్లారు. అర్ధరాత్రి తిరుగు ప్రయాణంలో మాల్ వద్ద వీరి కారును బస్సు ఢీకొంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అమెరికాలో ట్రంప్ ట్రావెల్ బ్యాన్ అమలు.. ఎయిర్ పోర్టుల్లో ప్రయాణికులకు నరకం





అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆఫ్రికా, మిడిల్ ఈస్ట్ సహా 12 దేశాల పౌరులపై విధించిన ప్రయాణ నిషేధం (ట్రావెల్ బ్యాన్) అమల్లోకి వచ్చింది. ఈ నిషేధం కారణంగా అమెరికాలోని విమానాశ్రయాల్లో చాలా మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


నిషేధిత దేశాల నుంచే కాకుండా ఇతర దేశాల నుంచి వస్తున్న వారిని కూడా అమెరికా అధికారులు మరింత క్షుణ్ణంగా ప్రశ్నిస్తున్నారు. ఈ పరిణామం అమెరికాకు ప్రయాణించాలనుకుంటున్న వారికి ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే చెల్లుబాటయ్యే వీసాలు ఉన్న ప్రయాణికులు కూడా విమానాశ్రయాల్లో విస్తృతమైన తనిఖీలను ఎదుర్కొంటున్నారు.

**-గ్వాటెమాలన్ దంపతుల అనుభవం:** ఈ సోమవారం గ్వాటెమాల పౌరులు విన్సెంటా అగ్యిలార్ , ఆమె భర్త మయామి అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. వారికి గత వారం టూరిస్ట్ వీసాలు మంజూరయ్యాయి. అయితే విమానాశ్రయంలో అమెరికా అధికారులు వారిని మూడు వేర్వేరు ఇంటర్వ్యూలు చేశారు. ఈ అనుభవం తమను ఆందోళనకు గురిచేసిందని విన్సెంటా అగ్యిలార్ మీడియాకు తెలిపారు. అధికారులు తమ ఉద్యోగం, పిల్లల సంఖ్య, చట్టపరమైన సమస్యలు తలెత్తితే ప్రయాణ ఖర్చులను ఎలా భరిస్తారు, అమెరికాలో ఎన్ని రోజులు ఉంటారు వంటి ప్రశ్నలు అడిగారని ఆమె వివరించారు. అగ్యిలార్ కుమారుడు 22 ఏళ్ల క్రితం గ్వాటెమాల నుంచి అమెరికాకు వలస వచ్చారు. అప్పటి నుండి అగ్యిలార్ దంపతులు అమెరికాకు రాలేదు, ఇప్పుడు తమ కుమారుడిని చూడడానికి వచ్చారు. తమ విమానం ల్యాండ్ అయిన తర్వాత గంటసేపటి వరకు తాము అక్కడే ఉన్నామని అగ్యిలార్ తెలిపారు. గ్వాటెమాల ట్రంప్ కొత్తగా విధించిన నిషేధిత దేశాల జాబితాలో లేదు. అయినప్పటికీ, ఈ దంపతులు ఎదుర్కొన్న అనుభవం, నిషేధిత దేశాల నుంచే కాకుండా ఇతర దేశాల నుంచి వస్తున్న ప్రయాణికులను కూడా అధికారులు మరింత క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారని స్పష్టం చేస్తుంది.

**-నిషేధిత దేశాల జాబితా:** గత వారం ట్రంప్ విధించిన నిషేధిత దేశాల జాబితాలో ఆఫ్ఘనిస్థాన్, మయన్మార్, చాడ్, ది రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఈక్వటోరియల్ గినియా, ఎరిట్రియా, హైతీ, ఇరాన్, లిబియా, సోమాలియా, సుడాన్, యెమెన్ ఉన్నాయి. వీటితో పాటు, బురుండి, క్యూబా, లావోస్, సియెర్రా లియోన్, టోగో, తుర్క్మెనిస్థాన్, వెనిజులా ప్రజలపై ఉన్న ఆంక్షలు పెరిగాయి. అమెరికాలో అక్రమ వలసదారుల అరెస్టులతో లాస్ ఏంజెలెస్ నగరంలో ప్రజలు పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతున్న సమయంలోనే ఈ ట్రావెల్ బ్యాన్ కూడా అమల్లోకి రావడం గమనార్హం. ట్రంప్ మొదటిసారి అధ్యక్షుడిగా ఉన్న 2017లో విధించిన ట్రావెల్ బ్యాన్ సమయంలో విమానాశ్రయాల్లో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. అయితే, ప్రస్తుతం అంతగా సమస్యలు లేకుండానే ఈ ట్రావెల్ బ్యాన్ అమలవుతున్నప్పటికీ, ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు మాత్రం కొనసాగుతున్నాయి.

## చనిపోయాక ఏం జరిగిందంటే? చచ్చి బతికిన మహిళ వెల్లడి


పుట్టుక, ఎదుగుదల, వృద్ధాప్యం, చివరికి మరణం. ఇవి జీవిత చక్రంలో సహజంగా జరిగే పరిణామాలు. ఒక మనిషి తల్లి గర్భం నుంచి పుట్టిన తర్వాత శరీరంలో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటాయి. అయితే, వృద్ధాప్యం తర్వాత మరణం సంభవించినప్పుడు ఏమి జరుగుతుంది అనే ప్రశ్న ఎప్పటి నుంచో మానవాళిని వెంటాడుతోంది. సినిమాలు, కల్పిత సాహిత్యంలో ఎన్నో ఊహాత్మక విషయాలు చెప్పినప్పటికీ, వాటికి శాస్త్రీయ ఆధారం లేదు. మరణానంతర జీవితం గురించి తెలుసుకోవడానికి శాస్త్రవేత్తలు లోతుగా పరిశోధనలు చేస్తున్నప్పటికీ మరణానికి దగ్గరగా వెళ్లి ఆ అనుభవాలను తెలుసుకోవడం కష్టమని వారు అంగీకరించారు. ఈ నేపథ్యంలో అమెరికాలోని కొలరాడో ప్రాంతానికి చెందిన 33 ఏళ్ల బ్రయానా లాఫర్జీ అనే మహిళ తన వినూత్న అనుభవంతో సంచలనం సృష్టించారు. ఇటీవల ఆమె 8 నిమిషాల పాటు క్లినికల్ మరణాన్ని చవిచూసి, ఆ తర్వాత తన అనుభవాలను వెల్లడించారు. ఆమె చెప్పిన విషయాలు ఆశ్చర్యకరంగా ఉన్నాయి. బ్రయానా లాఫర్జీ అనుభవం అందరినీ ఆశ్చర్యపరిచింది.. "శరీరానికి చావుంది, ఆత్మకు లేదు" అని తెలిపింది. బ్రయానా లాఫర్జీ మైక్లోనస్ డైస్టోనియా అనే ప్రాణాంతక మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఇటీవలే ఆమె 8 నిమిషాల పాటు క్లినికల్ మరణాన్ని అనుభవించినప్పుడు జరిగిన పరిణామాలను బయటపెట్టారు. ఆమె మాటల్లో "నేను కన్ను మూసిన తర్వాత మొత్తం చీకటిగా కనిపించింది. కొంత సమయం తర్వాత నేను ఇంకో లోకంలోకి వెళ్ళిపోయాను. వైద్యులు నన్ను వైద్యపరంగా చనిపోయినట్లు ప్రకటించారని నాకు అర్థమైంది, కానీ నేను మాత్రం స్పృహలోకి వచ్చినట్లు అనిపించింది. నా శరీరం నుండి భౌతికంగా వేరు చేయబడినట్లు భావన కలిగింది. నేను అప్పటికే బతికే ఉన్నాననే అనుభూతి నాకు దక్కింది. కన్నుమూసేటప్పుడు నాకు ఎటువంటి నొప్పి, బాధ కలగలేదు. కేవలం మనశ్శాంతి మాత్రమే మెండుగా దక్కింది." అని ఆమె పేర్కొంది. "శరీరం నుంచి వేరుపడిన తర్వాత నా ఆత్మ దేహం నుంచి అలా ఎగురుకుంటూ వెళ్లిపోయింది. అక్కడ మనుషులు లేరు, కాకపోతే వేరే రకమైన జీవులు ఉన్నాయి. అక్కడ సమయం ఎలా ఉంటుందో తెలియదు గానీ, ప్రతిదీ సందర్భం ప్రకారం జరుగుతోంది. మనుషులుగా మనం కేవలం తాత్కాలికం మాత్రమే. మరణం తర్వాత మనిషి ఆలోచన సరళి పూర్తిగా మారిపోతుంది." అని పేర్కొంది.



**క్లినికల్ మరణం తర్వాత బ్రయానా ఎదుర్కొన్న సమస్యలు...** బ్రయానా లాఫర్జీ ఈ లోకానికి తిరిగి వచ్చిన తర్వాత అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. నడవడంలో తడబడటం, మాట్లాడటంలో ఇబ్బంది పడటం వంటి సమస్యలు తలెత్తాయి. పిట్యూటరీ గ్రంథిలో కూడా ఆమె సమస్యను ఎదుర్కొన్నారు. చివరికి ఆమె మెదడుకు సంబంధించిన శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చింది. బ్రయానా లాఫర్జీ అనుభవం మరణం తర్వాత ఏమి జరుగుతుందనే దానిపై కొత్త చర్చకు దారితీసింది. ఆమె చెప్పిన విషయాలు శాస్త్రీయంగా నిరూపించబడనప్పటికీ, మరణానంతర అనుభవాలపై ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

## చెనాబ్ రైల్వే బ్రిడ్జ్ విజయంపై తొలిసారి స్పందించిన ప్రొఫెసర్ డా. జి. మాధవి లత

ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన చెనాబ్ రైల్వే వంతెనను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన నేపథ్యంలో ఈ ప్రాజెక్ట్ విజయం వెనుక సామూహిక కృషి ఉందని, వ్యక్తిగత ప్రచారం తగదని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ప్రొఫెసర్ డా. జి. మాధవి లత స్పష్టం చేశారు. చెనాబ్ రైల్వే బ్రిడ్జ్ నిర్మాణం భారత దేశానికి గర్వకారణమైన ఘనత అని డా. మాధవి లత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారత రైల్వేలు, AFCONS సంస్థల అద్భుతమైన ప్రణాళిక, రూపకల్పన, నిర్మాణ నైపుణ్యానికి ఈ బ్రిడ్జ్ నిదర్శనమని ఆమె కొనియాడారు. ఈ చారిత్రాత్మక ప్రాజెక్ట్ విజయవంతమవడానికి వందలాది మంది నిపుణులు, కార్మికులు, ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులు అనేక రకాలుగా కృషి చేశారని, వారందరూ నిజమైన గుండెచప్పుడు లేని వీరులని ఆమె అభివర్ణించారు. ఈ ప్రాజెక్టులో



AFCONS కు జియోటెక్నికల్ కన్సల్టెంట్‌గా తాను స్లోప్ స్టెబిలైజేషన్ , ఫౌండేషన్స్ రూపకల్పనలో సహకరించినట్లు డా. మాధవి లత తెలిపారు. అయితే "ఈ మిషన్ వెనుక ఉన్న మహిళ", "అసాధ్యాన్ని సాధ్యమైంది చేసింది", "వింతలు చేసింది" అంటూ కొంత మీడియా చేసిన వ్యాఖ్యలు అసత్యమని ఆమె స్పష్టం చేశారు.

ఈ ప్రాజెక్టుకు వేల మంది శ్రమించారని, ఒకరి కృషిని మాత్రమే ప్రముఖంగా చూపడం తగదని ఆమె అన్నారు. అనేక తండ్రులు తమ కూతుళ్లు ఆమెలాంటి వారిగా ఎదగాలని చెప్పడం, చిన్నపిల్లలు సివిల్ ఇంజనీరింగ్‌లో భవిష్యత్తు చూడాలని అనుకుంటున్నామని రాయడం తనకు ఎంతో ఆనందం కలిగించిందని, ఇది తన జీవితానికి గర్వకారణమని ఆమె తెలిపారు. తనపై ప్రేమను, అభినందనలను వ్యక్తం చేసిన ప్రతి భారతీయుడికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ, తాను కూడా ఈ బ్రిడ్జ్ నిర్మాణానికి కృషి చేసిన వందలాది మందిలో ఒకరినే కాబట్టి తన పేరు మాత్రమే ప్రముఖంగా చూపించవద్దని ఆమె విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం స్పెయిన్‌లోని ఓ సదస్సులో పాల్గొంటున్నానని, తన వ్యక్తిగతతను గౌరవించమని ఆమె కోరారు. ఈ గొప్ప ఘనత మొత్తం భారత రైల్వేలదే అని ఆమె తన ప్రకటనను ముగించారు.

చురకలు

## సంపాదకీయం

# ఆర్సీబీ విజయోత్సవ విషాదం.. కర్ణాటకలో గవర్నర్ వర్సెస్ సీఎం?

గత వారం ఈ సమయానికి రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్టు గెలవాలని కోరుకున్నారు అభిమానులు.. ఇప్పుడు చూస్తే అన్నీ వివాదాలే.. ఆర్సీబీ కప్ కొట్టి 24 గంటలు కూడా గడవక ముందే సొంత నగరం బెంగళూరులో విజయోత్సవాలు జరుపుకోవాలని అనుకోవడం.. ప్రఖ్యాత చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట జరిగి 11 నిండు ప్రాణాలు పోవడం.. పెద్ద విషాదంగా మిగిలిపోయింది. కర్ణాటక రాజధాని బెంగళూరు అంటేనే ట్రాఫిక్ నరకం.. కొన్ని ప్రాంతాలకు క్యాబ్ బుక్ చేస్తే క్యాన్సిలేషన్ ఖాయం అనేది సోషల్ మీడియాలో నడిచే సెటైర్. అలాంటి నగరంలో ఆర్సీబీ విజయోత్సవ ర్యాలీ అంటే పోలీసులు హడలిపోయారు. పర్మిషన్ కుదరదని చెప్పినట్లు మొదట కథనాలు వచ్చాయి. ఆ తర్వాత జట్టు రావడం.. ఎయిర్ పోర్ట్ లో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ రిసీవ్ చేసుకోవడం, సాయంత్రం చిన్నస్వామి స్టేడియం వద్ద సన్మాన కార్యక్రమం.. స్టేడియం బయట తొక్కిసలాట.. ఇలా ఒకదాని వెంట ఒకటి పరిణామాలు చకచకా జరిగిపోయాయి. అయితే, ఇప్పుడు తొక్కిసలాట గవర్నర్–సీఎం మధ్య వివాదంగా మారుతోంది. కర్ణాటక విధాన సౌధలో ఆర్సీబీ జట్టు సన్మాన కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయలేదని సీఎం సిద్ధరామయ్య ప్రకటించడం కీలక మలుపు తీసుకుంది. గవర్నర్ థావర్ చంద్ గెహ్లొత్ ను స్వయంగా ముఖ్యమంత్రే ఆహ్వానించారని గవర్నర్ కార్యాలయం రాజ్ భవన్ ప్రకటించింది. ఇంతకూ ఏం జరిగిందంటే.. తొలుత ఆర్సీబీ జట్టుకు రాజ్ భవన్ లో ఆతిథ్యం ఇవ్వాలని భావించారు. గవర్నర్ కార్యాలయం.. చీఫ్ సెక్రటరీని సంప్రదించి కార్యక్రమాన్ని సమన్వయం చేయాలని కోరింది. అయితే, దీనికి బదులు తామే విధాన సౌధలో నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే ఈ కార్యక్రమానికి హాజరుకావాలని సీఎం సిద్ధు.. గవర్నర్ ను కోరారు అని రాజ్ భవన్ తాజాగా ప్రకటించింది. కాగా, ఈ ప్రకటనపై కర్ణాటక ప్రభుత్వం తనదైన శైలిలో స్పందించింది. 11 మంది చనిపోయిన తొక్కిసలాట జరిగింది చిన్నస్వామి మైదానం వద్ద అని పేర్కొంటోంది. విధాన సౌధ వద్ద కార్యక్రమం ప్రశాంతంగా సాగిందని గుర్తుచేస్తోంది. కాగా, సీఎం తాను ఆహ్వానితుడిని మాత్రమే అని చెబుతున్నారు. ఆర్సీబీ యాజమాన్యం అనవసర హడావుడికి పోయింది. పోలీసులు ప్రజలను నియంత్రించలేకపోయారు. ఏది ఏమైనా... ఎవరి బాధ్యత అయినా 11 నిండు ప్రాణాలు బలి అయ్యాయి. ఇప్పుడు కర్నాటకలో ప్రభుత్వం వర్సెస్ గవర్నర్ వివాదం మొదలైంది. అసలే థావర్ చంద్ గెహ్లొత్ బీజేపీ నేపథ్యం నుంచి వచ్చారు. ఇది ఎక్కడకు దారితీస్తుందో చూడాలి.

# "విశ్వ మానవుడు సి.నా.రె" - జూన్ 12... జ్ఞాన పీఠ అవార్డు గ్రహీత సినారె వర్ధంతి



సి.నా.రె అనే మూడక్షారాలు తెలుగు, ఉర్దూ, సంస్కృతం మూడు భాషల సంగమం. సాహిత్య లోకం, సినీ లోకం, అధ్యాపక లోకం అనే మూడు లోకాల మిశ్రమం. డా. సి. నారాయణరెడ్డి అవిభక్త కరీంనగర్ జిల్లా, వేములవాడ మండలం, హనుమాజిపేట గ్రామంలో కర్షక కుటుంబంలో (గురుపూర్ణిమ)నాడు 29.7.1931 నాడు జన్మించారు. తల్లి బుచ్చమ్మ, తండ్రి మల్లారెడ్డి. నారాయణరెడ్డి ఇంటిపేరు సింగిరెడ్డి. దేవుని మొక్కు వల్ల కొడుకు పుట్టాడని, సత్య నారాయణరెడ్డి అని పేరు పెట్టుకున్నారు. అయితే సిరిసిల్ల మాధ్యమిక పాఠశాలలో కొడుకును చేర్పించే సమయాన 'సి.నారాయణరెడ్డి' %–% అని నమోదు చేయించడం చేత, అదే పేరు స్థిరపడింది. హనుమాజి పేటలో ఆనాడు ప్రభుత్వ పాఠశాల లేనందువల్ల, వ్యక్తిగతంగా ఒక ఉపాధ్యాయుడు నడిపిన వీధి బడిలో ఆయన చదువుకు శ్రీకారం చుట్టి, ప్రాథమిక పాఠశాల విద్యను పూర్తి చేశారు. తరువాత సిరిసిల్లలో ఉర్దూ మాధ్యమంలో తెలుగును ఒక ఐచ్ఛిక విషయంగా గ్రహించి, మాధ్యమిక స్థాయి విద్యను అభ్యసించారు. 1948లో కరీంనగర్ లోని ప్రభుత్వోన్నత పాఠశాలలో ఉన్నత పాఠశాల విద్యను పూర్తి చేశారు. సినారెలో సహజంగా సృజనాత్మకశక్తి, లయాత్మకత, చిన్ననాటి నుండే ఉన్నాయి. చిన్నప్పటినుండి మట్టిలో పుట్టిన జానపదగీతాలను ఆలపించే వారు. హరికథలు, బుర్రకథలంటే చెవి కోసుకునే వారు. హరికథా కథనాన్ని ఆశువుగా, సంగీతాత్మకంగా అనుకరించే వారు. వేములవాడ వాస్తవ్యులు చౌటి నరసయ్య హరికథా గానం ఆయనకు ఛందస్సు పట్ల మక్కువ, అభిరుచి కలగడానికి ప్రేరకమైంది. ఆరేడు తరగతుల నుండే కవితలు వ్రాయడం మొదలు పెట్టారు. ఛందస్సంటే తెలియని దశ అది. ఏడవ తరగతిలో సీస పద్యమని తెలియని దశలో "ఒకనాడు ఒక నక్క ఒక అడవిలో పొట్ట కోసర మెటో పోవుచుండె' అనే పంక్తితో ప్రారంభించి పద్యం వ్రాస్తే – అది సీసపద్యమని తెలిసి ఛందస్సుకు సంబంధించిన కొన్ని మెలకువలను తెలిపారు దూపాటి వేంకట రమణాచార్యులు. తొమ్మిదవ తరగతి చదువుతున్నప్పుడు వ్రాసిన–"మారుటెన్నడో విషంపు గుండెలీ జగాన మారుటెన్నడో" అనేది సినారె తొలి గేయం. పదవ తరగతిలో ఉన్నప్పుడు – "వెన్నవంటి మనసున్నవానికి, అన్నమేమొ కరువాయె ఉన్నవాని కింతన్న వీడుదా మన్న గుండె లేదాయె" వంటి పాటలు రాశారు. కరీంనగర్ విద్యార్థి మహాసభలో –విజయంబు సాధించినావా %–% విద్యార్థి, నీ వీర భావాలు నింగి వ్యాపించగాబీ నీ వైరి చిత్తాల నేల కంపించగా" వంటి గేయాలు రచించి పాడారు. ఉన్నత పాఠశాల విద్యాభ్యాస కాలంలోనే, నైజాం రాష్ట్రానికి స్వాతంత్ర్యం రావాలని జరిపిన విద్యార్థుల సత్యాగ్రహంలో పాల్గొన్నారు. హైదరాబాదు ఛాదర్ఘాట్ కళాశాలలో ఉర్దూ మాధ్యమంలో ఇంటర్ మీడియట్ (1948–49) ముగించారు. ఇంటర్ చదువుతున్న సమయంలో జువ్వాడి గౌతమరావు సంపాదకత్వంలో వెలువడే 'జనశక్తి' పత్రికలో ఆయన కవిత తొలిసారిగా ప్రచురితమైంది. ప్రహ్లాద చరిత్ర, సీతాపహరణం అనే పద్య నాటికలను వ్రాశారు. 'భలే శిష్యులు' వంటి సాంఘిక నాటికలను రచించారు, ప్రదర్శించి, నటులుగా తామూ పాత్రధారణ చేశారు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఉర్దూ మాధ్యమం లోనే 'బి.ఏ.' (1952) చదివారు. బి.ఏ. ద్వితీయ సంవత్సరంలో ఉన్నప్పుడు, ఉస్మానియా విశ్వ విద్యాలయం ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల సాహితీ సంచిక %–% 'శోభ'కు సంపాదకత్వం నిర్వహించారు. 1954లో ఎం.ఏ. పట్టా పొందారు. ఎం.ఏ. విద్యార్థిగా 'సినీ కవి' అనే నాటికను వ్రాసి, 'మకరంద మూర్తి' అనే పాత్రను ధరించి, దర్శకత్వం వహించి, ఉత్తమ బహుమతిని అందుకున్నారు. 'ఆచార్య కె. గోపాలకృష్ణారావు, ఆచార్య పల్లా దుర్గయ్య, ఆచార్య దివాకర్ల వేంకటావధాని తదితరులు ఆయన గురువులు. ఎం.ఏ. పూర్తి చేసి, 1954%–%55లో కొంతకాలం, సికింద్రాబాద్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పార్ట్ టైం లెక్చరరుగా పనిచేసి, అదే కాలేజీలో 1955లో ఆంధ్రోపన్యాసకులుగా ఉద్యోగం ఆరంభించారు. 1958%–%59లో నిజాం కళాశాలలో ఉపన్యాసకులుగా పనిచేస్తునే 1957 నుండి 1962వరకు, దేవులపల్లి కృష్ణశాస్త్రి సూచనను అనుసరించి, ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం పర్యవేక్షణలో – 'ఆధునికాంధ్ర కవిత్వము %–% సంప్రదాయములు, ప్రయోగములు' అనే విషయంపై పరిశోధన సాగించి, 1962లో పిహెచ్.డి. పట్టాను పొందారు. 1963లో ఉస్మానియా విశ్వ విద్యాలయం తెలుగు శాఖలో 'రీడర్' అయ్యారు. 1976లో ఆచార్యులై, 1981 వరకు బోధన సాగించారు. నారాయణరెడ్డి భార్య సుశీల కాగా, నలుగురు కూతుళ్ళకు %–% గంగ, యమున, సరస్వతి, కృష్ణవేణి అని పేర్లు పెట్టు కున్నారు. ఆయన 50వ జన్మ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, అధికార భాషా సంఘాధ్యక్ష పదవిని అందించింది. ఆ జన్మదినోత్సవ సన్మాన సభలో నారాయణరెడ్డి –"ఎవరికి ఈ సన్మానం, ఎందుకు ఈ సన్మానం, చెట్టంతటి పేరొందిన చిగురుకు ఈ సన్మానం" అని ప్రారంభించి..."పేరేమో సింగిరెడ్డి నారాయణరెడ్డి కాని, కులం కీళ్ళ విరిచే నాకలానికీ సన్మానం" అంటూ ఒక గేయ కవిత చదవగాబీ సభంతా హర్ష ధ్వానాలతో మారుమ్రోగింది. అధికార భాషా సంఘం అధ్యక్షులుగా 4–9–%1981 నుండి 7–8– 1985 వరకు, సార్వత్రిక విశ్వ విద్యాలయం ఉపాధ్యక్షులుగా, తర్వాత దేశంలో ప్రథమ సార్వత్రిక విశ్వ విద్యాలయమైన ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వ విద్యాలయ ఉపాధ్యక్షులుగా నియమితులై, 8.8.1985 నుండి 20.6.1989 వరకు, విధులను నిర్వహించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఉపాధ్యక్ష పదవిని 21.6.1989 నుండి 4.11.1992 వరకు నిర్వహించారు. విశ్వ విద్యాలయంలో ప్రథమ స్నాతకోత్సవం తెలుగులో నిర్వహింప బడిన సందర్భంలో, అప్పటి ఛాన్స్ లర్, ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు పాల్గొనగా, ఉప రాష్ట్రపతి డా. శంకర్ దయాళ్ శర్మ ముఖ్య అతిథిగా విచ్చేశారు. 7.7.1991నాడు జరిగిన రెండవ స్నాతకోత్సవంలో, నాటి ప్రధాని శ్రీ పి.వి. నరసింహారావు ముఖ్య అతిథిగా పాల్గొనడం జరిగింది. 1990 మార్చి 10, 11, 12 తేదీలలో బెంగుళూరులో 'మూడవ అఖిల భారత తెలుగు మహాసభలు' నిర్వహింప బడ్డాయి. అంతేకాక, మారిషస్ లో 1990 డిసెంబర్ లో "మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు"నిర్వహించింది ఈ తెలుగు విశ్వవిద్యాలయమే. సినారె ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హోదాలో భాషా సాంస్కృతిక సలహాదారుగా, సాంస్కృతిక మండలి అధ్యక్షులుగా, ఆ తరువాత 1997 జులై నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక మండలి అధ్యక్షులుగా పని చేశారు. ఆ సమయం లోనే భారత రాష్ట్రపతి రాజ్యసభ సభ్యునిగా నామనిర్దేశం చేయగా, 27.8.1997 నుండి 26.8.2003 వరకు కొనసాగారు. దక్షిణ భారతం నుండి రాజ్యసభ సభ్యులుగా నియమింప బడిన ప్రథమకవి ఆయనే కావడం విశేషం. నవ్వని పువ్వు" (1953) మొదలుకొని, – 'అలలెత్తే అడుగులు' (2013), నింగికెగిరే చెట్లు (2014) వరకు 18 ప్రక్రియలలో సుమారు 90 గ్రంథాలు రచించారు. మాకందా'లను అందించడంలో, వచన కవిత్వంలో వైవిధ్యాన్ని ప్రదర్శించడంలో 'ప్ర'పంచ పదులను నిర్మించడంలో %–% తెలుగు గజళ్ళకు మానవీయ దృక్పథాన్ని అనుసంధించడంలో, ప్రతీకాత్మకంగా వచన కవితలో 'ఇతిహాస కావ్యాన్ని'–'విశ్వంభర'ను నిర్మించడంలో, 'మట్టీ – మనిషీ – ఆకాశం' వంటి వచన కవితా 'కావ్యేతి హాసాన్ని' సంవిధాన సంపన్నంగా సృజించడంలో, 'పాటలో ఏముంది నా మాటలో ఏముంది' వంటి స్వీయ చలన చిత్ర గీతికా వ్యాఖ్యా రచనలో, ఋతు వర్ణనలను జీవితానికి సమన్వయిస్తూ 'ఋతుచక్రం' వంటి కావ్య రచనలో, గేయ కావ్యాలకు పద్య కావ్య ప్రౌఢిని, ప్రామాణికతనూ సంతరించడంలో, శతశతాధిక నూతన పదబంధ కల్పనంలో మహాకవి సినారె ప్రయోగశీలం ప్రస్ఫుట మవుతుంది. ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉపన్యాసకులుగా ఉంటూనే, 1962లో ఎన్టీ రామారావు ఆహ్వానంపై చలనచిత్ర రంగంలో ప్రవేశించారు. తొలి సినీ గీతం – "నన్ను దోచుకొందువటే". 'గులేబకావళి కథ' చిత్రంలోని పాటలన్నీ ఆయన వ్రాసినవే. ఆనాటి 'గులేబకావళి కథ' చిత్రం నుండి ఇటీవలి 'అరుంధతి', 'మేస్త్రీ' సినిమాల వరకు, మూడున్నర వేలకు పైగా సినిమా పాటలు రచించి, చలన చిత్ర జగత్తులో తమ ప్రత్యేక స్థానాన్ని భద్రపరచు కున్నారు. 'ఏకవీర', 'అక్బర్ సలీమ్ అనార్కలీ' అనే రెండు చిత్రాలకు సంభాషణలు కూడా రచించారు. తెలుగువారే కాక శంకర్ జైకిషన్, సి. రామచంద్ర, ఓ.పి. నయ్యర్, రవీంద్ర జైన్, ఉషా ఖన్నా, బప్పీ లహరి %–% వంటి ప్రముఖ హిందీ సంగీత దర్శకులు 50 మందికి పైగా కలిసి పనిచేశారు. ఘంటసాల గళం నుండి సినారె గీతాలధికంగా జాలు వారాయి. మూగజీవులు, శభాష్ పాపన్న, మొగుడా పెళ్ళామా, తూర్పు పడమర చిత్రాలలో కావ్య సంబంధమైన పాత్రలలో ఆయన కనిపించారు. నారాయణ రెడ్డి, హైదరాబాద్ లోని కేర్ ఆస్పత్రి లో చికిత్స పొందుతూ 2017, జూన్ 12 సోమవారం రోజున ఉదయం ఈ లోకాన్ని వదిలి వెళ్లారు.

**రామ కిష్టయ్య సంగనభట్ల...9440595494**

# బాలల సంక్షేమమే సమాజ సంక్షేమం - జూన్ 12... బాల కార్మిక వ్యతిరేక దినం




బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం , వివిధ దేశాలలో చట్టాలు ఎన్ని చేసినా అవి అమలుకు నోచుకోవడం లేదు. ఐక్యరాజ్య సమితి ప్రత్యేక విభాగమైన అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) 2002లో ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవంను ప్రారంభించింది. ప్రపంచంలో అసంఘటిత రంగంలో బాల కార్మికుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ఉదాహరణకు ఇళ్లలో పనిచేసే బాలలు. వాస్తవానికి అనేక సందర్భాల్లో బాలకార్మిక వ్యవస్థ ప్రభుత్వ లెక్కల్లోకి రాదని కూడా జాతీయ బాలల హక్కుల కమిషన్ పేర్కొంటోంది. యునిసెఫ్ ప్రకారం దాదాపు సగంమందిబీ ప్రణాళికా సంఘం అంచనా ప్రకారం సుమారు 43 శాతం మంది బాలబాలికలు ఎనిమిదో తరగతిలోపే బడి మాని వేస్తున్నారు. షెడ్యూల్డ్ కులాల్లో ఇది 55% షెడ్యూల్డ్ తెగల్లో 63% దాకా ఉందని అంచనా. బడి మానేసిన ప్రతి పిల్లవాడూ అనివార్యంగా బాలకార్మికుడిగానే జీవిస్తున్నాడని వివిధ అధ్యయనాలు తెలియ జేస్తున్నాయి. ఫలితంగా బాలల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, ల్కెంగిక వేధింపులు పెరుగు తున్నాయి. 2005 నాటికి జాతీయ బాలల కార్యాచరణలో భాగంగా బాల కార్మిక వ్యవస్థ నిషేధంతో పాటు బాల్య వివాహాలను పూర్తిగా నిరోధించాలని లక్ష్యంగా పెట్టు కున్నారు. కానీ, ఈ లక్ష్య సాధనలో విఫలమయ్యాం. ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం జరుపు కుంటున్నా ప్రయోజనం లేకుండా పోయింది. అందమైన బాల్యాన్ని లేకుండా చేయడం అతి పెద్ద మానవ హక్కుల ఉల్లంఘన. బాలకార్మిక వ్యవస్థను రద్దు చేయాలన్నా లేదా బాల్య వివాహాలను పూర్తిగా నిషేధించాలన్నా ముందు జరగాల్సింది సార్వత్రిక ప్రాథమిక విద్యను అందుబాటులోకి తేవడం. అందుకే విద్యను ప్రాథమిక హక్కుగా చేశారు. చట్టం అమల్లో భాగంగా బడి బయట ఉన్న పిల్లలను, మధ్యలో మానేసిన వారిని తిరిగి బడిలో చేర్పించడం సవాలుగా మారింది. విద్యా హక్కు చట్టం హామీ ఇచ్చినవిధంగా వీరందరికీ వాళ్ల వయసుకు తగిన తరగతిలో చేర్పించి విద్యనం దించడమూ ఒక సవాలే. మధ్యలో బడి మానేయకుండా చూడటానికి ఎనిమిదో తరగతి వరకూ పిల్లలకు డిటెన్షన్ పద్ధతి ఉండకూడదనిబీ వీరిని సమగ్ర, నిరంతర మూల్యాంకన పద్ధతి ద్వారా పరీక్షించాలని విద్యాహక్కు చట్టం చెబుతోంది. నాణ్యమైన విద్యనందించడం ద్వారా ప్రతి ఒక్కరూ అవసరమైన స్థాయిలో చదువు నేర్చుకుని, తర్వాతి తరగతిలోకి ప్రవేశించ గలిగేలా చేయాల్సిన బాధ్యత పాఠశాలపై ఉంటుందనీ చట్టం పేర్కొంటోంది. బాలలు బాల కార్మికులుగా మారకుండా చేసేందుకు విద్యాహక్కు చట్టంలో అనేక ఇతర నిబంధనలూ ఉన్నాయి. విద్యా సంవత్సరంలో ఏ సమయంలో వచ్చినా తగిన తరగతిలో చేర్చుకోవాలి. అవసరమైన అదనపు శిక్షణ ఇవ్వాలి. దండన లేని బోధన అందించాలి. బడిలో ఉండాల్సిన పిల్లలు అందులో చేరక పోవడానికి, మధ్యలో బడి మానేసి బయట ఉండటానికి తల్లిదండ్రుల పేదరికం, సామాజిక వెనక బాటుతనంబీ పిల్లలకు అనుకూలంగా లేని బోధనాంశాలు, బోధనా ప్రణాళిక తదితర కారణాలు ఉన్నాయి. భారత రాజ్యాంగంలోని 24, 39, 45వ అధికరణలు పిల్లలకు శ్రమ దోపిడీ నుంచే కాకుండా ఇతర రక్షణలనూ కల్పిస్తున్నాయి. వయసుకు తగని ఆర్థిక కార్యకలాపాలు, వృత్తుల్లో పని చేయకుండా భారత రాజ్యాంగం పిల్లలకు రక్షణ కల్పిస్తోంది. బాల కార్మిక వ్యవస్థను రూపుమాపడానికి భారత ప్రభుత్వం త్రిముఖ వ్యూహాన్ని అమలు చేస్తోంది. మొదటిది: బాల కార్మిక చట్టాల అమలుబీ రెండోది: బాలల సమగ్రాభివృద్ధికి అవసరమైన ప్రణాళికల రూపకల్పన, అమలుబీ మూడోది: బాల కార్మిక వ్యవస్థ అధికంగా ఉన్న ప్రదేశాలు, రంగాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనా పథకాలను అమలు చేయడం. 1986లో చేసిన బాల కార్మిక వ్యవస్థ నిషేధ, నియంత్రణ చట్టం నోటిఫై చేసిన ప్రమాదకర వృత్తుల్లో బాలకార్మికులుండటాన్ని నిషేధిస్తోంది. ప్రస్తుతం ఇలాంటి 18 ప్రమాదకర వృత్తులను, 65 ప్రమాదకర ప్రక్రియలను గుర్తించారు. రాజ్యాంగంలోని 24, 39, 45వ అధికరణలు పిల్లలకు శ్రమ దోపిడీ నుంచే కాకుండా ఇతర రక్షణలనూ కల్పిస్తున్నాయి. బాలలు ఆరోగ్యంగా జీవించే హక్కు వుంది, సామాజిక భద్రత పొందే హక్కువుంది. ఉచిత నిర్బంధ విద్యను పొందడం బాలల హక్కు. బాలలకు విశ్రాంతిగా వుండే హక్కువుంది. ఆటలు వినోద కార్యక్రమాల్లో పాల్గొనే హక్కు వుంది. ప్రమాదకరమైన పనులు గనుల్లో, పేలుడు పదార్థాల తయారీలో, హొటళ్ళలో బాలల్ని పని చేయించరాదు. మారక ద్రవ్యాల నుండి బాలలను దూరం చేయాలి. వారికి అందుబాటులో వుంచడం, వారి ద్వారా తెటప్పించు కోవడం నేరం.బాలల్ని నిర్భంధించరాదు. లైంగిక ధూషణ చేయరాదు. బాలల సంక్షేమానికై దోపిడి ఏ రూపంలో వున్నా ప్రభుత్వాలు నిషేధించాలి. 18 సంవత్సరాలలోపు వయస్సు బాలల్ని విడుదల చేయటానికి వీలులేని నేరాలకు ఉరి శిక్షగాని, యావజ్జీవ శిక్షగాని విధించరాదు. భారత దేశంలో పుట్టిన 12 మిలియన్ల బాలికల్లో 3 మిలియన్ల మంది తమ 15వ పుట్టిన రోజును, ఒకమిలియన్ మంది తమ మొదటి పుట్టిన రోజును జరుపు కోకుండానే మరణిస్తున్నారు. లింగ విచక్షణ వల్ల ప్రతి ఆరుగురిలో ఒక బాలిక చావుకి గురవుతుంది. 50% బాలబాలికలకు పోషకాహారం అందడం లేదు. బాలురలో 5 గురిలో ఒకరు, బాలికలలో ఇద్దరిలో ఒకరు పోషకాహారం పొందడం లేదు. ఇక 2 సం.ల వయస్సు లోపు శిశువులలో 58% మందికి పూర్తిగా వాక్సి నేషన్ అందడం లేదు. 24% పిల్లలకి ఎలాంటి వాక్సినేషన్ ఇవ్వలేదు. దేశంలో 60% పిల్లలు రక్తహీనతకు గురవుతున్నారు. దేశంలోని వ్యాపార లైంగిక వృత్తుల్లో 40% బాల బాలికలే. "ఇంటర్ నేషనల్ సెంటర్ ఆన్ లేబర్" నివేదిక ప్రకారం దేశంలో 25 మిలియన్ల నుంచి 30 మిలియన్ల వరకు బాల కార్మికులున్నారు. దేశంలో 50% బాలలు పాఠశాలలకే వెళ్ళడం లేదు. ఇలా చెప్పుకొంటూ పొత్తే దేశంలో బాలల జీవితం కన్నీటిమయం. నేటి బాలలే రేపటి పౌరులు. నవభారత నిర్మాతలు. ఈ మాటలు వినడానికి వింపుగా వున్నాయి. కాని పైన వివరించిన స్థితిగతులు పరిశీలిస్తే రేపటి పౌరులకు మనం ఇస్తున్న ప్రోత్సాహం ఇదా? అని ఆలోచించక తప్పదు. ప్రపంచంలో మరే దేశంలో లేనంత పెద్ద సంఖ్యలో పిల్లలున్న దేశం మనదే. దేశంలో నేడు 18 సంవత్స రాలలోపు వున్న వారి సంఖ్య 45 కోట్లు. ఇటువంటి యవతరాన్ని ఆరోగ్యకరమైన వాతావరణంలో పెంచి ఆరోగ్యకరమైన పౌరులుగా తీర్చి దిద్దాల్సిన భాధ్యత అందరిపై ఉన్నది. తల్లిదండ్రులు తమ బిడ్డలకు సకాలంలో వాక్సినేషన్ ఇప్పించాలి. విద్యను అందించాలి. ప్రభుత్వం ఆర్యోగ్య, విద్యారంగ అభివృద్ధికి చిత్తశుద్ధితో నిధులు కేటాయించాలి. సమాజంలోని అందరూ బాలల సంక్షేమం తమ సంక్షేమంగా భావించి సంవత్సరంలో ఒక్కరోజు తమ సంపాదనను పిల్లల సంక్షేమానికి విరాళంగా ఇవ్వాలి. 'నేటి బాలలే రేపటి పౌరులు" అనేది నినాదం కాకుండా విధానంగా మారితే దేశంలో బాలల జీవితం ఆనంద దాయకం. మరి ఆరోజుకై అందరం స్పందిద్దాం.

**రామ కిష్టయ్య సంగనభట్ల...9440595494**

# అమృత్ భారత్ అర్ధంతర ప్రగతి

పెద్దపల్లి : పెద్దపల్లి రైల్వే స్టేషన్‌లో అమృత్‌భారత్ పనులు ఏడాదిన్నర కాలంగా 'అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కి' అన్న చందాన మారాయి. రెండు సార్లు స్టేషన్ నమూనాను మార్చడంతో పనులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. కొత్తగా నిర్మాణం కోసం పాత భవనం కూల్చివేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కూల్చివేతలతో రెండో ప్లాట్‌ఫాంపై శౌచాలయం కూడా లేకుండా పోయింది. స్టేషన్‌లో అర్ధంతరంగా నిలిచిన పనులతో ప్రయాణికులు రైలు ఎక్కే క్రమంలో ఇబ్బంది పడుతున్నారు. చివరికి టికెట్ బుకింగ్ కోసం నిర్మించిన తాత్కాలిక షెడ్డు నుంచి ప్లాట్‌ఫాం మీదకు వెళ్లేందుకు కవరింగ్ షెడ్లు, దీపాలు లేకపోవడంతో రాత్రి వేళలో, వర్షాలు కురిసిన సమయంలో అవస్థలు ఎదురవుతున్నాయి. స్టేషన్‌లో అమృత్‌భారత్ పనులను గత నెల రోజుల వ్యవధిలో సికింద్రాబాద్ డివిజన్ డీఆర్‌ఎం భరతేశ్‌కుమార్, జీఎం అరుణ్‌కుమార్



జైన్‌తో పాటు పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ పరిశీలించారు. అధికారులు, నేతలు పర్యటించినపుడు మినహా మిగతా సమయంలో పనులు ముందుకు సాగడం లేదు.

**పొరుగున వడివడిగా..**

గతేడాది ఫిబ్రవరి 26న పెద్దపల్లి, మంచిర్యాల స్టేషన్‌లలో అమృత్‌భారత్ పనులను ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. రూ.26.49 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉండగా, నత్తనడకన సాగుతుండటంతో అంచనా వ్యయం పెరగనుంది. సమీపంలోని మంచిర్యాల స్టేషన్‌లో 70 శాతం పనులు పూర్తి కాగా పెద్దపల్లిలో మాత్రం గుంతల తవ్వకం, భవనం కూల్చడం వరకే జరిగాయి. పెద్దపల్లి కంటే మూడు నెలల ముందు అమృత్ భారత్ పనులు చేపట్టిన కరీంనగర్ స్టేషన్‌లో పూర్తి కావడంతో గత నెలలో ప్రారంభించారు. రామగుండంలోనూ తుది దశకు చేరుకున్నాయి. పెద్దపల్లిలో మాత్రం పనులు ముందుకు సాగడం లేదు. ఓవైపు బైపాస్ రైలు మార్గం సాంకేతిక లోపాలతో ప్రారంభానికి నోచుకోవడం లేదు. మరోవైపు అమృత్ స్టేషన్ పనులు ముందుకు సాగడం లేదు. దీంతో ప్రయాణికులు ఒంటికి, రెంటికి ఇబ్బందులు పడుతున్నారు.

**పర్యవేక్షణ లోపమే కారణం**

రైల్వేస్టేషన్‌ల ఆధునికీకరణలో భాగంగా చేపట్టిన అమృత్‌భారత్ పనుల నిర్వహణ లోపభూయిష్టంగా మారింది. పెద్దపల్లిలో ఏకకాలంలో చేపట్టిన వివిధ పనులు పనుల నిర్వహణను సంక్లిష్టంగా మార్చాయి. సరకు రవాణా ప్లాట్‌ఫాంలపై పూర్తి కవరింగ్ షెడ్లను నిర్మించే పనులు సాగుతుండగా మరోవైపు అమృత్‌భారత్ కోసం స్టేషన్ భవనం, ఇతర నిర్మాణాలు కూల్చివేశారు. గతేడాది నిర్మించిన నాలుగో ప్లాట్‌ఫాంను అసంపూర్తిగా వదిలేశారు. ఇక్కడే నిర్మించిన స్టేషన్ భవనాన్ని మాత్రం ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. వేర్వేరు సంస్థలు నిర్వహిస్తున్న పనులపై పర్యవేక్షణ లేకపోవడమూ నత్తనడకన సాగడానికి కారణం. పనులను కాజీపేటలోని ఇంజినీరింగ్ విభాగం సమీక్షించడంతో ఆలస్యమవుతున్నాయి. స్టేషన్‌తో పాటు ఆర్వోబీ, బైపాస్ పనుల నిర్వహణ దృష్ట్యా తాత్కాలికంగా పర్యవేక్షించడానికి పెద్దపల్లిలో కార్యాలయం ఏర్పాటు చేస్తే వేగవంతం కానున్నాయి.

# వైద్యం.. ప్రయాసే!

మెట్‌పల్లి : ప్రజలకు చేరువలోనే వైద్యం అందాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఆరోగ్య కేంద్రం, వాటి పరిధిలో ఉప కేంద్రాలను అందుబాటులోకి తీసుకొస్తుంది. వాటిలో పలు రకాల వైద్యసేవలందిస్తున్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతల ఆరోగ్య పర్యవేక్షణ, చిన్నారులకు టీకాలు తదితర విషయాల్లో పీహెచ్‌సీ పరిధిలో పనిచేసే వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ ఆరోగ్య కేంద్రాలకు సమాచారమిస్తుంటారు. ఆరోగ్య కేంద్రాలు అందుబాటులో లేకుంటే దాని పరిధిలోని ప్రజలు, సిబ్బంది సైతం ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంటుంది. మెట్‌పల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనం నిర్మాణ విషయంలో వ్యవహరిస్తున్న తీరు దాని పరిధిలోని ప్రజలు, సిబ్బందిని అవస్థలకు గురి చేసేలా ఉందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. యుపీహెచ్‌సీ ప్రస్తుతం అద్దె భవనంలో నడుస్తోంది. సొంత భవన నిర్మాణానికి ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.43 కోట్లు మంజూరయ్యాయి. నిధులు మంజూరై చాలా రోజులు కావస్తున్నా భవన నిర్మాణానికి స్థలం కేటాయించక జాప్యం జరుగుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో పట్టణంలోని 12వ వార్డు అర్బన్ కాలనీలో రెవెన్యూ అధికారులు ఇటీవల స్థలం కేటాయించారు. ఇంత వరకు బాగానే ఉన్న అర్బన్ కాలనీ పట్టణానికి సుమారు నాలుగు కిలోమీటర్ల దూరం ఉంటుంది. అక్కడ భవనం నిర్మిస్తే వైద్య సేవల కోసం పట్టణ వాసులు అక్కడి వరకు వెళ్లాల్సి ఉంటుంది.

**పరిధి ఇక్కడ.. నిర్మాణం అక్కడ**

మెట్‌పల్లి పురపాలికలో 26 వార్డులుండగా, సగం వార్డులు పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో, మిగతా సగం వార్డులు జగ్గాసాగర్ పీహెచ్‌సీ పరిధిలో ఉన్నాయి. పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో 2, 4, 6, 7, 8, 9, 10, 15, 17, 19, 20, 21, 26వ వార్డుల్లో వైద్య సేవలందిస్తున్నారు. ప్రస్తుతం యుపీహెచ్‌సీ నిర్మాణానికి కేటాయించిన స్థలం 12వ వార్డులో ఉండగా, అది జగ్గాసాగర్ పీహెచ్‌సీ పరిధిలో ఉంది. దీంతో పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని వార్డుల్లో కాకుండా మరో పీహెచ్‌సీ పరిధిలోని వార్డులో భవనం నిర్మించనున్నారు. వాస్తవానికి ఏడాది కాలంగా యుపీహెచ్‌సీ భవనం కోసం పట్టణంలోని కొన్ని స్థలాలను పరిశీలించినా కొలిక్కి రాలేదు. చివరకు అర్బన్ కాలనీలో రెవెన్యూ అధికారులు స్థలం కేటాయించారు. యుపీహెచ్‌సీ పరిధిలోని వార్డుల ప్రజలకు అందుబాటులో ఉండేలా సొంత భవనం నిర్మిస్తే వైద్య సేవలు చేరువయ్యే అవకాశముందని, ఉన్నతాధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ డీఈ నాగేశ్వర్‌రావును సంప్రదించగా, అర్బన్ కాలనీలో రెవెన్యూ అధికారులు స్థలం కేటాయించారని, నిర్మాణ పనుల ప్రక్రియ ప్రారంభమైందన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్‌ను సంప్రదించగా, పట్టణంలో కొన్ని స్థలాలు పరిశీలించినా సాధ్యపడలేదని, అర్బన్ కాలనీలో పది గుంటలు కేటాయించడం జరిగిందన్నారు.

# కా'సారం'.. పునరుజ్జీవం



హైదరాబాద్: భాగ్యనగరంలో చెరువులు జీవం పోసుకుంటున్నాయి. ఇప్పటికే ఆక్రమణల నుంచి విముక్తి పొందిన తటాకాలకు.. మురుగు నుంచి కూడా శాశ్వత పరిష్కారం లభిస్తోంది. అన్నిటికంటే గొప్పగా కాసారాలు పాతకాలంలోని తమ నేలతో మమేకం అవుతున్నాయి. హద్దుల వరకు విస్తరిస్తున్నాయి. హైడ్రా చేపట్టిన ఆయా కార్యక్రమాలతో సత్ఫలితాలు చేకూరనున్నాయి.

**తమ్మిడికుంట విస్తీర్ణం రెట్టింపు..**

స్థానికుల ఫిర్యాదుతో మాదాపూర్‌లోని తమ్మిడికుంట ఆక్రమణలపై హైడ్రా విచారణ చేపట్టింది. కుంట వాస్తవ విస్తీర్ణం 29 ఎకరాల 24 గుంటలు. పూర్తిస్థాయి నీటి మట్టం(ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్‌లో కలిపి 84 కట్టడాలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. అందులోని ఎకరం 12 గుంటల ఎఫ్‌టీఎల్, 2 ఎకరాల 18 గుంటల బఫర్‌జోన్‌లో ఎన్-కన్వెన్షన్ నిర్మాణాలు ఉన్నట్టు తేలింది. వాటిలోని వ్యాపార కార్యకలాపాలు జరుగుతోన్న నిర్మాణాలను ఆగస్టు 24న హైడ్రా నేలమట్టం చేసింది. జనాలు నివాసం ఉండే అపార్ట్‌మెంట్లను వదిలేసింది. అయినప్పటికీ.. 14 ఎకరాలకు కుంచించుకుపోయిన దాని విస్తీర్ణం 28 ఎకరాలకు పెరిగినట్టు అధికారులు చెబుతున్నారు. ఎకరా భూమిలో మీటరు లోతున గుంత తీస్తే 4 మిలియన్ లీటర్ల నీటిని నింపొచ్చు. దాని ప్రకారం ఆక్రమణల తొలగింపు ద్వారా సమకూరిన 14 ఎకరాల్లో సగటు మీటరు నుంచి రెండు మీటర్ల లోతున పూడిక తొలగింపు జరుగుతోంది. తద్వారా గతంతో పోలిస్తే తమ్మిడికుంటలో 22 కోట్ల లీటర్ల నీరు నిల్వ ఉండగలదని అధికారులు అంచనా వేస్తున్నారు. నల్లచెరువులోనూ ప్రగతి పనులు కొనసాగుతున్నాయి.

**అంతా మంచి నీరే..**

ప్రస్తుతం చెరువులోకి చేరుతోన్న మురుగును దారి మళ్లించేందుకు చుట్టూ కాలువ రాబోతుంది. వరద వచ్చినప్పుడు మాత్రమే తటాకంలోకి నీరు చేరేట్టు గుత్తేదారు సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. వరదతో కలిసి వచ్చే మురుగు, వ్యర్థాలను వడపోసేందుకు ప్రత్యేకంగా కుంటను ఏర్పాటు చేస్తోంది. అందులో నీరంతా వడపోతకు గురై మధ్యలో ఉన్న తటాకాన్ని చేరుతోంది. తద్వారా.. దాంట్లో ఏడాది పొడవునా మంచి నీరు నిల్వ ఉంటుంది. మంచినీటితో కళకళలాడే కాసారాలతో పర్యావరణానికి ప్రయోజనాలు చేకూరుతాయి. గ్రేటర్ పరిధిలో ప్రస్తుతం 150 చెరువులు ఉన్నాయి.

**మరో ఐదు చోట్ల..**

కాటేదాన్‌లోని బమ్ రుఖ్ నుద్దౌలా చెరువులో 9 ఎకరాల విస్తీర్ణంలోని ఆక్రమణలను, సున్నం చెరువులో 5 ఎకరాల్లోని కబ్జాలను హైడ్రా తొలగించింది. కూకట్‌పల్లిలోని నల్లచెరువు, ఉప్పల్ నల్లచెరువు, అంబర్‌పేటలోని బతుకమ్మ కుంటలనూ హైడ్రా ఆక్రమణల నుంచి రక్షించింది. ఇప్పుడు వాటికి గత వైభవాన్ని తెచ్చేందుకు పూడికతీత చేపట్టింది. జూన్ ఆఖరు నాటికి రూ.100కోట్లతో 6 తటకాలను పూర్వస్థితికి తీసుకొస్తామని హైడ్రా స్పష్టం చేస్తోంది.

# ఇసుక తీస్తూ.. వాగును కబ్జా చేస్తూ..



వేములవాడ : కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా మూలవాగును ఆక్రమిస్తున్నారు. వాగులోని ఇసుకను తోడేసి వ్యవసాయ క్షేత్రాల వెంబడి కట్ట పోసి ఆక్రమిస్తున్నా రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

**ఆందోళనకరంగా..**

వేములవాడ పట్టణంలోని మూలవాగు వంతెనకు ఇరువైపులా పట్టణ శివారు ఆనుకొని మూలవాగు ఉంటుంది. ఈ మూలవాగు ప్రతి వర్షాకాలంలో భారీ ఎత్తున పారి.. వరద నీరంతా మధ్యమానేరు జలాశయంలోకి చేరుతుంది. పట్టణానికి కొద్ది దూరంలో మహాలక్ష్మి వీధి ప్రాంతంలో కొన్ని రోజులుగా అ ప్రాంతంలోని రైతులు మూలవాగు బఫర్ జోన్‌నే కాకుండా ఏకంగా వాగును కబ్జా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. వాగులో భారీ యంత్రాలు పెట్టి ఇసుకను తీసి వాగులోనే వందల మీటర్ల పొడవు అడ్డుకట్ట వేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. వాగు ఆక్రమణ కారణంగా తమకు నష్టం జరుగుతుందని వాగుకు అవతలి వైపు రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

**బఫర్ జోన్ ఆక్రమణ**

మూలవాగు వంతెనకు ఇరువైపుల బఫర్ జోన్ పెద్ద ఎత్తున ఆక్రమణలు జరిగాయి. పలువురు భవనాలు నిర్మాణం చేశారు. ఇదే వాగు వెంబడి మహాలక్ష్మి వీధిలో ఎల్లమ్మ ఆలయ ప్రాంతంలోని మూలవాగు ఆక్రమణకు గురవుతోంది. వాగుకు ఇరువైపులా దాదాపు 9 మీటర్ల వెడల్పు బఫర్ జోన్ ఉంటుంది. ఇలాంటి స్థలాన్ని ఎవరు అక్రమించడానికి లేదు. అలాంటిది బఫర్ జోన్‌తో పాటు మూలవాగును సైతం ఆక్రమించి పెద్దఎత్తున కట్ట పోసే పనులు చేస్తున్నా ఎవరూ పట్టించుకోకపోవడం లేదు. దీంతో ఆక్రమణలు విస్తరిస్తున్నాయి. ఇసుక అక్రమంగా తీసి కట్ట పోస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

**నిబంధనలు తుంగలో తొక్కి..**

నిబంధనల ప్రకారం వాగులో ఇసుక, మట్టిని తీసేందుకు భారీ వాహనాలను వినియోగించరాదు. ఉయోగించాలంటే రెవెన్యూ, నీటిపారుదల శాఖ అనుమతులు పొందాల్సి ఉంటుంది. అనుమతులు లేకుండానే జేసీబీని ఏర్పాటు చేసి వందల మీటర్ల పొడవు మూలవాగులో భారీగా ఇసుకను తీసి కట్ట పోసి చదును చేయడం విమర్శలకు తావిస్తోంది. కట్ట కోసం మూలవాగులో వేల ట్రిప్పుల ఇసుక తీయడంతో చిన్నపాటి కుంటను తలపిస్తోంది. భారీగా ఇసుక తోడేయడంతో గుంతలతో ఆ ప్రాంతం ప్రమాదకరంగా మారింది.

**పరిశీలించి చర్యలు** మూలవాగులో ఇసుక తీసి కట్ట పోసిన ప్రాంతాన్ని పరిశీలించి అందుకు బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకుంటాం. యంత్రాలు పెట్టి తవ్వకాలు చేసేందుకు ఎవరికీ అనుమతి ఇవ్వలేదు. పూర్తి స్థాయిలో పరిశీలించి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటాం.
శ్రీనివాస్, నీటిపారుదలశాఖ డీఈ, వేములవాడ

# నాణ్యతే ప్రామాణికం



గోదావరిఖని : వినియోగదారులకు మరింత నాణ్యమైన బొగ్గు విక్రయించేందుకు సింగరేణి ప్రయత్నిస్తోంది. నాణ్యత ప్రామాణికంగానే మార్కెట్ పెంచుకునే వీలు ఉండటంతో ఆ దిశగా సంస్థ ఆలోచన చేస్తోంది. సాధ్యమైనంత మేర క్వాలిటీ బొగ్గు సరఫరాకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే అనేక విధాలుగా వినియోగదారులకు నాణ్యతపై నమ్మకం కలిగిస్తూ.. కొత్త వారిని ఆకట్టుకోవడానికి ప్రయత్నిస్తోంది. ఈ మేరకు సింగరేణి వ్యాప్తంగా మరిన్ని బొగ్గు శుద్ధి కేంద్రాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటోంది. గనుల్లో ఉత్పత్తి చేస్తున్న బొగ్గు నుంచి బండ, మట్టిని వేరుచేస్తారు. అనంతరం శుద్ధి కేంద్రాల్లో శుభ్రం చేసి సరఫరా చేస్తారు. దీంతో ధర ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది.

**తక్కువ గ్రేడ్ బొగ్గు**

సింగరేణి గనుల్లో చాలా వరకు తక్కువ గ్రేడు బొగ్గు ఉత్పత్తవుతోంది. జి-9 నుంచి జి-13 గ్రేడు బొగ్గు ఉంటుంది. ఆరు జిల్లాల పరిధిలోని గనుల్లో ఎక్కువ శాతం ఈ గ్రేడు బొగ్గు నిల్వలే ఉన్నాయి. కేవలం భూపాలపల్లి ప్రాంతంలో కొంత వరకు మాత్రమే కొద్ది వరకు నాణ్యమైన బొగ్గు నిల్వలున్నాయి. దీనివల్ల బొగ్గుకు రేటు తక్కువగా పలుకుతోంది. ఈ బొగ్గును పూర్తి స్థాయిలో శుభ్రం చేసి సరఫరా చేయడం ద్వారా కొంతవరకు నాణ్యత పెరిగి ధర వస్తోంది. ఇప్పటికే మణుగూరు, బెల్లంపల్లి రీజియన్, కొత్తగూడెం ప్రాంతాల్లో బొగ్గుశుద్ధి కేంద్రాలున్నాయి. రామగుండం ప్రాంతంలో ఉన్న కేంద్రం పలు కారణాల వల్ల ప్రస్తుతం నడవటం లేదు. తాజాగా సత్తుపల్లి ప్రాంతంలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

**కొత్త వినియోగదారులపై దృష్టి**

సింగరేణి ఎన్టీపీసీ, జెన్‌కోతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలకు బొగ్గు విక్రయిస్తోంది. కొత్త వినియోగదారులను సమకూర్చుకోవడానికి దృష్టి పెట్టింది. ఈ మేరకు ఇటీవల నాణ్యత వారోత్సవాల సందర్భంగా ఉత్పత్తిలో నాణ్యత విషయంలో నిర్లక్ష్యం చేయకూడదని ఉద్యోగులకు సూచనలు చేసింది. రానున్న కాలంలో మార్కెట్‌లో నిలదొక్కుకోవాలంటే నాణ్యత చర్యలు కీలకంగా మారాయి. దీంతో సింగరేణి ఆ దిశగా చర్యలు తీసుకుంటోంది.

# నీరు లేక.. గుండారం వెలవెల

కమాన్‌పూర్ : నాలుగు మండలాల వరప్రదాయిని, కల్పతరువు అయిన గుండారం జలాశయం అడుగంటింది. మొన్నటి వరకు నిండుకుండలా ఉండగా.. ప్రస్తుతం నీరు లేక వెలవెలబోతుంది. దీంతో జలాశయం ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. గతనెల రోజులకుపైగా నీటిని విడుదల చేస్తున్న ఎస్సారెస్పీ, రెవెన్యూ, ఇతర శాఖ అధికారులు 'మాములు'గా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొన్నటివరకు రాత్రివేళలో నీటిని విడుదల చేయగా.. నేడు పగలు సైతం వదులుతున్నారు.

**అవసరం లేకున్నా విడుదల**

వేసవికాలంలో రామగిరి, మంథని, ముత్తారం మండలాల రైతుల పంట పొలాలకు విడతల వారీగా నీటిని కాపాడుకుంటూ సరఫరా చేసిన అధికారులు.. ప్రస్తుతం అవసరం లేకున్నా నిమ్మకు నీరెత్తినట్లు



వ్యవహరిస్తుండటంపై విమర్శలు వస్తున్నాయి. జలాశయం నీటి మట్టం 12 అడుగులుకాగా.. ప్రస్తుతం పూర్తిగా అడుగంటిపోయింది. రుతుపవనాలు మురిపించి మొహం చాటేయడంతో.. ప్రస్తుతం ఎండలు దంచి కొడుతున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావస్తున్న నేపథ్యం జలాశయంలో నీరు లేకపోవడంతో సాగుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**చేపల వేటకే(నా)!**

ఈ ఏడాది వరుణుడు కరుణించకపోతే పరిస్థితి ఏంటనేదానిపై రైతులు కలవరపడుతున్నారు. ఇప్పటికైనా నీటి విడుదలకు అడ్డుకట్ట వేసి.. విడుదల చేసేవారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. అయితే జలాశయాన్ని సుమారు రూ.70 లక్షలకు కొనుగోలు చేసినవారు.. చేపలు పట్టేందుకు నీటిని విడుదల చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి నీరు ఉండగానే చేపలు పట్టాల్సి ఉంటుందని గ్రామస్థులు చెబుతున్నారు.

# లక్షలు వెచ్చించి.. వినియోగం మరిచి

సారంగాపూర్ : గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ఊరూరా డంపింగ్ యార్డు, సెగ్రిగేషన్(కంపోస్టు) షెడ్లు నిర్మించారు. జిల్లా వ్యాప్తంగా 380 పంచాయతీలలో కంపోస్టు షెడ్ల నిర్మాణం చేపట్టగా తడి చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారు చేయాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరడంలేదు. ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ.2.50 లక్షల చొప్పున వ్యయం చేశారు. ఆరంభంలో కొన్ని పంచాయతీలు ఎరువు తయారు చేసినప్పటికీ వ్యయం అధికంగా ఉండడం, పంచాయతీలలో సిబ్బంది కొరతతో మానేశారు. కొద్ది రోజులు ఉన్నతాధికారులు తనిఖీలు చేపట్టడంతో తయారు చేసిన ఎరువును చూపించారు. కొన్నేళ్లుగా అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పూర్తిగా మానేయడంతో రూ.లక్షలు వ్యయం చేసి నిర్మించిన షెడ్లు నిరుపయోగంగా ఉంటున్నాయి.

**సిబ్బంది లేక ఇబ్బంది**

గ్రామ జనాభా ప్రాతిపదికన పంచాయతీ కార్మికులను నియమించుకోవాల్సి ఉంటుంది. ఒక్కో పంచాయతీలలో ఒక్కరు, ఇద్దరు మినహా ఎక్కువగా నియమించుకునే అవకాశం లేదు. నియమించుకున్న ఒకరిద్దరు చెత్త ట్రాక్టర్ నడపడమే కాకుండా, నీటి సరఫరా, చెత్త సేకరణ తదితర పనులు చేయాల్సి ఉంటుంది. సేకరించిన చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువుగా మార్చే సమయం ఉండడంలేదు. అధికారులు ఉపాధి హామీ పథకం కూలీల ద్వారా చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువుగా మార్చేందుకు అవకాశం కల్పిస్తే పంచాయతీలకు ఆదాయంతోపాటు లక్ష్యం నెరవేరనుంది.

**భారంగా చెత్త తరలింపు**



కొంత కాలంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధుల విడుదల లేకపోవడంతో చెత్త తరలింపు భారంగా మారింది. ప్రభుత్వం అందించిన ట్రాక్టర్లకు కిస్తీలు చెల్లించలేని పరిస్థితి కొన్ని పంచాయతీల దైతే.. మరికొన్ని పంచాయతీలకు నిధులు లేక మరమ్మతు చేయించలేక మూలన పడేశారు. పంచాయతీల ట్రాక్టర్‌తోపాటు ఇతర పరికరాలు కూడా కొనుగోలు చేసి వినియోగించకుండా పక్కన పడేయడంతో ప్రజాధనం వృథా అవుతోంది. పంచాయతీలకు నిధులు మంజూరుచేసి సంపూర్ణ పారిశుద్ధ్య గ్రామాలుగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

**కానరాని సేంద్రియ ఎరువు తయారీ**

గ్రామాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యం సాధించేందుకు ప్రతీ గ్రామ పంచాయతీకి ట్రాక్టర్ కొనుగోలు చేశారు. ఇంటింటికీ తడి, పొడి చెత్తను సేకరించి ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డుకు తరలించాలి. అక్కడి సెగ్రిగేషన్ షెడ్లలో ప్రత్యేకంగా నిర్మించిన చిన్న గదులలో సేకరించిన చెత్త నుంచి ప్లాస్టిక్, ఇతర వస్తువులు వేరు చేయాల్సి ఉంటుంది. తడి చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువు తయారు చేయాల్సి ఉంటుంది. ఎరువును గ్రామాల్లోని హరితహారం నర్సరీల్లో పెంచుతున్న మొక్కలకు వినియోగించాలి. మిగిలిన ఎరువును రైతులకు విక్రయి ంచాలి. ఎక్కడ కూడా సేంద్రియ ఎరువు తయారీ చేపట్టడం లేదు.

# రెండోసారీ.. నగరానికి నిరాశే

హైదరాబాద్: రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో రాజధానికి రెండోసారి కూడా ప్రాతినిధ్యం దక్కలేదు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఏర్పాటు చేసిన మంత్రివర్గంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల నుంచి అవకాశం కల్పించలేదు. మంత్రివర్గ విస్తరణ ఎప్పుడు జరిగినా కచ్చితంగా ఒకరిద్దరికి అవకాశం ఉంటుందని కాంగ్రెస్ వర్గాలు అంచనా వేస్తూ వచ్చాయి. ఆ దిశగా కొందరి పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. ఆశావహులు దిల్లీ వెళ్లి అధిష్ఠానంతో లాబీయింగ్ చేశారు. కొందరికి కచ్చితంగా అవకాశం ఇస్తామని అధిష్ఠానం హామీ ఇచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతూ వచ్చినా.. ఆదివారం జరిగిన మంత్రివర్గ విస్తరణతో ఈ ఊహాగానాలకు తెరపడింది.

రాజధాని పరిధిలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో మొత్తం 29 నియోజకవర్గాలున్నాయి. రాష్ట్ర జనాభాలో 40శాతం ఈ జిల్లాల పరిధిలో ఉంటున్నారు. ఎక్కువ జనాభా ఉన్నచోట ఎమ్మెల్యేలకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేకపోవడం.. పార్టీ బలోపేతానికి, స్థానిక అభివృద్ధిపై ప్రభావం చూపిస్తుందనే చర్చ జరుగుతోంది.

కచ్చితంగా వస్తుందనుకున్నా.. 2023 డిసెంబరులో జరిగిన ఎన్నికల్లో రాజధానిలో మూడు జిల్లాల నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి(ఇబ్రహీం పట్నం), వీర్లపల్లి శంకర్(షాద్‌నగర్) మాత్రమే కాంగ్రెస్ తరపున గెలిచారు. కంటోన్మెంట్‌కు జరిగిన ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేశ్ విజయం సాధించారు. ఈ ముగ్గురిలో శంకర్, శ్రీగణేశ్ తొలిసారి ఎమ్మెల్యేలు. మల్‌రెడ్డి రంగారెడ్డి సీనియర్ నాయకుడిగా కొనసాగుతున్నారు. దీంతో కచ్చితంగా అవకాశం ఉంటుందని ఆశపడ్డారు. ప్రభుత్వంలో మంచి ప్రాతినిధ్యం ఇస్తారనే ఆశతో కొందరు భారాస నుంచి గెలిచినా కాంగ్రెస్‌లో చేరారు. రాజధాని నుంచి మంత్రివర్గంలో ప్రాతినిధ్యం దక్కితే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పట్టు సాధించేందుకు ఉపయోగపడుతుందని అధిష్ఠానానికి వినతులు వెళ్లాయి. సామాజిక సమీకరణాల్లో భాగంగా మంత్రివర్గ విస్తరణలో చోటుదక్కలేదు. దీంతో ఆశావహుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది.

# నాటే వరకే ఆసక్తి.. సంరక్షణకు స్వస్తి

గోదావరిఖని : ప్రభుత్వం చేపడుతున్న మొక్కల పెంపకం కార్యక్రమం సంరక్షణ, ప్రణాళిక లోపంతో నీరుగారిపోతోంది. ఏటా వర్షాకాలంలో భారీగా మొక్కలు నాటుతున్న అధికారులు సంరక్షణ గాలికొదిలేస్తున్నారు. దీంతో బృహత్తర కార్యక్రమం మొక్కుబడిగానే సాగుతోంది. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో మొక్కలు నాటేందుకు సిద్ధమవుతున్న ప్రభుత్వం.. ఈ ఏడాదైనా సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళికా ప్రకారం ముందుకు వెళ్తే భావితరాలకు మేలు జరుగుతోంది.

**పదేళ్లలో 10 కోట్లు**

పదేళ్లలో ప్రభుత్వం హరితహారం, వన మహోత్సం వంటి పథకాల పేరిట నాటిని మొక్కలు చాలా వరకు కనిపించటం లేదు. ఉమ్మడి జిల్లాలో సుమారు 10 కోట్ల మొక్కలు నాటారు. రహదారుల పక్కన, ఖాళీ ప్రదేశాల్లో నాటిన మొక్కలు పశువుల మేత అవుతున్నాయి. కొన్ని నీరు లేక ఎండిపోయాయి. అటవీ, డీఆర్‌డీఏ, పురపాలక సంస్థలు



మొక్కల సంరక్షణను పట్టించుకోవటం లేదు. పైగా విద్యుత్తు సిబ్బంది తీగలకు అడ్డువస్తున్నాయని ఎదిగిన చెట్లను కొట్టేస్తున్నారు. ఏటా నాటిన మొక్క లెక్క మాత్రమే ఉంటుంది. సంరక్షణకు సంబంధించిన ఎలాంటి వివరాలు కనిపించటం లేదు.

**ప్రచారానికే పరిమితం**

ప్రభుత్వం మొక్కలు నాటే విషయంలో ప్రచారానికే పరిమితం అవుతోంది. ఎన్ని మొక్కలు నాటాం. వాటి రక్షణ చర్యలు, ప్రస్తుత పరిస్థితిపై అధికారుల వద్ద ఎలాంటి సమాచారం లేదు. నాటే వరకు మాత్రమే ఆసక్తి చూపుతున్న యంత్రాంగం.. సంరక్షణపై ఆలోచన చేయటం లేదు. ఖాళీ ప్రదేశాలు, రహదారుల పక్కన నాటిన మొక్కలు ఒకట్రెండ్రోజుల్లో కనిపించకుండపోతున్నాయి.

**సింగరేణి ఆదర్శం**

పచ్చదనం పెంపులో సింగరేణి ఆదర్శంగా నిలుస్తోంది. భారీ ఎత్తున మొక్కలు నాటి సంరక్షణకు పటిష్ఠ చర్యలు చేపడుతోంది. సంస్థకు చెందిన కొన్ని ప్రాంతాలు అడవులను తలపిస్తున్నాయి. యాజమాన్యం 25 ఏళ్లుగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తుండగా ఇప్పటివరకు 14,900 హెక్టార్లలో 7 కోట్ల మొక్కలు నాటింది. ఏటా 15 నుంచి 20 లక్షల మొక్కలు లక్ష్యంగా పెట్టుకుంటోంది. సంస్థ నాటిన ప్రతి మొక్కకు రక్షణ కల్పిస్తోంది. ఇప్పటివరకు 80 శాతం మొక్కలు వృక్షాలుగా ఎదిగాయి. ఉపరితల గనుల మట్టి కుప్పలు, రహదారులకు ఇరవైపులా, అటవీ క్షేత్రాలను(బ్లాక్ ఫారెస్టు) పెంచుతోంది.

మట్టి కుప్పలపై మీటరు మందంతో ఎర్ర లేదా నల్ల మట్టి నింపి అటవీ జాతికి చెందిన మొక్కలు నాటుతారు.

రహదారుల పక్కన నాటిన మొక్కలకు కంచె ఏర్పాటు చేసి.. ప్రతి రోజూ నీరు పోస్తారు. సంరక్షించిన వాటికే గుత్తేదారుకు బిల్లు చెల్లిస్తారు. ఏ చోటైనా మొక్క నాటుకోని పక్షంలో అదే ప్రాంతంలో మరో మొక్కను నాటిస్తారు. 100 నుంచి 150 ఎకరాల విస్తీర్ణంలో ఒక ప్రాంతాన్ని ఎంచుకొని చదును చేస్తారు. మొక్కలు నాటి పశువులు అందులోకి రాకుండా చుట్టూ కందకం తీస్తారు. సిబ్బందిని నియమించి నిరంతరం పర్యవేక్షిస్తారు. నాటిన నుంచి నాలుగేళ్లు నిర్వహణ బాధ్యత గుత్తేదారుకే అప్పగిస్తారు. ఏటా పెరుగుదల ఆధారంగా బిల్లు చెల్లిస్తారు. సంరక్షణ శాతం పడిపోతే గుత్తేదారుకు జరిమానా విధిస్తారు.

# మహానగరంలో మాయగాళ్ల నయా ట్రెండ్



హైదరాబాద్ : కాలనీలో ఉంటాడు.. ఖరీదైన కార్లలో తిరుగుతాడు. ఆర్భాటంతో ఎప్పుడూ పదిమంది వెంట ఉంటారు. ఏ పండుగ జరిగినా.. ఊరేగింపు నిర్వహించినా చందాలిస్తాడు. ఇదంతా బయటకు కనిపించే దర్పం. ఇదే నమ్మకాన్ని సొమ్ముగా మలచుకునేందుకు చేసే ప్రయత్నమని గుర్తించేలోపు రూ.కోట్లు కాజేసి ముఖం చాటేస్తాడు. ఇదీ మహానగరంలో మాయగాళ్ల నయా ట్రెండ్. స్టాక్‌మార్కెట్, విదేశీ కంపెనీలు, స్థిరాస్తి రంగం.. అన్నింటా తామేనంటూ మాటలతో మభ్యపెడుతూ అమాయకులను నిండా ముంచుతున్నారు. తాజాగా మలక్‌పేటకు చెందిన ఇద్దరు స్నేహితులు.. తమ వ్యాపారాల్లో పెట్టుబడిపెడితే ఊహించని లాభాలంటూ ఊదరగొట్టి రూ.50 కోట్ల మేర వసూలు చేశారు. మూడేళ్లుగా సాగిన దొంగాట సీసీఎస్ పోలీసుల రంగప్రవేశంతో బట్టబయలైంది. ఇదే తరహాలో నగర శివారున గొలుసుకట్టు మోసాలకు వేలాది మంది బలవుతున్నట్టు పోలీసులు గుర్తించారు.

**ఇప్పుడేం జరుగుతుందంటే..**

పెద్దఎత్తున కమీషన్ ఆశచూపి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లతో ప్రచారం చేస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో ఆకట్టుకుంటున్నారు. బంగారం, ఉక్కు, ఫార్మా, స్టాక్‌మార్కెట్, రియల్‌ఎస్టేట్ రంగాల్లో పెట్టుబడులతో రాత్రికిరాత్రే తలరాత మార్చుకోవచ్చంటున్నారు. ఖరీదైన హోటళ్లలో సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. తమ ఏజెంట్లనే సభ్యులుగా చూపుతున్నారు. ఇది నిజమని నమ్మి సభ్యులుగా చేరుతున్నారని ఓ పోలీసు అధికారి తెలిపారు. ప్రస్తుతం బంగారం ధర పెరగటంతో మహిళలను ఆకట్టుకునేందుకు గోల్డ్ స్కీమ్ పేరిట ఒక ముఠా డబ్బు వసూలు చేస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. బాధితులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

**ఎందుకిలా మోసపోతున్నారంటే..**

గతేడాది ఓ మోసగాడు వెల్‌నెస్ సెంటర్లలో సభ్యులుగా చేరమంటూ.. వందలాది మందితో పెట్టుబడులు పెట్టించాడు. లావాదేవీల్లో ఎక్కడా తన పేరు రాకుండా కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాలను ఉపయోగించాడు. ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న నిందితుల్లో అధికశాతం స్థానికంగా మంచి గుర్తింపు తెచ్చుకున్నవారే. విలాసవంతమైన జీవితం గడుపుతున్నట్టు కనిపిస్తారు. సంస్థలో చేరిన సభ్యులకు నాలుగైదు నెలలు చెప్పినట్టు కమీషన్, లాభాలు జమ చేయిస్తారు. కొత్త సభ్యులను చేర్పించిన వారికి బోనస్‌గా రెట్టింపు కమీషన్ ఇచ్చి నమ్మకం పెంచుతున్నారు. పెద్దమొత్తంలో డబ్బు చేతికి అందాక ముఖం చాటేస్తున్నారు.

# హవాలా రాకెట్.. నేరగాళ్లతో సిండికెట్



హైదరాబాద్: నగరానికి చెందిన హవాలా వ్యాపారి మాదకద్రవ్యాల ముఠాలతో చేతులు కలిపి విదేశాలకు నగదు చేరవేస్తున్నాడు. మూడేళ్లుగా గుట్టుగా సాగిన దందాను పోలీసులు బట్టబయలు చేశారు. ఏటా రూ.2 కోట్ల వరకు అమెరికా, యూకేలోని బంధువులు, స్నేహితుల బ్యాంకు ఖాతాలకు తరలించాడు. కమీషన్ రూపంలో రూ.60లక్షలకు పైగా జేబులో చేరినట్టు దర్యాప్తులో నిర్ధారించారు. ఇప్పటి వరకు నల్లధనం మార్పిడిలో బడా వ్యాపారులకు సహకరించిన హవాలా దళారులు డ్రగ్స్, సైబర్ ముఠాలకు సహకరిస్తున్నారు. ఒక్క హైదరాబాద్‌లోనే సుమారు 20 మంది హవాలా నిర్వాహకులను గుర్తించారు. తాజాగా గోవా కేంద్రంగా డ్రగ్ రాకెట్ నడుపుతున్న నలుగురు నైజీరియన్లలో ఒకరిని టీజీ న్యాబ్ పోలీసులు అరెస్ట్ చేశారు. మత్తు పదార్థాలు విక్రయించగా వచ్చిన కమీషన్ రూ.కోటిన్నర విదేశాల్లోని 150 బ్యాంకు ఖాతాలకు మళ్లించినట్టు గుర్తించారు. ఈ వ్యవహారంలో ముంబయికి చెందిన హవాలా ఆపరేటర్స్ సహకరించినట్టు అంచనాకు వచ్చారు.

**ఆనవాళ్లు దొరక్కుండా ఇలా..**

గోవా, ముంబయి, బెంగళూరు, చెన్నై, రాజస్థాన్ నుంచి సింథటిక్ డ్రగ్స్ కొరియర్, ప్రైవేటు బస్సుల్లో నగరానికి చేరుతున్నాయి. గ్రాముల చొప్పున డ్రగ్స్‌ను ప్యాకెట్లుగా మార్చి కొనుగోలుదారులకు చేరవేస్తున్నారు. వారి నుంచి నగదును పాన్, కిరాణా దుకాణాలు, పెట్రోల్ బంకుల్లోని యూపీఐ ఖాతాలో జమచేయిస్తున్నారు. వారికి రూ.1000కి రూ.100 కమీషన్ ఇచ్చి నగదు తీసుకుంటున్నారు. రూ.లక్షల్లో నగదు జమయ్యాక.. ఆ సొమ్మును మనీట్రాన్స్‌ఫర్, మినీ ఏటీఎం, హవాలా ఆపరేటర్స్‌కు 10 నుంచి 20 శాతం కమీషన్ ఇచ్చి దేశ, విదేశాల్లోని కీలక సూత్రధారుల బ్యాంకు ఖాతాలకు మళ్లిస్తున్నారు. హైదరాబాద్, బెంగళూరుకు చెందిన హవాలా ఆపరేటర్లు కీలకంగా వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది. ఇటీవల పట్టుబడిన వారిలో కొందరు డ్రగ్స్ కేసు నుంచి తప్పించమని పోలీసులతో బేరసారాలు నడిపినట్టు ఆరోపణలు ఉన్నాయి.

**క్రిప్టో.. బిట్‌కాయిన్‌గా సైబర్ సొత్తు..**

డ్రగ్స్ ముఠాల పద్ధతినే సైబర్ మాయగాళ్లు అనుసరిస్తున్నారు. వ్యాపారులు, చిరుద్యోగులు, ఆటోడ్రైవర్లు, కూలీల బ్యాంకు ఖాతాలను కొనుగోలు చేస్తున్నారు. బాధితుల నుంచి కొట్టేసిన సొమ్మును వాటిలో జమ చేస్తున్నారు. వెంటనే ఏటీఎం కేంద్రాల నుంచి నగదు విత్‌డ్రా చేసి హవాలా వ్యాపారుల ద్వారా విదేశాలకు చేరవేస్తున్నారని ఒక పోలీసు అధికారి తెలిపారు. బాధితులు నష్టపోయిన సొమ్ము తిరిగి ఇస్తామని వారినే ఏజెంట్లుగా మార్చుకుంటున్నారు. వారికి ఆన్‌లైన్‌లో శిక్షణనిచ్చి బ్యాంకు ఖాతాల్లోని నగదును క్రిప్టో, బిట్‌కాయిన్‌గా మార్పించి దుబాయ్, హాంకాంగ్, సింగపూర్ తరలిస్తున్నారు. బిట్‌కాయిన్, క్రిప్టోగా మారాక వెనక్కి తీసుకురావటం అసాధ్యమంటున్నారు. హవాలా ఆపరేటర్స్‌పై కేసులు నమోదు చేయటం ద్వారా లింకులను ఛేదించొచ్చని వివరించారు.

# రూ.కోట్లు వస్తున్నా.. తప్పని పాట్లు



వికారాబాద్ : రైతు ఆర్థికాభివృద్ధికి దోహదపడే వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో మౌలిక సదుపాయాలు కొరవడ్డాయి. కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు వెళితే నిత్యం అవస్థలు పడక తప్పడం లేదు. ప్రతినెలా యార్డుల్లో రూ.కోట్లలో క్రయ విక్రయాలు సాగుతున్నాయి. సెస్సు రూపంలో ఆదాయం సమకూరుతున్నా సౌకర్యాల కల్పన మాత్రం ఎండమావిగానే మారింది. జిల్లాలోని పరిగి, తాండూరు, వికారాబాద్, మర్పల్లి, ధారూర్, కోట్‌పల్లి, కుల్కచర్ల, బషీరాబాద్, కొడంగల్, నవాబుపేట మండల కేంద్రాల్లో మార్కెట్లు నడుస్తున్నాయి. ముఖ్యమంత్రి జిల్లా కావడంతో వీటి రూపురేఖలు మారనున్నాయన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

**లక్ష్యానికి మించి ఆదాయం**

ఆయా మార్కెట్ యార్డుల నుంచి వ్యవసాయ, మార్కెటింగ్ శాఖకు 2024–25 ఆర్థిక సంవత్సరంలో 21.98 కోట్ల ఆదాయం లక్ష్యం కాగా.. రూ.28.16 కోట్ల మేరకు సమకూరింది. అంతర్గత రహదారులు, వీధి దీపాలు, మంచినీటి సదుపాయం, రైతు విశ్రాంతి గదులు, ధాన్యం ఆరబోసుకునేందుకు ప్రత్యేకించి కవర్ షెడ్లు లేకపోవడం, జనరేటర్ లేక అంధకారం అలముకోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. నవాబుపేట మినహా మిగతా తొమ్మిది వ్యవసాయ మార్కెట్ యార్డులన్నీ నిర్దేశిత లక్ష్యం కన్నా ఎక్కువ ఆదాయం సాధించాయి. రూ.కోట్ల నిధులు వస్తున్నా పాట్లు మాత్రం తప్పడం లేదని వాపోతున్నారు. కుల్కచర్ల యార్డు రూ.39.54 లక్షలకుగాను రూ.1.62 కోట్లు ఆదాయాన్ని పొంది జిల్లాలోనే నంబర్‌వన్‌గా నిలిచింది. యార్డు ఒక చోట.. వ్యాపార లావాదేవీలు మరోచోట జరుగుతున్నాయి. ప్రత్యేకించి కార్యదర్శి లేకపోవడంతో పరిగి కార్యదర్శి ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు. ఇటు పరిగి అటు కుల్కచర్లలో సిబ్బంది కొరత ఉంది. పరిగిలో ప్రతి శుక్ర, మంగళవారాల్లో యార్డును నిర్వహిస్తున్నారు. కరెంటు పోతే చిమ్మచీకట్లోనే తూకాల నిర్వహణతో రైతులకు నష్టం కలుగుతోంది. కనీసం తాగేందుకు మంచినీరైనా దొరకడం లేదు. **దశల వారీగా సమస్యల పరిష్కారం..**

మార్కెట్ యార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణతో పనిచేస్తున్నాం. సుమారు రూ.20 కోట్ల అంచనా వ్యయంతో యార్డుల్లో వివిధ రకాల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపాం. ఇప్పటికే కొన్ని మంజూరు కాగా.. మరికొన్ని టెండర్ల దశలో ఉన్నాయి. కార్యాలయాలు, ప్రహరీల ఏర్పాటు, గోదాంలు, కవర్ షెడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నాం. బంట్వారంలో నూతనంగా మేకల సంతను ప్రారంభించేందుకు కలెక్టర్ స్థలం కేటాయించారు. సుమారు రూ.50లక్షల అంచనా వ్యయంతో అభివృద్ధి చేస్తాం. సారంగపాణి, జిల్లా సహాయ సంచాలకుడు, మార్కెటింగ్ శాఖ

# హెచ్ఎండీఏలో పరిపాలన జోన్లు

హైదరాబాద్: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ)ను త్వరలో పరిపాలన సౌలభ్యం కోసం వికేంద్రీకరణ చేసే దిశగా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ప్రస్తుతం హెచ్ఎండీఏ పరిధి ఏడు జిల్లాల్లో విస్తరించి ఉంది. త్వరలో మరో 3 వేల కి.మీ.ల మేరకు పెరగనుంది. ప్రాంతీయ రింగ్‌రోడ్డు దాటిన తర్వాత 2 కి.మీ.ల వరకు హెచ్ఎండీఏ గ్రోత్ కారిడార్ కింద రానుంది. అక్కడి వరకు ప్లానింగ్, ఇంజినీరింగ్ ఇతర కార్యకలాపాలన్నీ హెచ్ఎండీఏ పరిధిలోకి రానున్నాయి. ఇప్పటివరకు బల్దియా మాదిరి ప్రత్యేక జోనింగ్ వ్యవస్థ లేదు. కేవలం ప్లానింగ్ విభాగాన్ని మాత్రమే ఆరు జోన్లుగా విభజించారు. ఏడు జిల్లాల పరిధిలో లేఅవుట్లు, నిర్మాణాల కోసం హెచ్ఎండీఏను ఆశ్రయించాల్సి వస్తోంది. సంగారెడ్డి, యాదాద్రి జిల్లాల నుంచి హైదరాబాద్‌కు రావాలి. ఇది వ్యయప్రయాసలతో కూడుకున్నది. పెరిగిన పరిధి చూస్తే ఇప్పుడున్న సిబ్బందికి రెండింతలు అదనంగా అవసరం. దీంతో వికేంద్రీకరణకు యోచిస్తున్నారు.

**జోన్ స్థాయిలోనే పనులు...**

ప్రస్తుతం ప్రణాళిక విభాగంలో ఆరు జోన్లు ఉన్నాయి. సిబ్బంది, అధికారులు నగరం నుంచే సేవలు అందిస్తున్నారు. పరిపాలన జోన్లు ఏర్పాటైతే క్షేత్రస్థాయి నుంచి మొత్తం విభాగాలు పని చేయాల్సి ఉంటుంది. ఉదాహరణకు ప్రతి జోన్‌కు కమిషనర్, ప్లానింగ్ అధికారులు, సీఈ, ఎస్ఈలు ఉంటారు. జోన్ స్థాయిలోనే పనులు పూర్తి చేస్తారు. రానున్న మెగా మాస్టర్ ప్లాన్‌తోపాటు పరిపాలన వికేంద్రీకరణకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రస్తుతంహెచ్ఎండీఏ విస్తీర్ణం: 7,257 చ.కి.మీ.లు
విస్తరించనున్న పరిధి: 10,472.72 చ.కి.మీ.లు
ప్రస్తుతం ఉన్న జిల్లాలు: 07
కొత్త వాటితో కలిపి: 11
మొత్తం మండలాలు: 104
మొత్తం గ్రామాలు: 1355

# అవకాశాల అక్షయపాత్ర

పెద్దపల్లి : సెల్‌ఫోన్, టీవీ, కంప్యూటర్ ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం పెరుగుతోంది. వీటి తయారీలో కీలకమైన సెమీకండక్టర్ రంగంలో అవసరాలకు సరిపడా ఉత్పత్తి లేక ఇండియా ఇతర దేశాల వైపు చూడాల్సి వస్తోంది. ఈ రంగం ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతుండగా.. నైపుణ్యం, పెట్టుబడులు, మౌలిక వసతులు కల్పిస్తే ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉద్యోగాలు లభించనున్నాయి.

**వచ్చే ఏడాది గణనీయ ఉత్పత్తి**

మన దేశంలో సెమీకండక్టర్ల రంగంలో 2021 నాటికి 9 శాతం మాత్రమే దేశీయంగా ఎలక్ట్రానిక్ పరికరాలు ఉత్పత్తి అవుతున్నాయి. 2026 నాటికి 17 శాతం పెంచేలా కేంద్ర ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. పెద్దస్థాయిలో చిప్స్ తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తోంది. గుజరాత్‌లో 2, అసోంలో ఒక పరిశ్రమ స్థాపనకు శంకుస్థాపన చేశారు. ఇక్కడ 2029 నాటికి చిప్స్ ఉత్పత్తి ప్రారంభం కానుంది.

**సన్నద్ధత ఇలా..**దేశీయ తయారీ సామర్థ్యాలను బలోపేతం చేయడం
ఇస్రో, డీఆర్డీవో, బీఈఎల్, ఎస్ఈఎల్ పరిశోధనా సంస్థలు ఆధునిక పరికరాలపై అధ్యయనం
డీఎల్ఐ పథకంలో దేశీయ సంస్థలకు స్టార్టప్‌లో ఆర్థిక సహకారం
ఎలక్ట్రానిక్ చిప్స్ ఎగుమతులకు డిమాండ్ పెరిగేలా చర్యలు తీసుకోవడం. మార్కెట్ అవసరాలు, ఉపాధి రంగాల్లో ప్రతిభ చాటేందుకు సన్నద్ధం చేయడం

ఇదే మంచి తరుణం

ఇంజినీరింగ్, కెమికల్స్ సైన్స్ ఎలక్ట్రానిక్ విభాగాల్లో చదువుతున్న విద్యార్థులకు భవిష్యతులో మంచి అవకాశాలు రానున్నాయి. విద్యార్థులు ఎలక్ట్రానిక్ బ్రాంచ్‌లను ఎన్నుకుంటే చదువు పూర్తయ్యేవరకు



సెమీకండక్టర్ డిజైన్, తయారీ, టెస్టింగ్ రంగాల్లో పట్టు సాధించవచ్చు దేశంలో వచ్చే పదేళ్లలో ఈ రంగంలో విప్లవాత్మక మార్పులు జరగనున్నాయి. ఇతర దేశాలపై ఆధారపడకుండా సొంతంగా ఉత్పత్తులు తయారు చేసుకునే అవకాశం లభించనుంది.

**ఇవీ లోపాలు**

సరైన నైపుణ్యం, శిక్షణ శ్రామికుల కొరత
ఇంజినీరింగ్ యువత లోతైన పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోకపోవడం
నూతన టెక్నాలజీ అభివృద్ధిలో అధిక మూలధన పెట్టుబడుల కొరత

భవిష్యత్తులో మెరుగైన ఉపాధి

ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీలో సెమీ కండక్టర్ రంగం కీలకం. సరైన నైపుణ్యాలు, శిక్షణ అవకాశాలను అందిపుచ్చుకుంటే ప్రతిభ మెరుగవుతుంది. ఇంజినీరింగ్‌లో చేరే విద్యార్థులు ఉపాధి అవకాశాలు లభించే బ్రాంచ్‌లను ఎన్నుకోవాలి. సవాళ్లను అధిగమించేందుకు ప్రభుత్వం పరిశ్రమలు స్థాపించడంతో భారీగా ఉపాధి పెరగనుంది. రమేశ్, ప్రొఫెసర్(ఈసీఈ), హుజూరాబాద్

**ఉపాధి కోర్సులను ఎన్నుకోవాలి**సెమీకండక్టర్ల తయారీలో పురోగతి సాధిస్తున్నాం. ఆధునిక డిజైన్లను తయారు చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. పరిశోధనా సంస్థలు సహకారం అందిస్తున్నాయి. రాబోయే రోజుల్లో ఈ వస్తువులకు అవసరమైన చిప్స్ కొనుక్కునే పరిస్థితి ఉండదు. శ్రీనివాస్, ప్రొఫెసర్(ఈసీఈ) పెద్దపల్లి

చురకలు



# స్మార్ట్ చెక్-42

జగిత్యాల : చిన్నారుల్లో లోపాలను గుర్తించి వాటిని సరిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. మొదట్లోనే లోపాలను గుర్తించి ఉత్తమ భవిష్యత్తు అందించేలా సన్నాహాలు చేస్తోంది. ఎన్ఐఈపీఐడీ(నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటలెక్చువల్ డిసెబిలిటీస్) పేరిట స్మార్ట్ చెక్-42 సర్వే ప్రారంభించింది. ప్రతి జిల్లాలో మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల వారీగా అయిదేళ్లలోపు చిన్నారులపై చేపట్టిన సర్వే నెలాఖరులోగా పూర్తి కానుంది. సర్వే పూర్తయ్యాక ఫలితాల ఆధారంగా గుర్తించిన లోపాలకు అవసరమైన చికిత్స అందించి సవరించేలా రాష్ట్ర ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకోనుంది.

**8 విభాగాలు.. 42 ప్రశ్నలు..**

ప్రతి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో 5 ఏళ్లలోపు పిల్లలందరిని సర్వే చేయాల్సి ఉంటుంది. స్మార్ట్ చెక్-42 సర్వేలో మొత్తం 42 ప్రశ్నలు ఉండగా, 8 విభాగాలుగా సర్వే ఫార్మాట్ను రూపొందించారు. ఇందులో



పుట్టిన వెంటనే 2 నెలలలోపు, 3 నుంచి 5 నెలల లోపు, 6 నుంచి 11 నెలలు, 12 నుంచి 23, 24 నుంచి 35, 36 నుంచి 47, 48 నుంచి 59 నెలల వరకు ఇలా మొత్తం 8 విభాగాల్లో ఒక్కో దానిలో భిన్నమైన ప్రశ్నలు చేర్చారు. చిన్నారి పుట్టిన వెంటనే ఏడ్చాడా?, తల్లిదండ్రులు, సంరక్షకుల స్వరానికి స్పందిస్తున్నాడా? పాలు తాగడంలో ఇబ్బందులు ఇలా ఒక్కో విభాగంలో ఆయా వయసులో ఎదురయ్యే లోపాలను గుర్తించే విధంగా ప్రశ్నావళి రూపొందించారు. ఈ మేరకు అంగన్‌వాడీ కేంద్రాల ఉపాధ్యాయినులు తమ చరవాణిలోని యాప్‌లో ఎస్ లేదా నో, ఇతర వివరాలుంటే వాటిని నమోదు చేస్తున్నారు. ప్రతి చిన్నారికి సంబంధించిన సర్వే వివరాలు న్యూట్రీషనల్ హెల్త్ ట్రాకింగ్ సిస్టమ్ సర్వర్‌లో నిక్షిప్తం అవుతాయి. సర్వే ఫలితాల ఆధారంగా ఏమైనా లోపాలుంటే, అవసరమైన చికిత్స తదితర చర్యలు తీసుకోనున్నారు.

**అయిదేళ్లలోపు చిన్నారులు 64,329**

జిల్లాలో మొత్తం 1065 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వీటి పరిధిలో 5 ఏళ్లలోపు 64,329 మంది చిన్నారులు ఉన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు నెల రోజుల్లో సర్వే పూర్తి చేయాల్సి ఉంది. స్మార్ట్ చెక్-42 సర్వే ప్రారంభించి పది రోజులు కావస్తుండగా ఇప్పటి వరకు 31,936 మంది చిన్నారుల సర్వే పూర్తయింది.

**నెల రోజుల్లో పూర్తి**

చిన్నారుల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించి లోపాలను సవరించేందుకు స్మార్ట్ చెక్ సర్వే ప్రారంభించి పది రోజులు అయింది. అంగన్‌వాడీ కేంద్రాల వారీగా ఉపాధ్యాయినులు చేపట్టిన సర్వే ఇప్పటికే సగం వరకు పూర్తయింది. ఉపాధ్యాయినులు సర్వేలోని ప్రశ్నలను సునిశితంగా ఆకలింపు చేసుకొని సమాధానాలను నమోదు చేస్తేనే చిన్నారులకు న్యాయం జరుగుతుంది. నెల రోజుల్లో సర్వే పూర్తి చేసేందకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. డాక్టర్ బి.నరేశ్‌కుమార్, జిల్లా సంక్షేమాధికారి

# ఖరీఫ్ ప్రణాళిక ఖరారు

వికారాబాద్: ఖరీఫ్ సాగు సీజన్‌కు సంబంధించిన పంటల సాగు ప్రణాళిక ఖరారైంది. ఇందుకు సంబంధించిన నివేదికను జిల్లా వ్యవసాయాధికారులు రూపొందించి ప్రభుత్వానికి పంపించారు. అధికారుల అంచనా ప్రకారం జిల్లా వ్యాప్తంగా 5.95 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యే అవకాశం ఉంది. లక్ష క్వింటాళ్లలో విత్తనాలు, 95 వేల మెట్రిక్ టన్నుల ఎరువుల కోసం కార్యాచరణ రూపొందించారు. అయితే విత్తనాలకు ప్రభుత్వం రాయితీ ఇవ్వకపోవడంతో ప్రైవేటు దుకాణాల్లోనే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

**పత్తి వైపే మొగ్గు..**

వానాకాలం సీజన్‌లో అత్యధికంగా పత్తి పంట వైపే రైతులు మొగ్గు చూపుతున్నారు. క్వింటాలు ప్రభుత్వ మద్దతు ధర రూ.7,521 ఉండటం, బహిరంగ విపణిలో ధర రూ.8 వేల వరకు పలకడమే ఇందుకు కారణం. గతేడాది 2.45 లక్షల ఎకరాల్లో పత్తి పంట వేయగా ఎకరాకు సగటున 6 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. అయినా క్వింటాలుకు గరిష్ఠంగా రూ.7,500 అమ్ముడుపోయింది. పత్తికి బదులు ఇతర పంటలు సాగు చేసిన రైతులు నష్టాలు ఎదుర్కొన్నారు.

**మొక్కజొన్నకు డిమాండ్**

బహిరంగ విపణిలో మొక్కజొన్నకు డిమాండు ఉండటంతో జిల్లాలో 80 వేల ఎకరాల్లో సాగు చేయనున్నారని అంచనా. ప్రభుత్వ మద్దతు ధర రూ.2,225 కాగా బహిరంగ విపణిలో రూ.2,300 నుంచి రూ.2350 వరకు పలుకుతోంది. గత సీజన్‌లో కేవలం 75 వేల ఎకరాలకే పరిమితం కాగా ఈ సారి మరో 5 వేల ఎకరాలు పెరగనుంది.

**వరి సాగు తగ్గేలా..**

జిల్లాలో వరి పంట సాగును 1.1 లక్షల ఎకరాలకే పరిమితం చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గత సీజన్‌లో 1.2 లక్షల ఎకరాల్లో సాగైంది. ధాన్యానికి మద్దతు ధర క్వింటాలుకు రూ.2,320 ఉండటం, సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తుండటంతో వరి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. అయినా ప్రత్యామ్నాయ పంటల వైపుగా రైతులను మళ్లించే దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

**1.4 లక్షల ఎకరాల్లో కంది..**

1.4 లక్షల ఎకరాల్లో కంది సాగు కానుందని అంచనా వేశారు. గత సీజన్ కంటే 5 వేల ఎకరాల విస్తీర్ణం పెంచేలా అధికారులు రైతులను సన్నద్ధం చేస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధర క్వింటాలుకు రూ.7,550 ప్రకటించగా, బహిరంగ విపణిలో మద్దతు రూ.8 వేల వరకు పలుకుతోంది. పైగా అంతర పంటగా అపరాలు(పెసర), మినుము, మొక్కజొన్న చేసుకునే అవకాశం ఉండటంతో రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు.

**కొరత లేకుండా చర్యలు**

మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి. ఈసారి పత్తి, కంది పంటలు అధిక విస్తీర్ణంలో సాగయ్యే అవకాశం ఉంది. ఇందుకు అనుగుణంగా విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటాం. క్లస్టర్ల వారీగా ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేస్తున్నాం.

# కడసారి వీడ్కోలుకూ కన్నీటి కష్టాలే



కరీంనగర్ : జిల్లా కేంద్రంలోని నగరపాలక సంస్థ పరిధిలో శ్మశాన వాటికల్లో కనీస వసతులు కరవయ్యాయి. కడసారి వీడ్కోలు పలుకుదామని వచ్చిన వారికి నీటి కష్టాలు ఎదురవుతున్నాయి. పెరుగుతున్న జనాభాకు తగినట్లుగా వాటిని అభివృద్ధి చేయడంలేదు. ఉన్న వాటిలో ఆధునిక సౌకర్యాలు కల్పించేందుకు అంచనాలు, ప్రతిపాదనలకు తగ్గట్లు లేకపోవడం.. అసంపూర్తి పనులతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తుది దశలో నిలిచిపోయిన పనులు పూర్తి చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

**పూర్తయ్యేదెన్నడు?**

శ్మశానవాటికల్లో అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లే చేసి తుది దశలో ఆపేశారు. నిధుల కొరత, బిల్లుల చెల్లింపులో ఏర్పడిన జాప్యంతో గుత్తేదారులు ఆ వైపు కన్నెత్తి చూడకపోగా, అధికారులు సైతం పట్టనట్లుగా ఉంటున్నారు. ప్రధానగంగా కారా?నగడ్డ, కిసాన్‌నగర్ బీట్ మార్కెట్‌లో ఉన్న విద్యుత్తు సరఫరా లేకపోవడంతో చీకటిగా ఉంటుంది. స్తంభాలు ఉన్నా.. వీటికి నియంత్రిక దగ్గర నుంచి కనెక్షన్ తీసుకోవడంలేదు. గతంలో ఉన్న కనెక్షన్ తొలగించారు. నీళ్ల వసతి అసలే లేదు. స్నానాల గద%రి%లకు తాళాలు ఉంటున్నాయి. బోర్‌వెల్ ఉన్నా పని చేయడంలేదు. ఆదర్శనగర్‌లో బోరింగ్ ఉంది. మీటర్ లేకపోవడంతో అయిదేళ్లుగా శ్మశానవాటికకు వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. సవారన్ వీధిలో ఉన్న వైకుంఠధామం పరిస్థితి అలాగే ఉంది. సమాధుల్లో వీధిదీపాలు వెలగడంలేదు.

**నిధులు కేటాయించినా పనులేవీ?**

నగరవ్యాప్తంగా 22 వైకుంఠధామాలు ఉండగా వీటికి పలు రకాల నిధులు కేటాయించారు. ఇందులో 13 చోట్ల అభివృద్ధికి అయిదేళ్ల కిందట సీఎంఏ, పట్టణ ప్రగతి, సాధారణ, సీడీపీ, ఎస్సీ సబ్‌ప్లాన్, ఆర్థిక సంఘం కింద రూ.12.37 కోట్లు కేటాయించారు. వీటితోపాటు ముస్లిం, సిక్కు, క్రిస్టియన్ మైనార్టీల శ్మశాన వాటికలకు తగిన ప్రాధాన్యం ఇచ్చారు. నిధులు కేటాయించినా ఆ పనులు మాత్రం ఇప్పటికీ పూర్తి కాలేదు. అలకాపురి, మార్కండేయనగర్, మానేరు వాగులో కొంతమేర బాగున్నా మిగతా వాటిల్లో నిర్లక్ష్యం కనిపిస్తోంది.

**ట్యాంకర్లే దిక్కు**

హిందూ సంప్రదాయం ప్రకారం దహన సంస్కారాలు పూర్తయిన తర్వాత స్నానాలు చేయాల్సి ఉంటుంది. స్నానాల గదులు ఉన్నా వినియోగంలోకి తీసుకురావడంలేదు. అందులో నీటివసతి, వీధిదీపాలు లేకపోవడం, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండటంతో అత్యవసర సమయాల్లో ప్రజలు ట్యాంకర్ల దగ్గర నిలబడి స్నానాలు చేసే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా నగర పాలక అధికారులు స్పందించి కనీస సౌకర్యాలు కల్పించేలా చొరవ చూపాలని నగరవాసులు కోరుతున్నారు.

# తూకాల్లో జాప్యం.. రైతులకు శాపం

ఎల్లారెడ్డిపేట: అన్నదాతలను అకాల వర్షాలు వెంటాడుతున్నాయి. యాసంగి సీజన్‌లో వరి ధాన్యాన్ని విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు తరలించగా తూకాల్లో జాప్యం చోటుచేసుకుంటోంది. తరచుగా కురుస్తున్న వర్షాలతో ధాన్యం తడిసిముద్దవుతోంది. తడిసిన ధాన్యాన్ని తిరిగి ఆరబెడుతూ తమవంతు క్రమసంఖ్య రాకకోసం కేంద్రాల్లోనే రైతులు పడిగాపులు కాస్తున్నారు. రాత్రి పగలు తేడాలేకుండా ఆకాశం మేఘావృతమైనప్పుడల్లా ధాన్యం తడిసిపోకుండా ఉండేందుకు ప్లాస్టిక్ కవర్లతో కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. జిల్లాలో ఇలా.. జిల్లాలో ఈ నెల 8 వరకు 17,926 మంది రైతుల నుంచి రూ.297.20 కోట్ల విలువ చేసే 128101.68 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. 119056.89 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు చేర్చగా 9044.79 మెట్రిక్ టన్నుల ధాన్యం బస్తాలను తరలించాల్సి ఉంది. యాసంగి సీజన్‌లో 1,78,350 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. సుమారుగా 4.38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనాకు వచ్చారు. ఇందులో నుంచి 3.50 లక్షల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాలనే లక్ష్యంతో 244 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. 242 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరిస్తున్నారు. 126661.62 మెట్రిక్ టన్నుల దొడ్డురకం, 1440.06 మెట్రిక్ టన్నుల సన్నరకం



ధాన్యాన్ని కొన్నారు.

8700 మంది రైతులకు సంబంధించి రూ.129.26 కోట్లు విలువ చేసే 55716.12 మెట్రిక్ టన్నుల ధాన్యం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇందులో 5153 మంది రైతులకు చెందిన 31665 మెట్రిక్ టన్నుల ధాన్యం డబ్బులు రూ.73.46 కోట్లను బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఇంకా అనేక కేంద్రాల్లో ధాన్యం కుప్పలు పేరుకుపోయాయి. తూకాలు నత్తనడకన సాగుతుండటంతో తమవంతు కోసం రైతులు నిరీక్షిస్తున్నారు. ధాన్యాన్ని ఆరబెట్టేందుకు, వర్షాల బారి నుంచి రక్షించేందుకు ప్లాస్టిక్ పరదాలను అద్దెకు తీసుకొస్తున్నారు. రోజుల తరబడి తూకాలు సాగకపోవడంతో ప్లాస్టిక్ కవర్ల అద్దె డబ్బులు రూ.వందల్లో చెల్లించాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు నిరీక్షణ మరోవైపు ప్లాస్టిక్ కవర్ల అద్దె తప్పడం లేదని వాపోతున్నారు.

**25 రోజులవుతోంది**

పర్వతాలు, రాచర్ల బొప్పాపూర్

5.20 ఎకరాల్లో వరి సాగు చేశా. నెల క్రితం కోతలు ముగించి, ధాన్యాన్ని రాచర్ల బొప్పాపూర్ మార్కెట్ యార్డులోని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చా. నిర్ణీత తేమశాతం వచ్చేంత వరకు ఆరబెట్టాం. తూకం కోసం కుప్పగా పోసి 25 రోజులవుతోంది. అప్పుడప్పుడు వర్షాలు పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. వర్షం ఎప్పుడు ముంచుకొస్తుందా అనే భయంతో ఉన్నాం.

**వేగవంతం చేయాలి** సతీష్, రాచర్ల గొల్లపల్లి

మేం 15 రోజుల క్రితం 4 ఎకరాల్లో వరిని కోసి, రాచర్ల బొప్పాపూర్ మార్కెట్ యార్డులోని ఐకేపీ కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాను. కేంద్రంలోనే ధాన్యాన్ని ఆరబెట్టాను. తూకాల్లో జాప్యం జరుగుతోంది. ధాన్యం ఎండి పది రోజులవుతున్నా తూకం వేయడం లేదు. అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోతుండగా తిరిగి ఆరబెట్టాల్సి వస్తోంది. అధికారులు స్పందించి, తూకాలను వేగవంతం చేయాలి.

# 'దారి'కొస్తాయా?




సిరిసిల్ల: రాష్ట్ర ప్రభుత్వం చొరవ.. కేంద్రం సానుకూల దృక్పథంతో రాష్ట్ర రహదారులను జాతీయ రహదారుల ప్రకటించి ఎనిమిదేళ్లవుతోంది. సిరిసిల్ల, కామారెడ్డి (ఎన్‌హెచ్-161). సిరిసిల్ల, సిద్దిపేట (ఎన్‌హెచ్ 365-బి) నంబర్లు కేటాయించారు. దాని తర్వాత ఒక్క అడుగు ముందుకు పడలేదు. సిరిసిల్ల, సిద్దిపేట రహదారిని కోరుట్ల వరకు పొడిగించడం.. సిరిసిల్ల, పిట్లం జాతీయ రహదారుల హోదా కల్పించాలని కోరుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఇటీవల లేఖ రాశారు. ఈ రెండు జాతీయ రహదారులుగా మారితే జిల్లా పారిశ్రామికంగా, ఆధ్యాత్మికంగా అభివృద్ధికి మరింత అవకాశం ఉంది.

**పెరిగిన వాహనాల రద్దీ**

కరీంగనర్, సిరిసిల్ల, కామారెడ్డి, ఎల్లారెడ్డి, పిట్లం వరకు 149 కిలోమీటర్ల రహదారి ఉంది. కరీంనగర్ సర్కిల్ పరిధిలో 73 కిలోమీటర్ల మేర రహదారి ఉంది. ఈ పనులకు సంబంధించి సర్వే పూర్తయింది. డీపీఆర్ తయారీకి రూ.3.63 కోట్లు కేటాయించారు. సర్వే పత్రాలు 2018లో దిల్లీలోని మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్టు, హైవే శాఖ (ఎంవోఆర్‌టీహెచ్-మోర్త్) పరిశీలనకు పంపారు. దాని తర్వాత నుంచి ఎలాంటి కదలికలేదు. రాష్ట్ర ప్రభుత్వం రూ.80 కోట్లతో కరీంనగర్-సిరిసిల్ల మార్గంలో నాలుగు వరుసల రహదారిగా విస్తరించింది. ఇటు సిరిసిల్లలో రూ.100 కోట్లతో సిరిసిల్ల-కామారెడ్డి రెండో బైపాస్‌ను నిర్మించింది. జాతీయ రహదారి హోదా లభించినా ఈ మార్గంలో ప్రధాన ఇబ్బందుల్లేవు. జిల్లా కేంద్రం నుంచి సిద్దిపేట, జనగామ, సూర్యాపేటలను కలిపే రహదారి పొడవు 182 కి.మీ. సిద్దిపేట జిల్లా పరిధి దుద్దెడ నుంచి సూర్యాపేట వరకు డీపీఆర్ పూర్తయింది. దీనికి వేములవాడ-కోరుట్లకు 35 కి.మీ.పొడిగించాలని కోరారు. సిద్దిపేట డివిజన్ నుంచి సర్వే జరుగుతోంది. మార్పులు, చేర్పుల తర్వాత డీపీఆర్ రూపొందించే అవకాశం ఉంటుంది.

కరీంనగర్-సిరిసిల్ల మార్గంలో వాహనాల రద్దీ పెరిగింది. ఈ మార్గంలో ప్యాసింజర్ కోర్ యూనిట్ (పీసీయూ) 30 వేలు ఉంది. సిరిసిల్ల-కామారెడ్డి మార్గంలో 15 వేలు, సిరిసిల్ల-సిద్దిపేట మార్గంలో 15 వేలు ఉంది. పది వేలలోపు పీసీయూ ఉంటే నాలుగు వరసల జాతీయ రహదారి, పదివేలు దాటితే ఆరు వరసలతో ఎన్‌హెచ్ఏఐ పరిధిలోకి వెళ్తుంది. ఎన్‌హెచ్ఏఐ పరిధిలోకి వెళ్లినా ఆయా పనుల్లో ఏళ్లుగా కాలయాపన జరుగుతోంది.

**ఆధ్యాత్మిక కారిడార్**

రాష్ట్ర ప్రభుత్వం ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలను కలుపుతూ ప్రత్యేక ఆధ్యాత్మిక, పర్యాటక కారిడార్ అభివృద్ధి చేయాలనే ప్రతిపాదన చేసింది. దీనికి కేంద్ర ప్రభుత్వ సాయం తోడైతేనే ఇది పూర్తిస్థాయిలో అమలు జరుగుతుంది. దీనిలో ప్రధానంగా కొమురవెల్లి, వేములవాడ, కొండగట్టు పుణ్యక్షేత్రాలను కలుపుతూ ప్రత్యేక కారిడార్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఉంది. జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణం జరిగితే రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే వారు ఈ మూడు ప్రసిద్ధ ఆలయాలతోపాటు బాసర సరస్వతీ, ధర్మపురి లక్ష్మీనర్సింహస్వామి క్షేత్రాలకు వెళ్లడం సులభం అవుతుంది.

# షరామామూలు.. ఫిర్యాదులొస్తే చర్యలు

పెద్దపల్లి: అనుమతించిన దాని కంటే అధిక పరిమాణంలో మట్టి తరలించడంపై ఫిర్యాదులు రావడంతో పంట పొలాల్లో నిల్వ చేసిన అక్రమార్కులు.. ఆ మట్టిని తాజాగా బట్టీలకు తరలించడం జిల్లాకేంద్రంలో చర్చనీయాంశంగా మారింది. మైనింగ్ అధికారులు కొందరికి అనుకూలంగా, మరికొందరికి ప్రతికూలంగా వ్యవహరిస్తుండటంతోనే దందా యథేచ్ఛగా సాగుతోందన్న ఆరోపణలున్నాయి. పెద్దపల్లి మండలం రాఘవాపూర్ శివారులో 2023లో ఇటుక బట్టీల్లో విజిలెన్స్ అధికారులు తనిఖీ చేస్తారన్న భయంతో యజమానులు పంట పొలాల్లో భారీ మొత్తంలో మట్టిని నిల్వ చేశారు. రాఘవాపూర్ సమీపంలోనూ లక్ష మెట్రిక్ టన్నుల వరకు ఉంచారు. అలా నిల్వ చేసిన మట్టిని వారం రోజులుగా బట్టీలకు తరలిస్తున్నారు. దీనిపై గ్రామస్థులు మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

**నిద్ర మత్తులో గనుల శాఖ**

జిల్లాలో మట్టి రవాణాతో పాటు, ఇసుక అక్రమ తరలింపుపై భూగర్భ గనుల శాఖ అధికారులు ఆది నుంచీ తప్పించుకునే మార్గాలనే అన్వేషిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఫిర్యాదులు చేయడం, కోర్టులను ఆశ్రయిస్తేనే సమస్యలు పరిష్కారమవుతున్నాయి. గతంలో మానేరు నుంచి ఇసుక రవాణాపై గ్రీన్ ట్రైబ్యునల్ ఆదేశాలు వచ్చేవరకు మైనింగ్ అధికారులు స్పందించలేదు. చెరువుల మట్టి తవ్వకాలపైనా నీటిపారుదల శాఖపైనే భారం వేస్తున్నారు. గుర్తించిన చెరువులెన్ని? ఎంత లోతు నుంచి మట్టి తీస్తున్నారు? అనుమతించిన పరిమాణం ఎంత? ఎంత తరలిస్తున్నారు? వంటి కనీస అంశాలపైనా తనిఖీలు చేయకుండానే ఫిర్యాదులను పక్కన పెట్టడం పరిపాటిగా మారింది. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుంటే తప్ప జిల్లా అధికారుల్లో మార్పు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

**అక్కడ అలా.. ఇక్కడ ఇలా..**




పెద్దపల్లి మండలం కొత్తపల్లి చెరువు నుంచి మట్టిని అధిక పరిమాణంలో తరలించడంపై గతంలో కొందరు ఫిర్యాదు చేయడంతో అక్కడి పంట పొలాల్లోనే నిల్వ చేశారు. ఈ ఏడాది మార్చిలో నిల్వ చేసిన మట్టిని బట్టీలకు తరలించే క్రమంలో సదరు ఫిర్యాదుదారుడు స్థానిక అధికారుల తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో విచారణ నిర్వహించిన మైనింగ్ అధికారులు సదు మట్టి కుప్పలను సర్వే చేసి, రవాణాదారులకు రూ.2.31 కోట్ల జరిమానా విధించారు. తాజాగా రాఘవాపూర్ శివారులో నిల్వ చేసిన మట్టిని తరలించడంపై అధికారులు కనీస విచారణ కూడా చేపట్టడం లేదు. ఎవరైనా ఫిర్యాదు చేసి, వెంటపడితే తప్ప విచారణ చేపట్టే పరిస్థితి లేకుండా పోయింది. కనీసం తరలించే మట్టికి రాయల్టీ చెల్లించారా..! గతంలో ఎంత చెల్లించారు..! ఎంత నిల్వ చేశారు..! అనే అంశాలపై కనీస సర్వేలు కరవయ్యాయి.

# సెస్ అందదు.. అవస్థలు తీరవు

వికారాబాద్ : జిల్లాలోని గ్రామ పంచాయతీలు, పురపాలికల్లో గత ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను వసూళ్లు 80 శాతానికి మించి జరిగాయి. అయినా గ్రంథాలయాలకు సెస్(ఇంటి పన్నులో 0.08 శాతం) రూపేణా నిధులు చెల్లించలేదు. ఈ విషయమై పంచాయతీలకు లేఖలు రాసిన ఫలితం కనిపించడం లేదని గ్రంథాలయ అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో 566 పంచాయతీలు, నాలుగు పురపాలక సంఘాలు సెస్ చెల్లించాల్సి ఉంది. జిల్లా కేంద్రంలో ప్రధాన, మండల కేంద్రాల్లో 17 శాఖ గ్రంథాలయాలు ఉన్నాయి. మొత్తం 3,05,522 పుస్తకాలున్నాయి. 14,108 సభ్యులున్నారు. శాఖా గ్రంథాలయాల్లో సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. మారుమూల మండల కేంద్రాల్లో ఉన్నవి అధ్వానంగా మారాయి. కొన్నింట్లో పుస్తకాల కొరత ఉంది. సెస్‌ను చెల్లిస్తే వీటిల్లో అవసరమైన సదుపాయాలు కల్పించవచ్చు. పాఠకులు కోరిన పుస్తకాలను సమకూర్చడానికి వీలవుతుంది.

**బకాయిలు రూ.80 లక్షలు**



2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.65 లక్షల సెస్ చెల్లింపు డిమాండు ఉండగా రూ.35 లక్షలు వసూలు చేశారు. రూ.30 లక్షలు బకాయిలున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా పేరుకపోయిన పాత బకాయిలు రూ.50 లక్షలున్నాయి.

**తాకిడి పెరిగింది**

గ్రంథాలయాలకు అభ్యర్థుల తాకిడి పెరిగింది. వివిధ పోటీ పరీక్షల ఉద్యోగాలకు అభ్యర్థులు సన్నద్ధమవుతున్నారు. నిత్యం వందలాది మంది నిరుద్యోగులు వస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఇక్కడే ఉండి సన్నద్ధం అవుతున్నారు. అభ్యర్థులకు అనుకూలంగా అన్ని రోజులు తెరిచి ఉంచుతున్నారు. ప్రత్యేకంగా పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులకు పెద్ద గదిని ఏర్పాటు చేశారు.

**లేఖలు రాశాంపి.సురేశ్‌బాబు, కార్యదర్శి గ్రంథాలయ సంస్థ, వికారాబాద్.** బకాయిలు చెల్లించాలని కోరుతూ అన్ని పంచాయతీలకు లేఖలు రాశాం. సంబంధిత జిల్లా అధికారులకు దృష్టికి తీసుకెళ్లాం. పురపాలక సంఘాలకు డిమాండు కలెక్షన్ బ్యాలెన్స్ వివరాల గురించి లేఖలు రాశాం. సెస్ పూర్తి స్థాయిలో వసూలైతే పాఠకులకు మరిన్ని సౌకర్యాలు కల్పించవచ్చు.

# వీరు గిరిగీసుకుని.. వారు తవ్వేసుకుని

బనగానపల్లి : బనగానపల్లి సమీపంలో 4 వేల హెక్టార్లలో విస్తరించి ఉన్న రవ్వలకొండ అక్రమార్కులకు వరంగా మారింది. కొందరు మట్టిని తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్లలో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. తవ్వకాలు ఇలానే కొనసాగితే కొన్నేళ్లకు రవ్వలకొండ కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. రవ్వలకొండలో పోతులూరి బ్రహ్మంగారు కాలజ్ఞానం రాసినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఇంతటి చరిత్ర ఉన్న కొండను పట్టపగలే తవ్వి మట్టిని తరలిస్తున్నా అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అక్రమార్కులు వందలాది వాహనాల్లో మట్టిని తరలిస్తున్నారు.

**అంతా నామమాత్రమే**

రవ్వలకొండ విషయంలో అటవీ, రెవెన్యూ, గనులు, పంచాయతీ అధికారుల మధ్య సమన్వయ లోపం కనిపిస్తోంది. ఎవరికివారు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. నెలలో ఒకటి రెండుసార్లు పోలీసులు వాహనాలను పట్టుకొని జరిమానా వేసి వదిలేస్తున్నారు. ప్రతిరోజూ 50 టిప్పర్లు, 50 ట్రాక్టర్లలో మట్టి తరలిపోతోంది. వాహనాల యజమానులు టిప్పరుకు రూ.3 వేలకు పైగా, ట్రాక్టరుకు రూ.1,000 వరకు వసూలు చేస్తున్నారు. దూరాన్ని బట్టి ధర పెంచుతున్నారు. ఈ లెక్కన పరిశీలిస్తే ప్రతిరోజు రూ.2 లక్షలకుపైగా విలువైన మట్టిని



అక్రమార్కులు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

**విలువైన భూములపై కన్ను**

రవ్వలకొండలో మట్టి తవ్వకాలు అటుంచితే భూ ఆక్రమణలు పెద్దఎత్తున సాగుతున్నాయి. ఇక్కడ 20 ఏళ్ల కిందట ఇందిరమ్మ ఇళు నిర్మించారు. సమీపంలో మిగిలిన భూములపై అక్రమార్కులు కన్నేశారు. ఈ ప్రాంతంలో ఇటీవల రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇది రవ్వలకొండ ప్రాంతం మీదుగా వెళుతుంది. ఈ నేపథ్యంలో కొందరు భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారు. పక్కనే ఎస్సార్బీసీ కాలువ ఉంది. కాలువకు ఇరువైపులా మిగులు భూములు ఉన్నాయి. వీటిని కొందరు ఆక్రమించుకునే పనిలో పడ్డారు. ఇప్పటికే కొందరు ఇళ్ల నిర్మాణాలు సైతం చేపట్టడం గమనార్హం.

**అటవీ పరిధిలో ఉంటే చర్యలు**–రామకృష్ణ, రేంజ్ అటవీ అధికారి

అటవీ పరిధిలో అక్రమ తవ్వకాలు ఉంటే చర్యలు చేపడతాం. రవ్వలకొండలో కొంత భాగం రెవెన్యూ, మరికొంత భాగం గనుల శాఖ పరిధిలో ఉంది. అక్రమ తవ్వకాలు చేస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం. సిబ్బందిని మరింత అప్రమత్తం చేస్తాం.

# రుణాలు ఇక ఆన్‌లైన్‌లో..

డోన్: పట్టణాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణాల మంజూరును ప్రభుత్వం సరళతరం చేస్తూ మెప్మా అధికారులకు బాధ్యతలను ఇచ్చింది. తర్వాత అప్రూవల్‌ను బ్యాంకు అధికారులు ఇస్తారు. రుణాల మంజూరుకు పొదుపు సభ్యులు దరఖాస్తు చేయడంలోనూ నూతన విధానాన్ని తెచ్చారు. పొదుపు మహిళలు మహిళాకాశం యాప్‌లో ఆర్పీకి గానీ, మెప్మా సీవో, సీఎంఎం అధికారులకు గానీ దరఖాస్తు చేసుకోవచ్చు. ఇదివరకే సంఘాల సమగ్ర సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయడం వల్ల లాగిన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తారు. మొదటగా ఆర్పీ లాగిన్ నుంచి సీవో, తర్వాత సీఎంఎం లాగిన్‌కు వెళ్తే..దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి రూ. 5 లక్షల వరకు బ్యాంకుల్లో రుణాలు పొందే అవకాశాన్ని కల్పించారు. ఆపైగా రుణం తీసుకోవాలంటే మెప్మా పీడీ లాగిన్‌కు వెళ్తుంది.



**మెప్మా అధికారులకు ప్రతిపాదిస్తేనే..**

మెప్మాకు సంబంధించి ఆర్పీ లాగిన్‌లో 25 గ్రూపులు కన్పిస్తాయి. ఆర్పీ లాగిన్‌లో రుణం మంజూరు చేయాలని ప్రతిపాదన పంపించాలి. తర్వాత సీవో లాగిన్‌కు వస్తుంది. సీవో వాటిని పరిశీలించి అన్నీసరిగా ఉన్నాయని ధ్రువీకరిస్తే...తర్వాత సీఎంఎం లాగిన్‌కు వస్తుంది. సీఎంఎం రూ.5 లక్షల వరకు బ్యాంకు రుణం ఇప్పించేందుకు వీలుంటుంది. రూ.5 లక్షలకు పైగా రుణం తీసుకోవాలంటే పీడీ లాగిన్‌కు వెళ్తుంది. పీడీ లాగిన్ నుంచి ఎంఎల్‌సీసీ యాప్ ద్వారా బ్యాంకర్స్ లాగిన్‌కు వెళ్తుంది. బ్యాంకు అధికారులు లాగిన్‌లో పూర్తిగా పరిశీలించిన తర్వాత సూక్ష్మ రుణ ప్రణాళికను (ఎంసీపీ) ఆధారం చేసుకుని రుణాన్ని గ్రూపు సభ్యుల వ్యక్తిగత ఖాతాలకు చేరుస్తారు. గ్రూపు లీడర్ల చరవాణులకు మెసేజ్ ద్వారా రుణం మంజూరైందా, తిరస్కరించారా అనేది తెలియజేస్తారు. మహిళలు బ్యాంకుకు కేవలం నగదు తీసుకునేందుకు వెళ్తే సరి. ఈ ప్రక్రియలో రూ.5 లక్షల వరకు అంటే మెప్మా ఆర్పీ, సీవో, సీఎంఎం లాగిన్‌కు (మహిళాకాశం యాప్ ద్వారా), రూ.5 లక్షలకు పైగా రుణం అయితే మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) లాగిన్ (ఎంఎల్ఎల్‌సీ యాప్)లు కీలకం కానున్నాయి. రుణం కావాలని దరఖాస్తు నమోదు నుంచి సమాచార సేకరణ, రుణం మంజూరు వరకు అన్నీ ఈ యాప్ ద్వారానే జరగనున్నాయి.

**ఎంతో ఉపయోగం**

రుణం మంజూరు విషయంలో పారదర్శకత పెరిగేందుకు ఈ విధానం ఎంతో ఉపయోగపడుతుంది. ఒకటికి మించి సంఘాల్లో ఉండి రుణాలు పొందుతూ కొందరు బురిడీ కొట్టిస్తుంటారు. ఇటువంటి వారికి ఈ కొత్త విధానం ద్వారా అడ్డుకట్ట వేసేందుకు ఉపయుక్తంగా ఉంటుంది. ఒక గ్రూపు ఒక బ్యాంకులోనే రుణం తీసుకునేందుకు వీలుంటుంది. కానీ మరో బ్యాంకులో రుణం తీసుకునేందుకు వీలుండదు. కొందరు గ్రూపు సభ్యులకు తెలియకుండా రుణాలు పొంది తర్వాత ఇబ్బందులు పెట్టిన సంఘటనలు ఉన్నాయంటే అతిశయోక్తి లేదు. రుణం మంజూరైందా, లేదా అని తెలుసుకునేందుకు మెప్మా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు. కర్నూలు జిల్లాలో మొత్తం 16 వేల స్వయం సహాయక సంఘాలు ఉండగా, నంద్యాల జిల్లాలో 11 వేల సంఘాలు ఉన్నాయి. బ్యాంకుల్లో రుణాల మంజూరుకు సంబంధించి 2025–26 ఆర్థిక సంవత్సరంలో కర్నూలు జిల్లాలో 4,500ల ఎస్‌హెచ్‌జీలకు రూ.450 కోట్ల రుణాలు, నంద్యాల జిల్లాలో 2,700ల ఎస్‌హెచ్‌జీలకు రూ.270 కోట్ల రుణాలు ఇవ్వాలన్న లక్ష్యంతో అధికారులు రుణాలు మంజూరు చేస్తున్నారు. దీనివల్ల నాన్‌ఫెర్‌ఫార్మెన్స్ అకౌంట్స్ (ఎన్‌పీఏ) రుణాలు చెల్లించని గ్రూపులు తగ్గే అవకాశం ఉంటుంది.

# వక్రమార్గంలో డీజిల్ వ్యాపారం



యాడికి : యాడికి మండలంలో డీజిల్ దందా యథేచ్ఛగా సాగుతోంది. జాతీయ రహదారి పక్కనే అక్రమ వ్యాపారం జరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదు. లారీల నుంచి తక్కువ ధరతో డీజిల్ కొనుగోలు చేసి ఇతర వాహనదారులకు తక్కువకు అమ్ముతూ రూ.వేల ఆదాయాన్ని గడిస్తున్నారు. పైకి మాత్రం ద్విచక్ర వాహనాలకు పెట్రోల్ అమ్ముతున్నట్లు నటిస్తూ లోపల మాత్రం డీజిల్ దందా సాగిస్తున్నారు.

**టీకొట్టుల్లో వ్యాపారం**

డీజిల్ వ్యాపారంలో రాబడి బాగా ఉండటంతో 67వ జాతీయ రహదారి వెంబడి చుక్కలూరు, వేములపాడు గ్రామాల వరకు ఐదారు వరకు టీ కొట్టుల్లా డీజిల్ సేకరణ దుకాణాలు వెలిశాయి. డీజిల్ విక్రయదారులను పట్టుకుని కేసులు నమోదు చేసినా తిరిగి ఇదే దందాను కొనసాగిస్తున్నారు.

**సాగుతోందిలా?** యాడికి, తాడిపత్రి చుట్టుపక్క ప్రాంతాల్లో అధిక సంఖ్యలో సిమెంట్, గ్రానైట్, వివిధ రకాల పరిశ్రమలు ఉన్నాయి. ఇక్కడి నుంచి వేల కిలో మీటర్ల దూర ప్రాంతాలకు సరకుల ఎగుమతి, దిగుమతులు జరుగుతుంటాయి. వాహనాల యజమానులు లారీ ట్యాంకులకు డీజిల్‌ను పూర్తి స్థాయిలో నింపి పంపుతారు. వివిధ కంపెనీలకు చెందిన లారీ డ్రైవర్లు ప్రయాణ సమయాల్లో డీజిల్ ఆదా కావడానికి ఇంజిన్‌ను న్యూట్రల్ చేస్తుంటారు. ఇలా మిగిలిన డీజిల్‌ను లీటరు రూ.60 నుంచి రూ.72 వరకు దుకాణదారులకు విక్రయిస్తారు. ఒక్కో లారీ నుంచి 15 నుంచి 30 లీటర్ల వరకు సేకరించిన డీజిల్ బంకుల్లో కంటే రూ.10, 15 తక్కువకు అమ్ముతారు. కొందరు వాహనాల డ్రైవర్లు బంకుల్లో కాకుండా ఇక్కడ డీజిల్ పోయించుకుంటారు. వారికి ఒక్కో లీటరు మీద రూ.20 వరకు మిగులుతోంది. పగలు, రాత్రి సగటున వందల లీటర్లను సేకరిస్తూ, క్రయ, విక్రయాలు జరిపి సొమ్ము చేసుకోవడం రివాజుగా మారింది.

**ఉపేక్షించం..**

ఏ వ్యాపారమైనా ప్రభుత్వ నిబంధనలకు లోబడే జరగాలి. అలాకుండా చేస్తే అది అక్రమమే. లారీ డ్రైవర్ల నుంచి డీజిల్ సేకరించి సాగించే వ్యాపారం చట్టరీత్యా నేరం. ఇలాంటి వ్యాపారాలను ఉపేక్షించే పరిస్థితి లేదు. అనుమతుల్లేకుండా ఉన్న దుకాణాలపై దాడులు చేసి, నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తాం.

ఈరన్న, యూపీఎస్ సీఐ, యాడికి.

# ఆకాశంలో చక్కర్లు.. నేరస్థులకు చుక్కలు!



పాయకరావుపేట : ధర్నాలు జరిగిన సమయంలో ఎంత మంది వచ్చారు? వారిని నియంత్రించేందుకు ఎంత మంది సిబ్బంది కావాలనేది డ్రోన్‌ల సహాయంతో అంచనా వేస్తున్నారు. నగరంలో ఎక్కడైనా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగితే వీటి సహాయంతో కారణాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. పోటీ పరీక్షల సమయంలో ఆయా కేంద్రాల వద్ద పూర్తి స్థాయి నిఘా పెడుతున్నారు.డ్రోన్‌లు అందుబాటులోకి వచ్చిన తర్వాత శివారు ప్రాంతాల్లో నేరాల సంఖ్య చాలా వరకు తగ్గుముఖం పట్టిందని పోలీసు అధికారులు చెబుతున్నారు. నగర శివారు ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మారుమూల, నిర్మానుష్య, జనసంచారం లేని ప్రాంతాలతోపాటు తీర ప్రాంత భద్రతపై దృష్టి సారించింది. పోలీసుశాఖకు అందుబాటులోకి వచ్చిన డ్రోన్‌ల ద్వారా నిఘా పెంచింది. బహిరంగ ప్రదేశాల్లో మద్యం, గంజాయి తాగేవారు, జూదరులను గుర్తించి కేసులు నమోదు చేయడం ప్రారంభించారు.

**'టెదర్' ప్రత్యేకతే వేరు:** అత్యాధునిక సాంకేతిక హంగులతో కూడిన రూ.25 లక్షల విలువైన టెదర్ డ్రోన్‌ను ప్రభుత్వం సమకూర్చింది. ఇది సుమారు 5 కి.మి. పరిధిలో ఎగురుతూ నేరస్థులను పసిగడుతోంది. రోజుకు 10 గంటలపాటు గాల్లోనే ఉంటూ సేవలందిస్తోంది. పెందుర్తి, భీమిలి, ఆనందపురం, పద్మనాభం, నాల్గవ పట్టణ పోలీసుస్టేషన్ కంచరపాలెం, ఎంవీపీకాలనీ, ఆరిలోవ పోలీసుస్టేషన్ల పరిధిలోని శివారు ప్రాంతాల్లో, ఆర్కేబీచ్, రుషికొండ పరిసరాల్లో వీటిని ఉపయోగించి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తున్నారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు, రాత్రి 11 నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు వీటిని ఉపయోగిస్తున్నారు.

**11 డ్రోన్‌లు... 118 మందికి శిక్షణ:** నేరస్థుల కదలికలను గమనించేందుకు, బందోబస్తు నిర్వహణ తదితర వాటికీ నగర పోలీసుశాఖ డ్రోన్‌లను ఉపయోగిస్తోంది. ప్రస్తుతం విశాఖ పోలీసు కమిషనరేట్ పరిధిలో 11 డ్రోన్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటిని ఉపయోగించడంపై శాంతిభద్రతల విభాగానికి చెందిన 73 మందికి, క్రైం విభాగానికి చెందిన 33 మందికి, ట్రాఫిక్ విభాగానికి చెందిన 12 మందికి.. మొత్తం 118 మంది సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

**ఎలా ఉపయోగపడుతున్నాయంటే..**

ఇప్పటి వరకు గంజాయి తాగిన వారిపై 8 కేసులు, జూదరులపై 15, బహిరంగ ప్రదేశంలో మద్యం తాగిన వారిపై 20కిపైగా కేసులు నమోదు చేశారు. సింహాచలం చందనోత్సవం రోజున గోడ కూలిన ఘటనలో పలువురు మృతి చెందిన విషయం విదితమే. ఆ సమయంలో విద్యుత్ నిలిచిపోవడంతో టెదర్ డ్రోన్‌కు ఉన్న సెర్చ్‌లైట్ను ఉపయోగించి శిథిలాల కింద ఉన్న పలువురిని గుర్తించారు.

# రోగాలు ముసురుతున్నాయ్



ఆదోని : ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. దోమల బెడద ఎక్కువై జనం రోగాల బారిన పడుతున్నారు. మరోవైపు చాప కింద నీరులా డెంగీ, మలేరియా కేసులు నమోదవుతున్నా వైద్య, ఆరోగ్య శాఖ మేలుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటికే 150 డెంగీ కేసులు నమోదవడం ఆందోళన కలిగిస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 973 పంచాయతీలు ఉన్నాయి. నగరపాలక సంస్థతో పాటు తొమ్మిది పురపాలక సంఘాలున్నాయి. 40 లక్షలకుపైగా జనాభా ఉంది. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో చాలా ప్రాంతాల్లో పారిశుద్ధ్యం లోపిస్తోంది. వ్యాధులు ప్రబలుతున్నాయి. గ్రామాల్లో దోమల నివారణకు అవసరమైన పిచికారీ మందులు, స్ప్రేయర్లు అందించినట్లు అధికారులు చెబుతున్నా ఆ పరిస్థితి ఎక్కడా కానరావడం లేదు. కొన్నిచోట్ల తూతూమంత్రంగా ఫాగింగ్ చేస్తున్నారు. కర్నూలు నగరంతోపాటు పట్టణాల్లో ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రూ.5.36 కోట్లు ఇచ్చింది. నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేసిన దాఖలాలు లేవు.

**నివారణ చర్యలు అంతంతే**

అన్ని ప్రాంతాల్లో జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమాలు చురుగ్గా జరగాలి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 87 పీహెచ్‌సీలు, 18 సీహెచ్‌సీలు, జిల్లా సర్వజన ఆస్పత్రులతోపాటు ఆరోగ్య ఉప కేంద్రాలున్నాయి. వీటిలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఉన్నారు. పర్యవేక్షకులతోపాటు వివిధ స్థాయిల్లో వైద్య సిబ్బంది ఉన్నప్పటికీ నివారణ పనులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. వ్యాధులు సోకితే జనం ఆస్పత్రులకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. చికిత్స నిమిత్తం కొందరు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అవకాశంగా నిర్వాహకులు రోగులను దోచుకుంటున్నారు.

**చేపట్టాల్సిన కార్యక్రమాలివే..**

వార్డులు, గ్రామాలవారీగా ఇళ్లను విభజించి రోజుకు కొన్ని వార్డుల చొప్పున సర్వే చేయాల్సి ఉంది. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాల్సి ఉంది. నీటి తొట్టెలు, డ్రమ్ములు, కుండలు, గుంతలు తదితర వాటిల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాలు నిర్వహించాలి. దోమ తెరలు, ఒంటిని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులు వినియోగించాలని వైద్యులు పేర్కొంటున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరంగా చేయాల్సి ఉంది.

# భాషా పండితులు.. బదిలీ వెతలు

నంద్యాల : ఉమ్మడి జిల్లాలో భాషోపాధ్యాయుల పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. 2019లో అప్పటి వైకాపా ప్రభుత్వ హయాంలో ఇచ్చిన పదోన్నతులు వీరికి తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. క్రమం తప్పకుండా బదిలీ చేస్తున్నారు. వరుస బదిలీలతో వీరితోపాటు కుటుంబ సభ్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**గందరగోళం.. ప్రయోజనాలు దూరం**

2019 నవంబరు నెలలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న భాషోపాధ్యాయుల (తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం, కన్నడ) ఉన్నతీకరణ జరిగింది. 2017లో ఇచ్చిన జీవోఎంఎస్ 91ను గత వైకాపా ప్రభుత్వం పక్కనపెట్టి జీవోఎంఎస్ 77ను ప్రవేశపెట్టింది. దీంతో ఎస్‌జీటీ ఉపాధ్యాయులు పదోన్నతి పొందగా అర్హులైన భాషా పండితులు అవకాశాన్ని కోల్పోయారు. ఇదేకాక భాషా పండితులకు ఎల్‌పీ కేడర్ లేకుండాపోయింది. అటు ఎల్‌పీ వ్యవస్థ లేక ఇటు పదోన్నతులు రాక.. అసలు ఏ విభాగం ఉపాధ్యాయులో వారికే అర్థం కాని పరిస్థితి నెలకొంది. భాషా పండితులను డీఈవో పూల్ కింద పరిగణించి వర్క్ అగైనెస్ట్ వేతనాలతో విధులు కేటాయిస్తున్నారు.

**మరోసారి మొదలైన ఆందోళన**

ప్రస్తుతం కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మరోసారి బదిలీలు జరుగుతున్నాయి. రెండు జిల్లాల్లో తెలుగు భాషా పండితులు 93, హిందీ భాషా



పండితులు 14 మంది ఉన్నారు. మిగతా మైనర్ భాషా పండితులు మరో పదిమంది వరకు ఉన్నారు. బదిలీల్లో భాగంగా ఉమ్మడి జిల్లాలో విద్యాశాఖాధికారులు చూపిన తెలుగు పోస్టుల ఖాళీలు 211 ఉన్నాయి. వీటిలో కౌతాళం మండలం 30, కోసిగి 26, హొళగుంద 19, హాలహర్వి 12, ఆస్పరి 12, ఆదోని 17, తుగ్గలి 8, పెద్దకడబూరు 7, మంత్రాలయం మండలంలో 10 ఉన్నాయి. అవుకు మండలంలో 10, సంజామల మండలంలో 5 పోస్టులు ఉన్నాయి. దీంతో ఇష్టం లేకున్నా బలవంతపు బదిలీలకు భాషా పండితులు ఒప్పుకోవాల్సి వస్తోంది.

**ఇష్టం లేకున్నప్పటికీ..**

ఉపాధ్యాయుడికి ఒకసారి బదిలీ అయితే ఉమ్మడి జిల్లాలో ఏదైనా పాఠశాలలో కనీసం ఎనిమిదేళ్లు పనిచేసేందుకు అవకాశం ఉంటుంది. డీఈవో పూల్‌లో ఉన్న భాషోపాధ్యాయులు మాత్రం బదిలీలు జరిగిన ప్రతిసారి తమకు ఇష్టం లేకున్నా బలవంతపు బదిలీలకు గురవుతున్నారు. ఇలా గత ఆరేళ్లలో కర్నూలు, నంద్యాల జిల్లాల్లో నాలుగుసార్లు బదిలీ అయ్యారు. దివ్యాంగులు, ఉద్యోగ విరమణకు దగ్గరగా ఉన్నవారు తదితరులు ఈ బలవంతపు బదిలీలతో సమస్యలు ఎదుర్కొంటున్నారు. గతేడాది డిసెంబరు 20న భాషా పండితులకు అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇచ్చింది. 2019 నుంచి భాషా పండితులకు ఇవ్వాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించి మూడు నెలల వ్యవధిలో పదోన్నతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

**శాశ్వత స్థానాలు కేటాయించాలి- ముత్తోజు వీరబ్రహ్మం, రాష్ట్ర అధికార ప్రతినిధి, ఆర్‌జేయూపీ**

డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులను ఏళ్ల తరబడి డీఈవో పూల్‌లో ఉంచడం సరికాదు. గతంలో ఎప్పుడూ ఇలా ఉంచలేదు. ఇది ఉపాధ్యాయుల హక్కులకు విఘాతం కలిగిస్తుంది. భాషా పండిత వ్యవస్థను రద్దు చేసిన తర్వాత కేడర్ కోల్పోయిన భాషోపాధ్యాయులకు తక్షణమే పదోన్నతులు కల్పించి శాశ్వత స్థానాలు కేటాయించాలి.

# ఖాతాలో అధనం.. కదలని గృహం

కర్నూలు : గత వైకాపా ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. లబ్ధిదారులకు అదనపు సాయం ప్రకటించింది. వారి ఖాతాల్లో నిధులు జమ చేసింది. కానీ చాలామంది నిర్మాణాలు పూర్తి చేసుకునేందుకు ముందుకు రావడం లేదు. అవగాహన కల్పించినా పట్టించుకోకపోగా.. ఆ నిధులను ఇతర అవసరాలకు వాడుకున్నారు. ఈ నేపథ్యంలో నిధుల రికవరీతో పాటు మంజూరు చేసిన ఇళ్లను రద్దు చేసే విషయమై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది.

**మూడు విడతలుగా..** కర్నూలు జిల్లాలో 12,132, నంద్యాల జిల్లాలో 21,910 గృహాలు అసంపూర్తిగా ఉన్నాయి. వీటికి అదనపు సాయం అందించేందుకు ప్రభుత్వం సర్వే జరిపింది. కర్నూలు జిల్లాలో 2,058 మంది లబ్ధిదారుల్లో కొందరు ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలను మూడు విడతలుగా రూ.4.50 కోట్లను జమ చేసింది. నంద్యాల జిల్లా పరిధిలో 3,140 మందికి రూ.7.75 కోట్లు జమ చేసింది.

**గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో..**

పేదలందరికీ ఇళ్లు పథకం పేరుతో 2019–20లో ఉమ్మడి జిల్లా పరిధిలో మొదటి విడతలో 638 లేఅవుట్లు వేసి 1,32,707 మందికి పట్టాలు పంపిణీ చేశారు. రెండో విడతలో మరో 370 లేఅవుట్లు ఏర్పాటుచేసి 30,346 మందికి పట్టాలిచ్చారు. ఆయా ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించుకోవడం లేదంటూ లేఅవుట్ల సంఖ్యను 600కు తగ్గించారు. ప్రస్తుతం 450లోపే ఉన్నాయి. గత వైకాపా ప్రభుత్వం ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు మాత్రమే ఇచ్చింది. నిధులు సరిపోక చాలామంది ఇంటి పనులను ఆపేశారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అసంపూర్తి ఇళ్లను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టింది. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అదనపు ప్రయోజనం కల్పించాలని నిర్ణయించింది. ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలు రూ.75 వేలు అందించింది.

**ముందుకొచ్చింది 886 మందే**

ఉమ్మడి జిల్లాలో 5,198 మందికి రూ.12.25 కోట్లను ప్రభుత్వం వారి ఖాతాల్లో జమ చేసింది. కానీ కర్నూలు జిల్లాలో 424, నంద్యాల జిల్లాలో 462 మంది మాత్రమే నిర్మాణాలకు ముందుకొచ్చారు. అదనపు సాయం తీసుకున్నవారిలో కనీసం వెయ్యి మంది కూడా ఇళ్ల నిర్మాణాలు చేసుకునేందుకు ముందుకు రాలేదు.

**తాఖీదులు ఇచ్చినా** ప్రభుత్వం అదనపు సాయం ఇచ్చినా కొందరు లబ్ధిదారులు స్పందించలేదు. ఈ నేపథ్యంలో గృహనిర్మాణ శాఖ ఇంజినీర్లు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు.. లబ్ధిదారుల వద్దకెళ్లి వారికి అవగాహన కల్పిస్తున్నా ప్రయోజనం లేకపోతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 4,312 మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు ముందుకు రాకపోవడంతో అధికారులు వారికి మూడుసార్లు తాఖీదులు జారీ చేశారు. అయినప్పటికీ స్పందన కానరావడం లేదు.

**తిరిగి వసూలు చేసేలా..** ఇళ్ల నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారుల నుంచి నగదు వసూలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు సమాచారం. రెవెన్యూ రికవరీ చట్టం (ఆర్ఆర్ యాక్ట్) కింద తిరిగి వసూలు చేసేలా ఆలోచిస్తున్నట్లు తెలిసింది. ఆర్థిక సాయం అందించినా ఇళ్లు నిర్మించుకునేందుకు ముందుకు రాని లబ్ధిదారులపై ప్రభుత్వం పునరాలోచిస్తున్నట్లు సమాచారం. అవగాహన కల్పించినా.. తాఖీదులిచ్చినా ప్రయోజనం లేకపోవడంతో ఏం చేయాలన్నదానిపై ఆలోచిస్తోంది.

# ప్రతిపాదనలకే పరిమితం

అనంతపురం : జిల్లా అటవీశాఖ విభాగాల పునర్విభజనకు పంపిన ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. ఐదేళ్ల కిత్రమే ప్రతిపాదనలు పంపారు. మళ్లీ గతేడాది రెండోసారి పంపినా అతీగతీ లేదు. జిల్లా అటవీశాఖ (టెరిటోరియల్) పర్యవేక్షణలో సామాజిక వనం, వన్యప్రాణి విభాగాలు పని చేస్తున్నాయి. వన్యప్రాణులు, అటవీ సంరక్షణకు సరిపడా క్షేత్రస్థాయి సిబ్బంది లేరు. జిల్లా అటవీ శాఖ పరిధిలో అనంతపురం, గుత్తి, కళ్యాణదుర్గం రేంజ్‌లు ఉన్నాయి. పునర్విభజనతో తాడిపత్రి రేంజ్ ఏర్పాటు కానుంది. పుట్లూరు, ముచ్చు




కోట సెక్షన్లను తాడిపత్రి రేంజ్‌లో కలపాలని నివేదించారు. కొత్తగా ఐదు సెక్షన్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపారు. అందులో గార్లదిన్నె, ఉరవకొండ, శెట్టూరు, డి.హీరేహాళ్, తాడిపత్రి ఉన్నాయి.

**సిబ్బంది కొరతతో ప్రభావం..**

జిల్లాలో అటవీ శాఖలో సిబ్బంది కొరత వేధిస్తోంది. అన్ని క్యాడర్లలో 88 పోస్టులకు గాను 54 మంది ఉన్నారు. జిల్లాలో అటవీశాఖ, సామాజిక వనవిభాగం సంయుక్త ఆధ్వర్యంలో 14 నర్సరీల్లో 12.25 లక్షల మొక్కలు పెంచారు. ప్రస్తుతం జిల్లాలో 3.85 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లా అటవీశాఖ అధికారి విఘ్నేశ్ నెలాఖరు వరకు సెలవుపై వెళ్లారు. కర్నూలు జిల్లా డీఎఫ్‌వో శ్యామలకు అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో మొక్కల పెంపకంపై ప్రభావం చూపుతోంది.

**అద్దె భవనాల్లోనే..**

అనంత నగరం శ్రీనగర్‌కాలనీలో రెండు కార్యాలయాలకు సంబంధించి భవనాలను అటవీశాఖ అద్దెకు తీసుకుంది. రెండింటికి నెలకు రూ.70 వేల అద్దె చెల్లిస్తోంది. పలు పనులపై వచ్చే ప్రజలకు కార్యాలయాలు దూరంగా ఉండటంతో అసౌకర్యంగా మారింది.

## పురం కాలనీలకు తీరనున్న నీటి కష్టాలు

హిందూపురం : నీటి సమస్యలతో అష్టకష్టాలు పడుతున్న హిందూపురం పట్టణ శివారు ప్రాంతాలకు ఇది శుభవార్త. పట్టణంలో అనేక ప్రాంతాల్లో పైపులైన్ లేకపోవడం, మరికొన్ని ప్రాంతాల్లో మోటార్లు పనిచేయక పోవడంతో నీటి సమస్య ఎదురవుతోంది. సమస్యలను పరిష్కరించి అన్ని ప్రాంతాలకు నీటిని అందించేలా చూడాలని ఎమ్మెల్యే బాలకృష్ణ ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు చొరవ చూపారు. నిబంధనల ప్రకారం టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి రూ.50లక్షలతో పైపులు, మోటార్లు తెప్పించారు. ఏఏ



ప్రాంతాలకు ఎలాంటి పైపులు ఎంత సామర్థ్యం ఉన్న మోటార్లు అవసరమో గుర్తించారు. అందుకు తగ్గట్టుగా పైపులు తెప్పిం చారు. 20హెచ్‌పీ సామర్థ్యం ఉన్న ఆరు మోటార్లు వచ్చాయి. వీటి కోసం రూ.50లక్షలు వెచ్చించారు. ఆరు కిలోమీటర్ల పైపులైన్ వేయడా నికి అవసరమైన పైపులు సరఫరా అయ్యాయి. వీటిని శివారు ప్రాంతా లతో పాటు పట్టణంలో పలుచోట్ల పైపులైన్ దెబ్బతిని నీటి సరఫరా సక్రమంగా జరగని చోట ఏర్పాటు చేయనున్నారు. పట్టణంలో ని మోతుకపల్లి సంపు వద్ద సామర్థ్యం తగ్గిపోవడంతో అవి నీటిని ఎత్తిపోయ లేకపోతున్నాయి. వాటి స్థానంలో నూతన మోటార్లను ఏర్పాటు చేయనున్నారు. కొత్త మోటార్లు ఏర్పాటుతో నీటి సరఫరా పెరగనుంది.

## ముంపు ముప్పు.. ఎవరిదీ తప్పు

కర్నూలు : నగరం విస్తరించేకొద్దీ ఆక్రమణలు ఎక్కువవుతున్నాయి. చివరికి నదులు, వాగులు మాయమవుతున్నాయి. అయినా అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోగా ట్రాఫిక్ బూచి చూపి నదిలో ఏకంగా రహదారి నిర్మించేస్తున్నారు. కర్నూలు నగరం మీదుగా 5.4 కి.మీ. మేర హంద్రీ నది ప్రవహిస్తుంది. ఒకప్పుడు విశాలంగా ఉన్న నది ప్రస్తుతం ఆక్రమణలకు గురైంది. వీటిని తొలగించాల్సి ఉండగా ఆయా శాఖల అధికారులు నిర్లక్ష్యం వహించారు. వాస్తవానికి బఫర్‌జోన్‌లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదు. ఎవరైనా కట్టడాలు చేపడితే వాటిని తొలగించాల్సి ఉంది. కానీ అధికారులే నిబంధనలకు పాతర వేశారు. రాజ్‌విహార్ సమీపంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయం నుంచి బుధవారపేట వరకు హంద్రీనదిలో ఏకంగా బండ్ రోడ్డు నిర్మిస్తున్నారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ నియంత్రణ పేరుతో పనులు చేపట్టారు. దీనిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**పనుల్లో నాణ్యత కరవు**

రహదారి పనుల్లో నాణ్యత ప్రమాణాలు కరవయ్యాయన్న విమర్శలున్నా యి. జొహరాపురం డంప్‌యార్డులోని మట్టిని తీసుకొచ్చి పూడ్చి రహదారి నిర్మిస్తున్నారు. నదీ తీరంలో రోడ్డు వేయాలంటే పకడ్బందీ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అవేమీ చేయడం లేదు. అధికారుల పర్యవేక్షణ లోపించింది. దీంతో ఇష్టానుసారంగా పనులు జరుగుతున్నా యన్న విమర్శలున్నాయి.

**అనుమతి లేకనే..** రాజ్‌విహార్ సమీపం నుంచి జొహరాపురం వరకు దాదాపు 1.25 కి.మీ.ల మేర హంద్రీనది వెంబడి రహదారి నిర్మాణానికి ప్రణాళికలు వేశారు. ప్రస్తుతం బుధవారపేట వంతెన వరకు రహదారి నిర్మిస్తున్నట్లు సమాచారం. దీనికిగాను సుమారు రూ.50 లక్షల వరకు కేటాయించారు.

# అమ్మేవారున్నా.. కొనేవారు కరవు



హిందూపురం : ప్రభుత్వానికి ఆదాయం అందించే సబ్‌రిజి స్ట్రార్ కార్యాలయాల్లో ఆదాయం నేలచూపు చూస్తోంది. ఆరు మాసాలు గా జిల్లాలోని 9 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏ ఒక్కచోటా కేటాయిం చిన లక్ష్యాన్ని అధిగమించలేదు. హిందూపురం తదితర ప్రాంతాల్లో గతంలో కొన్న ఇంటి స్థలాలను ప్రస్తుతం విక్రయిస్తామన్నా కొనుగోలుదా రులు ముందుకు రావటం లేదు. కేవలం ఈ ఒక్క ప్రాంతమే కాదు జిల్లాల్లో ఒకటి రెండు ప్రాంతాలు మినహా మిగిలిన అన్నిచోట్ల ఇదే పరిస్థితి ఉంది. హిందూపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో గడచిన రోజుల్లో రోజూ వందకుపైగా రిజిస్ట్రేషన్లు జరిగేవి. ప్రస్తుతం 30లోపే అవుతున్నాయి. వీటిలో మార్టిగేజ్, రసీదులు, దానవిక్రయాలే అధికంగా కొనసాగటం గమనార్హం. ఒక్క హిందూపురం నుంచి ప్రభుత్వానికి ప్రతి నెలా రూ.300 కోట్ల ఆదాయం రావాలి. గడచిన ఐదు మాసాలు పరిశీలిస్తే రూ.50 కోట్లకు మించి రాలేదు. జిల్లాలో ప్రథమ శ్రేణిలో ఉన్న హిందూపురం, కదిరి, ధర్మవరం ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొని ఉంటే చివరిశ్రేణిలో ఉన్న కార్యాలయాల పరిస్థితి దయనీయంగా మారింది. ఆదాయం తగ్గుదలపై ప్రతి రోజూ ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడులు పెరిగిపోతుండటంతో సబ్‌రిజిస్ట్రార్లు తలబాదుకొంటున్నారు.

**ఈ–స్టాంపుల సమస్య వేధిస్తున్నా..**

దాదాపు రెండు నెలలుగా ఈ–స్టాంపుల సమస్యతో ప్రజలు సతమతవు తున్నారు. జిల్లాలో ఒకటి రెండు ప్రాంతాల్లో మినహా మిగిలిన చోట్ల అందుబాటులో లేక ఒక్కొక్క స్టాంపునకు రూ.300 నుంచి రూ.400 అదనంగా చెల్లిస్తున్నారు. ప్రస్తుతం హిందూపురం వాసులు కదిరి ప్రాంతం నుంచి తెప్పించుకొంటున్నారు. గత ప్రభుత్వం ఈ స్టాంపింగ్ విధానాన్ని ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించింది. వీరు ప్రింటింగ్ ప్రెస్‌కు సక్రమంగా డబ్బు చెల్లించక బకాయిలు రూ.కోట్లకు చేరుకోవటంతో వారు ప్రిటింగ్ నిలిపివేశారు. దీంతో కొరత ఏర్పడింది.

**భూముల రిజిస్ట్రేషన్లు తగ్గాయి: భాగ్యశేఖర్‌రెడ్డి, సబ్‌రిజిస్ట్రార్, హిందూపురం** దాదాపు సంవత్సర కాలం నుంచి భూముల క్రయవిక్ర యాలు తగ్గడంతో రిజిస్ట్రేషన్లు జరగటం లేదు. దీనివలన ప్రభుత్వానికి రావాల్సిన స్టాంప్‌డ్యూటీ రావటం లేదు. ప్రభుత్వానికి ఆదాయం పెరగాలంటే భూముల రిజిస్ట్రేషన్లు పుంజుకోవాలి.

# గోడలే.. డిజిటల్ గ్రంథాలయాలు



ధర్మవరం : నిరుద్యోగ యువతకు అండగా ఉంటాం. వారికి అన్ని విధాలుగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం... పోటీ పరీక్షలకు స్థానికంగా సన్నద్ధమయ్యేందుకు ప్రతి పంచాయతీలో డిజిటల్ గ్రంథాయాలను నిర్మిస్తాం.. అంటూ అప్పటి వైకాపా పాలకులు హామీలతో ఊదరగొట్టారు. ఐదేళ్ల జగన్ పాలనలో గోడలకే పరిమితం చేశారు. దీంతో నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం జరిగింది. పనులు చేపట్టిన గుత్తేదారులకూ బిల్లులు మంజూరు కాలేదు. ఒక్కో గ్రంథాలయ నిర్మాణానికి రూ.16 లక్షలపైగా మంజూరు చేశారు.

**కంప్యూటర్లతోపాటు మౌలిక వసతులు**

డిజిటల్ గ్రంథాలయాల్లో వార్తాపత్రికలు, వివిధ రకాల మ్యాగ్‌జైన్లు, నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు, ఆన్‌లైన్ సేవలు అందుబాటులో తీసుకురావడానికి మూడు కంప్యూటర్లు ఉండాలని గత వైకాపా ప్రభుత్వం నిర్ణయించింది. కుర్చీలు, బల్లలతో పాటు ఇతర మౌలిక వసతులు కల్పించాలని పేర్కొన్నా కార్యరూపం దాల్చలేదు

**శ్రీసత్యసాయి జిల్లాలో ఇలా..**

మొత్తం మంజూరైనవి: 438

ఒక్కో గ్రంథాలయానికి వ్యయం అంచనా: రూ.16 లక్షల నుంచి రూ20 లక్షలు

పూర్తి అయినవి: 54

అసంపూర్తిగా ఉన్నవి: 384

**కూటమి ప్రభుత్వంపై ఆశలు**

పల్లెసీమల్లో డిజిటల్ గ్రంథాలయాలు నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలన్నది మంచిదే అయినా గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం ప్రదర్శించింది. ప్రచార ఆర్భాటమే తప్ప భవనాలను అందుబాటులోకి తీసుకురావడంలో అలసత్వం చూపింది. స్థానికంగానే ఉంటూ పోటీ పరీక్షలకు సిద్ధమవుదామనే యువత ఆశలు నీరుగారాయి. జిల్లా వ్యాప్తంగా డిజిటల్ గ్రంథాయాల నిర్మాణాలకు పచ్చజెండా ఊపినా తగినన్ని నిధులు మంజూరు చేయలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపైనే నిరుద్యోగ యువత ఆశ పెట్టుకుంది. జిల్లా వ్యాప్తంగా డిజిటల్ గ్రంథాలయ నిర్మాణాలను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని యువత, పాఠకులు కోరుతున్నారు.

**నివేదిక పంపించాం: మురళి, పంచాయతీరాజ్ ఎస్ఈ**

వివిధ దశల్లో ఆగిన డిజిటల్ గ్రంథాలయాల నిర్మాణాలను పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపించాం. ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రాగానే వాటిపై ఏమి చేయాలన్నది ఆలోచిస్తాం

# గూగూడు.. అసౌకర్యాల గూడు!



నార్పల : మరో రెండు వారాల్లో గూగూడు కుళ్లాయి స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇక్కడ కనీస సౌకర్యాలు లేకపోవడంతో భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. కుళ్లాయిస్వామికి రాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్ణాటక, తెలంగా ణా ప్రాంతాల్లో లక్షలాది మంది భక్తులున్నారు. గూగూడు కుళాయి స్వామి, ఆంజనేయస్వామి దేవాలయాలు పక్కపక్కనే ఉండటంలో క్షేత్రం మతసామరస్యానికి ప్రతీకగా నిలిచింది. హిందూ, ముస్లింలు కలసి మెలసి 11 రోజుల పాటు నిర్వహించే మోహరం బ్రహ్మోత్స వాలకు లక్షలాదిగా భక్తులు తరలివస్తారు.

**వీధులన్నీ కంపుమయం**

కాలవలు లేకపోవడంతో ఇళ్లలోని మురుగంతా రోడ్లపైకి చేరుతోంది. ఉత్సవాల వేళ పీర్ల ఊరేగింపునకు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి. వాహనాల పార్కింగ్ రుసుం అధికంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఈవో శోభను వివరణ కోరగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. సమస్యలపై ఉన్నతాధికారులతో చర్చించి తగు నిర్ణయాలు తీసుకుంటా మన్నారు.

**క్షేత్రంలో దయనీయ పరిస్థితులు**

కోనేరులో నీరు పాచిపట్టి దుర్వాసన వస్తోంది. ఉత్సవాల సమయం లో కనీసం స్నానం చేసేందుకు ఎలాంటి వసతులు లేకపోవడం గమనార్హం. భక్తులకు సరిపడా ప్రభుత్వ వసతి భవనాలు లేవు. ప్రైవేటు అద్దెగదుల్లో ఉండాల్సి వస్తోంది. నార్పల నుంచి గూగూడు కుళ్లాయిస్వామి ఆలయానికి వచ్చే ప్రధాన ఇరుకుగా ఉంది.

**శాశ్వత హుండీల నుంచి ఆదాయం**

బ్రహ్మోత్సవాలతో సంబంధం లేకుండా ఏడాది పొడవునా గూగూడు క్షేత్రానికి వచ్చే భక్తులు స్వామికి విలువైన కానుకలు సమర్పిస్తుంటారు. దీనికితోడు వివిధ రకాల సేవల కిందట ఏటా రూ.కోట్లలో ఆదాయం సమకూరుతోంది. తలనీలాలు విక్రయం, చెక్కర, బియ్యం, కొబ్బర విక్రయాలు, తాత్కాలిక, శాశ్వత హుండీల ద్వారా ఏటా రూ.కోటికి పైగా ఆదాయం ఉంది. ఏటా 100 కిలోల వెండి, 100 గ్రాముల బంగారం కానుకలు కుళ్లాయిస్వామి కి సమర్పిస్తుంటారు. దేవాదాయ శాఖ అధికారులు వచ్చిన ఆదాయానంతా బ్యాంకులో జమ చేయడం తప్ప అభివృద్ధికి, భక్తులకు సౌకర్యాల కల్పనకు పాటుపడటం లేదని భక్తులు విమర్శిస్తున్నారు.

# జోరుగా ఏరువాక

అనకాపల్లి : కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఖరీఫ్ పనులకు రైతులు శ్రీకారం చుట్టారు. వరి నారు పోసుకునేందుకు మడులను సిద్ధం చేస్తున్నారు. పొలాల్లో దుక్కులు వేస్తున్నారు. గంటి, నువ్వులు, పిల్లిపెసర, జీలుగ, ఉల్లి తదితర పంటల సాగుకు విత్తనాలు వేసే పనిలో నిమగ్నమయ్యారు. వర్షాధారంగా సాగు చేసే ప్రాంతాల్లో చెరకు విత్తనం నాటుతున్నారు. ఇప్పటికే నాట్లు వేసిన తోటల్లో కలుపు తీస్తున్నారు. జిల్లాలో ఏటా 1.87 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి. ఇందులో వరి 1.45 లక్షల ఎకరాలు కాగా, చెరకు 15,200 ఎకరాల్లో పండిస్తున్నారు. వీటితోపాటు ఉద్యాన పంటలైన మామిడి, జీడి మామిడి, కొబ్బరి, సపోటా, జామ, బొప్పాయి తోటల సాగుకు సన్నద్ధమవుతున్నారు.

విత్తనాలు, ఎరువుల కొరత తలెత్తకుండా వ్యవసాయ శాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో 1.45 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుండగా 40 శాతం మంది రైతులు విత్తనాలు కొనుగోలు చేస్తారు. మిగిలిన వారంతా సొంతంగా తయారు చేసుకున్న విత్తనాలు వినియోగిస్తారు. ఈ ఏడాది ఎక్కడా విత్తన కొరత రాకుండా చూడాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అధికారులును ఆదేశించింది. దీంతో జిల్లాలో 24,112 క్వింటాళ్ల విత్తనాలను అందుబాటులో ఉంచారు. వీటిలో వరి 23,109 క్వింటాళ్లు కాగా, అపరాలు 84, నువ్వులు 20,



చిరుధాన్యాలు 4, చోడి 2 క్వింటాళ్లు ఉన్నాయి. ఇప్పటికే పచ్చిరొట్ట విత్తనాలు 893 క్వింటాళ్లను 50 శాతం రాయితీపై విక్రయాలు ప్రారంభించారు. ఎరువులు 35,353 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు తెలిపారు.

**ఊపందుకున్న చెరకు నాట్లు**

జిల్లాలో వరి తర్వాత స్థానం చెరకుదే. ఏటా 15,200 ఎకరాల్లో సాగవుతోంది. నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో జనవరి, ఫిబ్రవరి నెలల్లో నాట్లు వేశారు. మిగతా ప్రాంతాల్లో వర్షధారంగా సాగు చేస్తుంటారు. వీరంతా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నాట్లు వేయడం ప్రారంభి ంచారు. గంటి, నువ్వ పంటలను ఆరు వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మునగపాక, సబ్బవరం, చోడవరం, బుచ్చెయ్యపేట ప్రాంతాల్లో గంటి సాగుకు నారు పోశారు.

# ఉచితం పేరుతో ఊడ్చేస్తున్నారు!

దేవరాపల్లి : ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం కల్పించిన వెసులుబాటును అవకాశంగా చేసుకుని కొందరు ఇసుక వ్యాపారం చేస్తున్నారు. ఉచితం పేరుతో నదులు, గెడ్డల్లో ఇసుకను ఊడ్చేస్తున్నారు. దేవరాపల్లి మండలంలో ఇసుక దందాకు శారదా నది అడ్డాగా మారింది. చింతలపూడి నుంచి బోయిలకింతాడ వరకు అడ్డూఅదుపు లేకుండా తవ్వకాలు, రవాణా జరుగుతోంది. నదిలో ఎంత లోతు తవ్వాలనే దానిపై ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలిచ్చినా ఎవరూ ఖాతరు చేయడం లేదు. తిమిరాం శివాలయానికి ఎదురుగా శారదా నది ప్రవహిస్తోంది. నదీ తీరంలో ప్రతి శుక్రవారం పశువుల సంత జరుగుతుంది. తిమిరాం నుంచి మామిడిపల్లి తదితర గ్రామాలకు వెళ్లే వారంతా నదిలో నీటి ప్రవాహం తగ్గినపుడు కాలినడకన అవతలి ఒడ్డుకు సురక్షితంగా చేరుకునే వారు. ఇష్టానుసారంగా ఇసుక తవ్వేస్తుండటంతో నదిలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. నదిని దాటే క్రమంలో ఓ యువకుడు గోతిలో మునిగి మృత్యువాత పడ్డాడు. ఇప్పుడా



ప్రాంతంలో 20 అడుగుల లోతున ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఏటా తీర్థం సమయంలో నదిలో ఎడ్ల పందేలు నిర్వహించే చోట, కార్తిక మాసంలో నదిలో మహిళలు స్నానాలు చేసేందుకు వెళ్లే దారిలోనూ, స్థానికులు దుస్తులు ఉతికే చోటా విచ్చలవిడిగా తవ్వకాలు సాగిస్తున్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించి ఇసుక తవ్వకాలను అడ్డుకోకుంటే నది సమీపంలోని పొలాల్లో పంటలకు ముప్పు వాటిల్లే ప్రమాదముంది. నదికి వరదొస్తే జిరాయితీ భూములన్నీ ముంపునకు గురవడంతోపాటు సిరి గంధం చెట్లన్నీ కొట్టుకుపోయే ప్రమాదముందని తిమిరాం గ్రామానికి చెందిన రైతు రెడ్డి సింహాద్రప్పడు పేర్కొన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలపై ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

## పంపా కోతకు అడ్డుకట్ట

పాయకరావుపేట : ముసురేసినా, సంద్రం పోటెత్తినా పేట మండలం లోని వెంకటనగరం గ్రామస్థులకు కంటి మీద కునుకుండదు. ఒక వైపు పంపా నది, మరోవైపు సముద్రం ఉండటమే ఇందుక్కారణం. నదికి నీరొస్తే చాలు ఎక్కడ ఇళ్లు ముంపునకు గురవుతాయోనన్న ఆందోళన నెలకొంటుంది. దశాబ్దాల వేదనకు, ఆందోళనకు ఎట్టకేలకు తెరపడనుంది. కాకినాడ జిల్లా అన్నవరం నుంచి పంపా నది పేట మండలంలోని వెంకటనగ రం వద్ద సముద్రంలో కలుస్తోంది. వర్షాల సమయంలో నదిలోకి భారీగా వరద నీరు చేరుతుంది. ఈ సమయంలో నదిని ఆనుకుని ఉన్న వెంకటనగరం కోతకు గురవుతోంది. పక్కనే ఉన్న ఇళ్లు, జీడి, సరుగుడు తోటలు కోతకు గురై నదిలో కలిసిపోతున్నాయి. తుపాను సమయాల్లో సముద్రంలో అలల ఉధృతికి నీరంతా పంపా నదిలోకి చేరుతుంది. ఈ సమయంలోనూ స్థానికుల్లో గుబులు మొదలవుతుంది. ఇప్పటికే కొన్ని ఇళ్లు కోత కారణంగా నదిలోకి కొట్టుకుపోయాయి. కొన్నేళ్ల నుంచి ఈ సమస్య ఉంది. ముంపు బారి నుంచి గట్టెక్కించేందుకు పంచాయతీ నుంచి రూ.6 లక్షలు, మండల పరిషత్తు నుంచి రూ.4 లక్షలు కేటాయించారు. సుమారు 120 మీటర్ల పొడవైన రక్షణ గోడ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

**ఎట్టకేలకు పరిష్కారం..వంకా రమణ, సర్పంచి**

నాలుగు దశాబ్దాలుగా ఇబ్బంది పడుతున్నాం. రక్షణ గోడ నిర్మాణంతో సమస్యకు పరిష్కారం లభించినట్లే. ముంపు బెడద తగ్గుతుంది. గోడ నిర్మాణంతో నది ప్రవాహ దిశ మారుతుంది.

# లక్ష్యం 'కుంటు'తోంది

కొయ్యలగూడెం మండలం సరిపల్లి పంచాయతీ పరిధిలో పంట కుంట తవ్వకం పనుల్లో రాళ్లు వస్తుండటంతో ఉపాధి శ్రామికులు చెమటోడ్చక తప్పడం లేదు. దీంతో పనులు మందగించాయి. భూగర్భ జల నిల్వల పెంపే లక్ష్యంగా చేపట్టిన పంట సంజీవని పథకం పనులు జిల్లాలో మందకొడిగా సాగుతున్నాయి. కుంట తవ్వకం కోసం సుమారు ఐదు సెంట్ల భూమి కేటాయించాల్సి రావడంతో సన్న, చిన్నకారు రైతులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. వారిని ఒప్పించేందుకు ఉపాధి హామీ యంత్రాంగం నానా తంటాలు పడాల్సి వస్తోంది. వర్షాలు పడకముందే కుంటల తవ్వకం పూర్తయ్యేలా రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

**125 పనిదినాలు..** ఒక్కో కుంట నిర్మాణానికి 125 పనిదినాలు కేటాయించారు. కనీసం పది మంది వరకు పని చేయడానికి అవకాశం ఉంది. మొత్తంగా రూ.35వేల వరకు ఖర్చవుతుంది. అది ఉపాధి వేతనాల రూపంలో జమవుతుంది. కానీ మెట్ట మండలాల్లో పలుచోట్ల



కుంటలు తవ్వుతుంటే రాళ్లు, బండలు తగులుతున్నాయని, తవ్వకం కష్టంగా ఉందని శ్రామికులు అంటున్నారు. దీంతో ఆయా చోట్ల పనులు మందగిస్తున్నాయి.

**తర్వాత చూద్దామంటూ..** కొయ్యలగూడెం మండలం చొప్పరామన్నగూడెంలో అర్హులైన రైతులు ఉన్నప్పటికీ పంట కుంట తవ్వకం కోసం ఒక్కరు కూడా ముందుకురాలేదని సిబ్బంది చెబుతున్నారు. కొన్ని రోజులుగా వారిని ఒప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. రబీ మొక్కజొన్న, పొగాకు తోటలు సాగులో ఉండటంతో భూములు ఖాళీగా లేవని, పంటలు పూర్తయిన తర్వాత చూద్దామంటూ మరికొందరు రైతులు దాటవేస్తున్నారని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అవగాహన కల్పిస్తాం..** 'పంట కుంటలు తవ్వుకుంటే కలిగే మేలుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాము. రబీ సాగు పూర్తయ్యే దశలో ఉందని, రానున్న రోజుల్లో లక్ష్యాన్ని పూర్తి చేస్తాము' అని డ్వామా పథక సంచాలకుడు కేవీ సుబ్బారావు తెలిపారు.

# నిధులు నిలిచి.. నిర్లక్ష్యం మొలిచి..

పొదిలి : గత ప్రభుత్వ నిర్వాకంతో జిల్లావ్యాప్తంగా అభివృద్ధి పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. నిర్మాణాలు సగం వరకూ అయిన తర్వాత పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితి దాపురించింది. దీంతో మహిళా శక్తి నీరుగారిపోతోంది. పొదిలిలో స్వయం సహాయక సంఘాల భవనం, సీడీపీవో భవన నిర్మాణాలకు గత ప్రభుత్వం పూర్తిస్థాయి నిధులు మంజూరు చేయకపోవడంతో భవనాలు మధ్యలోనే ఆగిపోయాయి. మండల స్వయం సంఘాల సమాఖ్య భవనాన్ని సుమారు రూ.60 లక్షలతో ప్రారంభించారు. 2019లో పనులు ప్రారంభమైనా నిధులు పూర్తిస్థాయిలో విడుదల చేయకపోవడంతో



గుత్తేదారులు పనులు ఆపేశారు. ఇక్కడి స్వయం సహాయక సంఘాల్లో 11,100 మంది సభ్యులున్నారు. వారంతా అద్దె భవనంలో అవస్థల మధ్య ఎస్‌హెచ్‌జీ సభ్యుల సమావేశాల్లో పాల్గొంటున్నారు. పొదిలిలో స్త్రీ శిశు సంక్షేమశాఖ భవనం పనులను 2019లో రూ.32 లక్షలతో ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ప్రారంభించారు. స్లాబు వరకు నిర్మాణం జరిగింది. కొత్త ప్రభుత్వం పనులను పూర్తి చేయాలని స్వయం సహాయక సంఘాల మహిళలు కోరుతున్నారు.

# వాగును మింగిన అనకొండలు

మార్కాపురం : వైకాపా హయాంలో మార్కాపురం కేంద్రంగా భూ బకాసురులు రెచ్చిపోయారు. వాగులు.. వంకలు.. చెరువులు.. కుంటలు.. ప్రభుత్వ భూములను ఆక్రమించుకునేవారు. తమ బినామీల పేర్లతో దస్త్రాల్లోకి ఎక్కించుకుని విక్రయించేవారు. అవే పరిస్థితులు మళ్లీ ఇప్పుడు కొన్ని చోట్ల కనిపిస్తున్నాయి. జాతీయ రహదారుల పక్కన, పట్టణంలోని విలువైన భూములపై అక్రమార్కులు పాగా వేసి చెరబట్టే ప్రయత్నం చేస్తున్నారు.

**రూ.5 కోట్ల స్థలం హాంఫట్!**

మార్కాపురం మండలం దరిమడుగు సమీపంలోని జాతీయ రహదారికి పక్కన సర్వే నంబరు 773-1బిలో 23.58 ఎకరాలు, సర్వే నంబరు 773-1బి3లో 8.31 ఎకరాలు, సర్వే నంబరు 773-1బి2లో 1.55 ఎకరాల వాగు పోరంబోకు భూమి ఉంది. జాతీయ రహదారి పక్కన ఉండటంతో ఇక్కడ ఎకరా స్థలం రూ. కోటి వరకు పలుకుతోంది.



దీంతో ఇటీవల కొందరు అక్రమార్కులు వాగు పోరంబోకు స్థలంపై కన్నేశారు. సుమారు అయిదు ఎకరాల వరకు ఆక్రమించారు. చుట్టూ రాళ్లు పాతి కంచెలు ఏర్పాటు చేశారు.

**జంకుతున్న అధికారులు** ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన అధికారులు ఆ దిశగా పూర్తిస్థాయిలో దృష్టిసారించడం లేదు. విమర్శలు వచ్చినప్పుడు.. పత్రికల్లో కథనాలు ప్రచురితమైనప్పుడు హడావుడి చేస్తున్నారు. స్థలాలను పరిశీలిస్తున్నారు. ఆ తర్వాత వాటిని స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు చేయకుండా మిన్నకుండిపోతున్నారు. విలువైన ప్రభుత్వ భూమికి కంచె ఏర్పాటు చేసినా తొలగించే ప్రయత్నం చేయకున్నారు. కనీసం నోటీసులు ఇచ్చే సాహసం కూడా చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాగే చూస్తూ పోతే పశ్చిమ ప్రకాశంలోని కీలక పట్టణమైన మార్కాపురం, సమీప ప్రాంతాల్లో ప్రభుత్వ భూములే కనిపించకుండా పోయే ప్రమాదం ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# రొయ్య.. ఎంత మేపినా ఎదగదేమయ్యా!



టంగుటూరు : డాలర్ పంటగా పేరొందిన ఆక్వాను వరుసగా సమస్యలు చుట్టుముడుతున్నాయి. తొలుత రొయ్యకు వైరస్‌ల దాడి పెరిగింది. ఆ తర్వాత అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల పెంపుతో ఎగుమతులపై నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రభుత్వం కలుగజేసుకోవడంతో సాగుదారులు కాస్త ఊపిరి పీల్చుకుంటున్నారు. ఈ తరుణంలో.. తాజాగా మరో కొత్త చిక్కొచ్చి పడింది. ఎంత మేత తిన్నా.. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా టైగర్ రొయ్య ఆశించినంతగా ఎదగడం లేదు.ఇప్పటికే వనామీని వదిలేశారు: జిల్లాలో తీర ప్రాంత మండలాలైన టంగుటూరు, కొత్తపట్నం, సింగరాయకొండ, ఒంగోలు, మద్దిపాడుల్లో గత ముప్ఫై ఏళ్లుగా రైతులు ఆక్వా సాగు చేస్తున్నారు. సముద్ర తీరం వెంట, ఇతర పట్టా భూములతో కలిపి జిల్లాలో వ్యాప్తంగా మొత్తం 2,910 హెక్టార్లలో రొయ్యను పండిస్తున్నారు. గత అయిదేళ్లుగా వైరస్‌ల బెడద అధికం కావడం, ధరలు ఆశాజనకంగా లేకపోవడం, వాతావరణం అనుకూలించకపోవడం వంటి కారణాలతో వనామీ రకాన్ని చాలా వరకు రైతులు ఇప్పటికే వదిలేశారు.

సగానికి సగం పడిపోయిన బరువు: ఈ ఏడాది ఆక్వా సాగుకు వాతావరణం సానుకూలంగా ఉండటం.. టైగర్‌కు మంచి ధరలు లభిస్తుండటంతో ఎక్కువ మంది ఆ రకాన్నే సాగు చేస్తున్నారు. ప్రస్తుతం చెరువుల్లో 40 నుంచి 60 రోజుల పంట కొనసాగుతోంది. సాధారణంగా 60 రోజుల రొయ్య 10 నుంచి 12 గ్రాముల బరువు తూగాలి. కానీ చెరువుల్లో ఆ పరిస్థితి లేదు. కేవలం 5 నుంచి 6 గ్రాములు మాత్రమే తూగుతోంది. దీంతో దిగుబడి సగానికి పైగా పడిపోతోంది. కంపెనీ మేతనే నిత్యం అందిస్తున్నామని, అయినా రొయ్య బరువు పెరగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**తాజా పరిస్థితులతో రైతుల ఆందోళన:** జిల్లాలో ఆక్వా సాగు ఏళ్ల తరబడిగా ఉన్నప్పటికీ.. రొయ్య పిల్లల ఉత్పత్తి కేంద్రం ఒక్కటీ లేదు. పుదుచ్చేరి, నెల్లూరు వంటి ప్రాంతాలకు వెళ్లి సీడ్ తెచ్చుకోవాల్సిన పరిస్థితి. ఎకరాకు ప్రస్తుతం టైగర్ రకం పిల్లలను 50 వేల నుంచి లక్ష వరకు వేస్తున్నారు. గత ఏడాది ఓ కంపెనీకి చెందిన సీడ్ కారణంగా ఎదుగుదల లోపంతో సాగుదారులు తీవ్రంగా నష్టపోయారు. తాజా పరిస్థితులతో మళ్లీ ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై జిల్లా మత్స్యశాఖ అధికారి సీహెచ్.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఆక్వా సాగులో సమస్యలను రైతులు తమ దృష్టికి తీసుకురాలేదని అన్నారు. ఇటీవల టంగుటూరు మండలం వెలగపూడిలో చెరువులను పరిశీలించామని చెప్పారు. సమస్యను దృష్టికి తెస్తే పరిష్కార మార్గం చూపుతామని తెలిపారు.

# నియోజకవర్గానికో పారిశ్రామిక పార్కు



ఒంగోలు: పరిశ్రమలు ఏర్పాటైతే ఉద్యోగాలొస్తాయి. పరిసర ప్రాంతాల్లో చిన్నాచితకా వ్యాపారాలు పెరిగి అనేక జీవితాలు బాగుపడతాయి. పన్నుల రాబడి అధికమై రాష్ట్రానికి ఆదాయం వస్తుంది. తద్వారా అభివృద్ధి వేగవంతమవుతుంది. అందుకే కూటమి ప్రభుత్వం పెట్టుబడులు పెట్టేందుకు అనువైన పరిస్థితులకు పెద్దపీట వేస్తోంది. పరిశ్రమల స్థాపనకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తోంది. అందులో భాగంగా నియోజకవర్గానికో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు జిల్లాలో అడుగులు పడేలా చేస్తోంది. మార్కాపురం, కనిగిరిలో ఆయా శాసన సభ్యులతో పాటు ఏపీఐఐసీ అధికారులు ఇప్పటికే శంకుస్థాపన చేశారు. దర్శి నియోజకవర్గంలోని చందులూరులో పార్కును ప్రారంభించారు. మిగిలిన చోట్లా భూమిని గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.

**400 ప్లాట్లు.. 4,000 మందికి బతుకుదెరువు:** జిల్లాలో నానో, ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు భూమిని గుర్తించాలని ఏపీఐఐసీ ఉన్నతాధికారులు కలెక్టర్ తమీమ్ అన్సారియాను కోరారు. ఆ మేరకు కనిగిరి, ఒంగోలు ఆర్డీవోలు, మార్కాపురం సబ్ కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలను కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి అందజేశారు. భూ సేకరణ అనంతరం ఏపీఐఐసీకి అప్పగించనున్నారు. తర్వాత ప్లగ్ అండ్ ప్లే విధానంలో కావాల్సిన షెడ్లతోపాటు రోడ్లు, డ్రైన్లు, నీరు, విద్యుత్తు వంటి మౌలిక వసతులు కల్పించి నేరుగా పరిశ్రమలు స్థాపించుకునేలా ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేస్తారు. 'అన్ని నియోజకవర్గాల్లో కలిపి నాలుగు వందల పరిశ్రమలు స్థాపించేలా ప్లాట్లను అభివృద్ధి చేస్తున్నామని, ప్రత్యక్షంగా, పరోక్షంగా నాలుగు వేల మందికి ఉపాధి దొరికే అవకాశం ఉంద'ని ఏపీఐఐసీ అధికారులు చెబుతున్నారు.

**ఏర్పాటు దిశగా ప్రగతి ఇలా..**

మార్కాపురం: తర్లుపాడు మండలం కలుజువ్వలపాడులో ఏపీఐఐసీకి అప్పగించిన భూమిలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి బుధవారం భూమి పూజ, శంకుస్థాపన చేశారు.

ఒంగోలు: కొత్తపట్నం మండలం అల్లూరులో 60.75 ఎకరాల ప్రభుత్వ అసైన్డ్ భూమిని గుర్తించారు. 5.01 ఎకరాలను విద్యుత్తు ఉపకేంద్రం కోసం ఏపీ ట్రాన్స్‌కోకు ఇచ్చారు. మిగిలిన భూమిలో పార్కు ఏర్పాటుకు ప్రతిపాదించారు.

కొండపి: మర్రిపూడి మండలం కాకర్లలో ప్రభుత్వ భూమిని గుర్తించి ప్రతిపాదనలు పంపారు.

దర్శి: చందలూరులో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌కు అప్పగించిన ప్రభుత్వ పోరంబోకు భూమిలో ఎంఎస్ఎంఈ పార్కులో మౌలిక వసతులు కల్పించారు.

కనిగిరి: పీసీపల్లి మండలం పెద్దఈర్లపాడులోని 20 ఎకరాల్లో పార్కు ఏర్పాటుచేశారు. ఇందులో రూ.ఏడు కోట్లతో రహదారులు, విద్యుత్తు, మురుగు కాలువలు, కల్వర్టులు నిర్మిస్తారు.

గిద్దలూరు: సంజీవరావుపేటలో ప్రభుత్వ భూమిని కేటాయించారు.

యర్రగొండపాలెం: గంగాపాలెంలోని ఎఫ్ఎల్ఆర్, హిల్ పోరంబోకు భూమిని గుర్తించారు.

సంతనూతలపాడు: నాగులుప్పలపాడు మండలంలో అవసరమైన భూమిని గుర్తించాలని కలెక్టర్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.

# ఆసరాకు అవాంతరాలు!

పెద్దదోర్నాల : ఆపన్నులకు సేవలందిస్తున్న ఆర్డీటీ ట్రస్టుకు కొత్త కష్టాలొచ్చాయి. విదేశీ నిధులు నిలిచిపోవడంతో నిరుపేదలు, దివ్యాంగులకు సాయం అందని పరిస్థితి నెలకొంది. దీంతో ఇరు రాష్ట్రాల్లో ఉన్న విధి వంచితులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

దోర్నాల కేంద్రంగా ప్రకాశం, నంద్యాల, పల్నాడు జిల్లాలతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లోని చెంచు గిరిజనులు, దివ్యాంగులకు రూరల్ డవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) అందిస్తున్న సేవలకు గ్రహణం పట్టింది. సంస్థకు విదేశాల నుంచి వచ్చే నిధుల వినియోగానికి సంబంధించిన అనుమతులను ఎఫ్‌సీఆర్ఏ (ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్టు) కింద నిలిపివేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. దీంతో ఆ సంస్థ ఎఫ్‌సీ (ఫారిన్ కాంట్రిబ్యూషన్) ఖాతాల్లో ఉన్న నిధులను వినియోగించడానికి వీల్లేకుండాపోయింది. కేవలం ఎల్‌సీ (లోకల్ కాంట్రిబ్యూషన్) ఖాతాలో ఉన్న నిధులనే వాడుకునే అవకాశముంది. దీంతో ఆ సంస్థ చేపడుతున్న విద్య, వైద్యం, గృహ నిర్మాణం, స్వయం ఉపాధి వంటి కార్యక్రమాలు నిలిచిపోయే ప్రమాదం ఏర్పడింది.

**దిక్కుతోచని దివ్యాంగులు**

దోర్నాల మండలంలోని చిన్నగుడిపాడు సమీపంలోని ఆ సంస్థ ఉప కార్యాలయం ఆవరణలో నిర్వహిస్తున్న బుద్ధిమాంద్యం పిల్లల పునరావాస కేంద్రం, దివ్యాంగులకు అవసరమైన కృతిమ అవయవాల తయారీ కేంద్రం నిర్వహణపై నీలి నీడలు కమ్ముకున్నాయి. అలాగే పేద పిల్లల కోసం నిర్మాణంలో ఉన్న పాఠశాల, వివిధ ప్రాంతాల్లోని పక్కా గృహాలపై ఆ ప్రభావం పడనుండటంతో లబ్ధిదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. లక్షల మంది మహిళలకు రుణాలిచ్చి ఆర్థిక స్వావలంబనకు ప్రయత్నించిన ఈ సంస్థలో 3,500 మందికి పైగా సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఇరు రాష్ట్రాల్లోని నల్లమల అటవీ ప్రాంతంలోని గిరిజన గూడేల్లోని చెంచు గిరిజనుల అభివృద్ధికి బాటలు వేసేందుకు 2010 దోర్నాల కేంద్రంగా ఆ సంస్థ ఉప




కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. పక్కాగృహాల నిర్మాణం, వ్యాధిగ్రస్తులను గుర్తించి వైద్య సేవలు అందించడం, మహిళల ఆర్థికాభివృద్ధికి స్వయం సహాయక సంఘాలు ఏర్పాటుచేసి రుణాలు అందించడం తదితర సేవలందించింది. చిన్నగుడిపాడు సమీపంలో బుద్ధిమాంద్యం చిన్నారులకు పునరావాస కేంద్రం ఏర్పాటుచేసి వారికి సేవలందిస్తోంది.

**రెన్యువల్ చేయకపోవడంతో**

ఆర్డీటీకి స్పెయిన్, అమెరికా తదితర దేశాల నుంచి విరాళాలు వస్తున్నాయి. ఏటా రూ.280 కోట్లకు పైగా నిధులను స్వచ్ఛంద సేవలకు వినియోగించేవారు. కేంద్ర ప్రభుత్వం 2021లో ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్‌ను పునరుద్ధరించకుండా గడువు పెంచుకుంటూ వచ్చింది. ఆ సంస్థపై కొన్ని అభియోగాలు మోపుతూ 2023 నుంచి విదేశీ విరాళాలను పూర్తిగా నిలిపివేసింది. ఇప్పటి వరకు ఖాతాలో ఉన్న నిధులతో సేవలు కొనసాగిస్తూ వచ్చారు. పేదలకు నిస్వార్థంగా సేవలందిస్తున్న సంస్థకు నిధులు నిలిపివేయడమేమిటని చెంచు గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని నిధులు అందేలా కృషి చేయాలని వారు కోరుతున్నారు.

# నిధి వెక్కిరింత.. విస్తరణ తీరని చింత

బనగానపల్లి : కుందూ నది విస్తరణ పనుల పేరుతో గత వైకాపా ప్రభుత్వం హడావుడి చేసింది. పెద్దఎత్తున నిధులు కేటాయించినట్లు గొప్పలు చెప్పింది. అధికారులు టెండర్లు పిలిచి గుత్తేదారులకు అప్పగించారు. కొంతమేర పనులు చేపట్టినా బిల్లులు మంజూరు చేయలేదు. దీనికితోడు భూసేకరణ పనులు ముందుకు సాగలేదు. ఫలితంగా ఎక్కడికక్కడ పనులు ఆగిపోయాయి.

బనగానపల్లి మండల పరిధిలోని టంగుటూరు గ్రామం నుంచి వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు సమీపంలోని పెన్నా నది వరకు 187 కి.మీ. మేర కుందూ నది విస్తరణ పనులు చేపట్టాల్సి ఉంది. నదికి సంబంధించి రెండు వైపులా కలిపి 130 మీటర్ల మేర విస్తరించి 35 వేల క్యూసెక్కుల నీరు వైఎస్సార్ జిల్లాలో ప్రవహించే పెన్నా నదిలో పంపేలా అప్పట్లో అధికారులు ప్రణాళికలు రూపొందించారు. దీనికిగాను గత ప్రభుత్వం రూ.1,758 కోట్లు కేటాయించింది. 2021, మార్చి 31న పనులకు శ్రీకారం చుట్టారు.

ప్రస్తుతం 18 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో ప్రవహించే కుందూ



నదిని 35 వేల క్యూసెక్కులకు పెంచేలా పనులు చేపట్టారు. ఈ నిధులతోనే కోవెలకుంట్ల సమీపంలోని జొలదరాశి వద్ద 0.80 టీఎంసీ నీటిని నిల్వ చేసేలా ఒక ప్రాజెక్టు, చాగలమర్రి సమీపంలోని రాజోలి వద్ద 3 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో మరో ప్రాజెక్టు నిర్మించాల్సి ఉంది. ఈ ప్రాజెక్టులు దాటి మిగులు జలాలను పెన్నా నదిలోకి తీసుకెళ్తారు. ఏటా వర్షానికి కుందూలో నీరు ఉద్ధృతంగా ప్రవహించి సమీపంలోని పొలాలను ముంచెత్తుతోంది. విస్తరణ పనులు పూర్తి చేస్తే రైతులకు ఎలాంటి నష్టం జరగదు. నీరు సాఫీగా ప్రవహిస్తుంది.

**భూసేకరణ చేయకనే..**

2019 డిసెంబరులో జొలదరాశి జలాశయం, కుందూ నది విస్తరణ పనులకు వైఎస్సార్ జిల్లా దువ్వూరు మండలం నెలటూరులో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించి సుమారు 8 వేల ఎకరాల వరకు భూసేకరణ చేయాల్సి ఉంది. కానీ ఆ ఊసే లేకుండా పనులు ప్రారంభించేశారు. కుందూ ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూముల్లో మాత్రమే పనులు చేశారు. దీనికితోడు చేసిన పనులకు బిల్లులు మంజూరుకాకపోవడంతో గుత్తేదారులు చేతులెత్తేశారు. ఈ విషయమై ఈఈ సురేశ్‌బాబు మాట్లాడుతూ అప్పటి ప్రభుత్వ ఆదేశాలమేరకు పనులు ప్రారంభించామని చెప్పారు. మొదట్లో చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో గుత్తేదారులు పనులు ఆపేశారని చెప్పారు. ఇప్పటివరకు రూ.100 కోట్ల విలువైన పనులు మాత్రమే చేశారని వివరించారు. తాజా పరిస్థితిని కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

**ఏటా పంట నష్టమే – శేఖర్, పొట్టిపాడు**

గ్రామంలో కుందూ ఒడ్డున ఆరెకరాల పొలం ఉంది. ఏటా భారీ వర్షాలకు కుందూలో వరద ప్రవాహం పెరిగి పొలాలు మునిగిపోతున్నాయి. వరి పంటకు ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు నష్టం వస్తోంది. కూటమి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని విస్తరణ పనులు పూర్తి చేస్తే మా కష్టాలు తీరుతాయి.

# ఖరీఫ్‌కు ఢోకా లేదు

బొబ్బిలి: ఇటీవల కురిసిన వర్షాలకు జలాశయాల్లో నీటి మట్టాలు పెరిగాయి. గతేడాది మేతో పోల్చితే వట్టిగెడ్డ మినహా మిగిలిన చోట్ల స్వల్పంగా పెరిగాయి. దీంతో ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగునీటికి ఢోకా లేదని ఇంజినీర్లు చెబుతున్నారు. జూన్ నుంచి వర్షాలు ప్రారంభమైతే పూర్తిస్థాయి నీటి మట్టాలు చేరి, పూర్తి ఆయకట్టుకు నీరందే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. ఎన్నడూ లేనివిధంగా మే నెలలో కురిసిన వర్షాలతో నీరు చేరిందని ఈఈ అప్పలనాయుడుతో అన్నారు.

**తాగునీటి గండం గట్టెక్కినట్లే!**

జలాశయాల్లో నీటి మట్టాలు పెరగడంతో తాగునీటి కష్టాలు కూడా



దాదాపు గట్టెక్కినట్లే. వేగావతి నదిపై సాలూరు, బొబ్బిలి పురపాలక సంఘాల తాగునీటి పథకాలు ఉన్నాయి. వీటితోపాటు మరో 110 గ్రామాల ప్రజల దాహార్తి తీర్చే పథకాలున్నాయి. గతేడాది వేగావతిలో నీరు ఇంకిపోవడంతో పైన పెద్దగెడ్డ జలాశయం గేట్లు ఎత్తితే నదిలోకి నీరు వచ్చింది. దీంతో తాగునీటి ఇబ్బందులు తప్పాయి. ఈ ఏడాది ఆ పరిస్థితులు తలెత్తే అవకాశాలు లేవంటున్నారు. అలాగే సువర్ణముఖి నదిలో మరో 80 గ్రామాలకు చెందిన పథకాలు ఉన్నాయి. నాగావళి నదిలో పార్వతీపురం పట్టణ తాగునీటి పథకాలతోపాటు సుమారు 100 గ్రామాలకు చెందిన పథకాలు ఉన్నాయి. రిజర్వాయర్లలో నీరు చేరడంతో ఇబ్బందులు లేనట్లేనని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు అంటున్నారు.

# జీవాల దాహార్తి.. తొట్టెలతో స్వస్తి

పుంగనూరు : కూటమి ప్రభుత్వం నీటితొట్టెల నిర్మాణానికి చర్యలు చేపట్టింది.ఉపాధిహామీ పథకం కింద ఏప్రిల్ మొదటి వారంలో తొట్టెల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలో ఉద్యాన పంటల సాగు అధికం. ముఖ్యంగా టమాటా, మామిడి, ఇతర కూరగాయ పంటలు సాగు చేస్తున్నారు. వీటికి అనుబంధంగా పాడి పరిశ్రమ ఉంటుంది. ఆవులు, గెదేలు పెంచి పాలు విక్రయిస్తుంటారు. అయితే ప్రస్తుతం టమాటా ధరలు పతనం కావడంతో రైతులు పాడిపైనే ఆధారపడుతున్నారు. నిత్యం పాల నుంచే ఆదాయాన్ని జీవనానికి వినియోగిస్తున్నారు.ఒక్కో తొట్టె నిర్మాణానికి రూ.33 వేలతో పనులు ప్రారంభించారు. జిల్లాలోని 700 పంచాయతీలకు 1,751 నీటి తొట్టెలు మంజూరయ్యాయి. 5 మీటర్ల పొడవు, 2 మీటర్ల వెడల్పు, 2 అడుగుల లోతుతో నిర్మిస్తారు. ఇప్పటి వరకు అధికారులు 579 పూర్తి చేశారు. మిగిలిన 1,172 వివిధ దశల్లో ఉన్నాయి.

## వడివడిగా పంట కుంటలు

నక్కపల్లి: జల సంరక్షణతోపాటు పంటల సాగుకు ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పంట కుంటల తవ్వకాలు వడివడిగా సాగుతున్నాయి. జిల్లాలో కేటాయించిన లక్ష్యంలో ఇప్పటికే సగానికిపైగా పూర్తి కాగా.. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. 24 మండలాల పరిధిలో 7200 తవ్వాలని ఆదేశాలొచ్చాయి. ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బంది రైతులతో మాట్లాడి పంటల కుంటల ముఖ్య ఉద్దేశం వివరించి వారిని ఒప్పించారు. సగటున ఒక్కో పంచాయతీలో పది కుంటలకు పైగా తవ్వుతున్నారు. సుమారు సెంటున్నర స్థలంలో 9 మీటర్ల పొడవు, వెడల్పు, 2 మీటర్ల లోతు ఉండేలా పంట కుంట తవ్వకం వల్ల కోల్పోతున్న భూమి ద్వారా సాగును భర్తీ చేసేందుకు గట్టు వెంబడి



కాయగూరలతోపాటు పండ్ల మొక్కలను పెంచేలా ప్రోత్సాహం అందిస్తున్నారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో 3600 తవ్వగా, ప్రస్తుతం 1,500 చోట్ల పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే తవ్విన కుంటల్లో ఇటీవల కురిసిన వర్షాలకు నీరు చేరింది. ప్రస్తుతం నిర్దేశించిన లక్ష్యంలో నర్సీపట్నం, చోడవరం, దేవరాపల్లి, మాడుగుల, అనకాపల్లి నియోజకవర్గాల పరిధిలో ఎక్కువ కేటాయించారు.

**ఉచితంగా విత్తనాలు, మొక్కలు–** యరకయ్య, డ్వామా ఏపీడీ

పంట కుంటల తవ్వకాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. రెండు నెలల్లో పూర్తి చేయిస్తాం. గట్ల వెంబడి కూరగాయలు, పండ్ల మొక్కలు పెంపకం చేపడితే ఉచితంగా విత్తనాలు, మొక్కలను వెలుగు, ఉపాధి ద్వారా అందిస్తాం.

## నిబంధనలకు పొగ'బట్టీ'

నంద్యాల : కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఇటుక అక్రమ బట్టీలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. అనుమతులు లేకున్నా నిర్వహిస్తూ పెద్దఎత్తున వ్యాపారం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. చెరువులు, పొలాల్లో ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు సాగిస్తున్నారు. మరోవైపు కొన్ని బట్టీలకు గృహ, వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు తీసుకుని వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారు. ఇలా పలు శాఖలను మోసగిస్తూ రూ.కోట్లు కొల్లగొడుతున్నారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 300కు పైగా ఇటుక బట్టీలు ఉన్నాయి. ఏటా వీటి సంఖ్య పెరుగుతోంది. నంద్యాల పట్టణ శివార్లలోని అయ్యలూరు మెట్ట, పెద్దకొట్టాల, పొన్నాపురం, అయ్యలూరు, మహానంది మండలంలోని సీతారామాపురం, రుద్రవరం, ఆళ్లగడ్డ, కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లు, కాల్వబుగ్గ, ఎమ్మిగనూరు సమీపంలోని 167వ జాతీయ రహదారి వెంబడి, కోసిగి రహదారి, ఎమ్మిగనూరు–ఆలూరు రహదారి తదితర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో బట్టీలు నిర్వహిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఏడు రకాల అనుమతులు తీసుకోవాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలో ఎన్ని బట్టీలున్నాయో రెవెన్యూ శాఖ వద్ద తగిన వివరాలు లేకపోవడం గమనార్హం.

నంద్యాల సమీపంలోని పెద్దకొట్టాల, అయ్యలూరు, పొన్నాపురం, సీతారామాపురం బట్టీల్లో మహానంది మండలం అంకిరెడ్డి చెరువు నుంచి తెచ్చిన ఎర్రమట్టి టన్నుల కొద్దీ నిల్వ ఉంది. ఈ చెరువు మట్టి



ఆధారంగా జిల్లాలో 60 బట్టీలు నిర్వహిస్తున్నారు. ఒక్కో టిప్పరు మట్టి ప్రస్తుతం రూ.15 వేల వరకు విక్రయిస్తున్నారు. చాలా ప్రాంతాల్లోనూ పెద్దఎత్తున అక్రమంగా మట్టి నిల్వలు చేసుకుంటున్నారు.

**అడ్డగోలుగా దందా**

జిల్లా కేంద్రం నంద్యాల శివారులోని అయ్యలూరు మెట్ట, పొన్నాపురం, అయ్యలూరు ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ రూ.కోట్లలో వ్యాపారం సాగుతోంది. ఇద్దరు ముఖ్య నేతల అనుచరులు కుందూ నది తీరం, చెరువులు, వంకల్లో యథేచ్ఛగా తవ్వకాలు సాగిస్తూ బట్టీలకు మట్టి సరఫరా చేస్తున్నారు.

నంద్యాల అనుకుని ఉన్న కుందూ నది, మహానంది మండలం అంకిరెడ్డి చెరువు, రుద్రవరం మండలం మహాదేవపురం, శిరివెళ్ల మండలాల్లోని వివిధ చెరువుల్లో ఇష్టానుసారం తవ్వకాలు సాగిస్తున్నారు. నిత్యం వందల ట్రిప్పుల నల్ల, ఎర్ర మట్టిని తరలిస్తున్నారు.

కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు, ఆదోని పట్టణాల సమీపంలో పెద్దఎత్తున ఇటుక బట్టీలున్నాయి. చాలావరకు అనధికారికంగానే నడుస్తున్నాయి. ఎమ్మినూరు, మంత్రాలయం, ఆదోని, పత్తికొండ నియోజకవర్గాల్లోని వివిధ చెరువుల నుంచి అక్రమంగా మట్టి తవ్వి సరఫరా చేస్తున్నారు.

## ఎన్నికల నిధులు పక్కదారి

సూళ్లూరుపేట : ఎన్నికలు గానీ, ఏదైనా విపత్తు గానీ వచ్చిందంటే అధికారులకు పండగే. ప్రధానంగా ఎన్నికల నిధులను ఖర్చు చేయడంలో అధికారులు తమ చేతివాటం ప్రదర్శిస్తుంటారు. కారణం వీటికి ఎలాంటి ఆడిట్ ఉండకపోవడమే. ఈ పరిస్థితి గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పలు నియోజకవర్గాల్లో చోటుచేసుకుంది.

ఏడు చోట్ల రూ.45 కోట్లు: జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణకు రూ.45 కోట్లు ఖర్చయినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఈ నిధులను ఆరు విడతల్లో ఎన్నికల సంఘం విడుదల చేసింది. చివరగా గత డిసెంబరులో నిధులు మంజూరు చేసింది. ఎన్నికలు నిర్వహించిన అప్పటి అధికారులు పక్కాగా బిల్లులతోపాటు ఇతర లెక్కలను నమోదు చేసి ప్రస్తుత అధికారులకు అప్పగించారు. బిల్లులు చెల్లించాల్సిన బ్యాంకు ఖాతాలను అందులో పేర్కొన్నారు. అయితే చాలా వరకు బిల్లులు సంబంధిత ఖాతాలకు జమ కాలేదు. దీంతోపాటు సెక్టార్ అధికారులు, బీఎల్వోలు, ఇతర సిబ్బందికి నేటికీ చెల్లింపులు జరగనేలేదు. కానీ వారి నుంచి మాత్రం ముందుగానే అక్విడెన్స్ తీసుకున్నారు. వారంతా ఇప్పుడు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

వివరాలు తెలుసుకుంటా: నరసింహులు, డీఆర్వో

చెల్లింపుల వివరాలు తెలుసుకుంటాం. అక్విడెన్సు తీసుకుని నగదు చెల్లించకుండా ఉండకూడదు. అధికారులతో మాట్లాడతాం.

# వంతెనల నిర్మాణం జరిగేనా?



శింగనమల : వర్షం వస్తే దారి ఉండదు...ఉన్న వంతెనలు ఎప్పుడు కూలుతాయో తెలియదు...పలు వంతెనలు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. గ్రామీణ రహదారులపై ఉన్న వంతెలు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారాయి. గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యంతో నూతన వంతెనల నిర్మాణాలు జరగలేదు. ఉన్నవి శిథిలమయ్యాయి. శింగనమల నియోజకవర్గంలోని పలు వంతెనల దుస్థితి ఇది. కూటమి ప్రభుత్వం దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. ఈనేపథ్యంలో క్షేత్రస్థాయిలోని పరిస్థితిపై పరిశీలన కథనం.

శింగనమల మరువ కొమ్మ వద్ద వంతెన నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇక్కడ మరువ ప్రవహిస్తే పది గ్రామాలకు దారి ఉండదు. నెలల తరబడి ఇతర గ్రామాల దారులను వెతుక్కోవాలి. అష్టకష్టాలు పడి ప్రయాణం చేయాల్సి వస్తోంది.

శింగనమల శ్రీరంగరాయల చెరువు మరవ వంతెన నిర్మాణం ఊసే లేకుండా చేశారు. గత పాలకులు ప్రజలను ఊరిస్తూ వంతెన నిర్మాణం చేయలేదు. బుక్కరాయసముద్రం తహసీల్దారు కార్యాలయం వద్ద వంతెన నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇక్కడ వర్షం నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. చెరువు మరువ ప్రవహిస్తే వాహనాల రాకపోకలు నిలిచి పోతున్నాయి. గత ఎమ్మెల్యే అనేక సార్లు వంతెన నిర్మాణం చేస్తామని చేయలేక పోయారు.నార్పల మండలం గుగూడుకు వెళ్లే ప్రధాన రోడ్డుకు వంతెన నిర్మాణం అవసరం. నరసాపురం వద్ద హెచ్చెల్సీ కాలువపై వంతెన శిథిలమైంది. దీంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. నార్పల– గుగూడు మధ్య ఈ రోడ్డుకు వంతెన నిర్మాణం చేయాల్సి ఉంది.

గార్లదిన్నె మండల పరిధిలోని కొత్తపల్లి వద్ద వంతెన నిర్మాణం అర్థాంతరంగా ఆగి పోయింది. బళ్లారి– తాడిపత్రి రోడ్డును కలుపుతూ గతంలో మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి భూమి పూజ చేశారు. కొంత వరకు పనులు చేసి వదిలేశారు. ఈ పనులు పూర్తయితే గార్లదిన్నె, పామిడి మండలాలతో పాటు తాడిపత్రి– బళ్లారికి వెళ్లడానికి సులువుగా ఉంటుంది.

గార్లదిన్నె మండలం యర్రగుంట్ల వద్ద హెచ్చెల్సీ ఐదో కాలువ వద్ద యర్రగుంట్ల నుంచి పెనకచెర్ల డ్యాంకు వెళ్లే దారి ఇబ్బందిగా మారింది. ఇక్కడ ఉన్న వంతెన శిథిలమైంది. తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి.

**త్వరలో రూ.11 కోట్లతో పనులు**

నియోజకవర్గంలో అవసరమైన వంతెనలను గుర్తించాం. అధికారులు చిన్న వంతెన నుంచి భారీ వంతెనల వరకు క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్రతిపాదనలు చేశారు. శింగనమల మరువ వద్ద త్వరలోనే రూ.5 కోట్లతో వంతెన నిర్మాణం చేపట్టనున్నాం. పోతురాజుకాల్వ వద్ద రూ.6 కోట్లతో వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

బండారు శ్రావణిశ్రీ, ఎమ్మెల్యే, శింగనమల

# భూచోళ్లపై చర్యలు శూన్యం



విశాఖపట్నం : జిల్లాలోని విలువైన ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోతోంది. వాటిని పరిరక్షించడంలో యంత్రాంగం విఫలమవుతోంది. వీటిల్లో ఎప్పటికప్పుడు అక్రమాలు చోటుచేసుకుంటున్నా సంబంధిత బాధ్యులపై గట్టి చర్యలు కనిపించడం లేదు. దీంతో యథేచ్ఛగా మరిన్ని అక్రమాలకు పాల్పడుతున్నారు. వీటిని అడ్డుకోవాల్సిన మండల, క్షేత్ర స్థాయి అధికారులు అందినకాడికి దండుకోవడానికే పరిమితం అవుతున్నారు. వీరికి ప్రజాప్రతినిధులు జత కలవడంతో విలువైన ప్రభుత్వ భూములు అక్రమార్కుల పరమవుతున్నాయి. తాజాగా రెవెన్యూ శాఖ ఉన్నతాధికారి జారీ చేసిన ఉత్తర్వులే ఇందుకు నిదర్శనం. వాటి విలువ రూ.వందల కోట్లు ఉండడంతో రెవెన్యూ వర్గాల్లో ఇది చర్చనీయాంశమవుతోంది.

**తొలగించుకునేలా..**

నిషేధిత జాబితాల నుంచి భూములను తొలగించేలా మండలాల్లో కొందరు తహసీల్దార్లు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. వారికి లబ్ధి చేకూరేలా పావులు కదుపుతున్నారు. ఇందుకు కొందరు తహసీల్దార్లు, కలెక్టరేట్ సిబ్బందితో కలిసి దస్త్రాలకు మోక్షం కలిగేలా చేయించుకుంటున్నారన్న విమర్శలున్నాయి. ఇందులో కొందరు అధికారుల హస్తం ఉందంటున్నారు.

**ఆ భూములపై ఎలా?** నగరానికి సమీపంలోని ముడసర్లోవ భూములు జలాశయ పరివాహక ప్రాంతంలో ఉన్నాయి. ఆయా భూములను జలవనరుగా పరిగణిస్తారు. వాటికి ఏరకంగానూ నిరభ్యంతర పత్రాలు (ఎన్‌వోసీ)లు జారీ చేయకూడదు. సుప్రీంకోర్టు ఆదేశాలు సైతం ఉన్నాయి. అయినప్పటికీ కొద్ది రోజుల కిందట సర్వే నంబరు 31/2లోని అయిదెకరాల భూములకు ఎన్‌వోసీ జారీ చేయాలని రెవెన్యూశాఖ ఉన్నతాధికారి ఉత్తర్వులిచ్చారు. జిల్లా యంత్రాంగం అప్రమత్తం కావడంతో దాన్ని నిలిపేశారు.

గాజువాక పరిధిలో ఏకంగా ఒక చెరువు స్థలాన్ని 22ఏ జాబితా నుంచి తొలగించాలని మరో ఉత్తర్వు వచ్చింది. గతంలో దాన్ని చేపల పెంపకం కోసం అప్పగించారు. ఇప్పుడు దాని స్వరూపాన్ని మార్చి కట్టబెట్టేలా వ్యూహం పన్నుతున్నారు. మధురవాడలో గెడ్డ పక్కనున్న భూములకు, కుసులువాడలో కొండల పక్కన ఉన్న భూములకు ఎన్‌ఓసీలు జారీ చేయాలని స్వయంగా ఉన్నతాధికారులే ఉత్తర్వులు ఇవ్వడం విస్తుగొలుపుతోంది. ఇవి కేవలం వెలుగు చూసిన అంశాలే. వెలుగుచూడనివి అనేకం ఉన్నాయి.

**దస్త్రాలు మార్చేసినా..**

జిల్లాలో 2017లో భారీ భూ కుంభకోణం వెలుగుచూసింది. గ్రామీణ మండల పరిధిలో 250 ఎకరాలకు చెందిన భూదస్త్రాలను తారుమారు చేసి అక్రమార్కుల పేర్లను రెవెన్యూ రికార్డుల్లో పొందుపర్చారు. నాటి తెదేపా ప్రభుత్వం వాటిపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసి విచారణ చేపట్టింది. అక్రమాలు వాస్తవమేనని సిట్ తేల్చింది. మాజీ సైనికులు, స్వాతంత్ర్య సమరయోధులు, రాజకీయ బాధితులకు కేటాయించిన భూములకు సైతం అడ్డగోలుగా ఎన్‌వోసీలు అప్పట్లో జారీ చేశారు. దీనికి బాధ్యులుగా అప్పట్లో పనిచేసిన పలువురు సంయుక్త కలెక్టర్లు, డీఆర్వోలు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, సర్వేయర్లు, ఉప తహసీల్దార్లు, సీనియర్ సహాయకులు ఇలా వందమందికిపైగా బాధ్యులను తేల్చారు. అయినప్పటికీ ఏ ఒక్కరిపై ప్రభుత్వం ఇంతవరకు చర్యలు తీసుకోలేదు.కలెక్టరేట్‌లోని ఎఫ్ సెక్షన్ కేంద్రంగా మధురవాడలోని పలు సర్వే సంఖ్యల్లోని భూముల రికార్డులను తారుమారు చేసినట్లు గుర్తించారు. దీనికి ఏడుగురు అధికారులను బాధ్యులను చేసి విచారిస్తున్నారు.

# హమ్మయ్య.. సర్దేశారు

చిత్తూరు : వ్యవసాయ రంగంలో పలు సంస్కరణలకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రైతు సేవా కేంద్రాల (గతంలో రైతు భరోసా కేంద్రాల) హేతుబద్ధీకరణ ప్రక్రియ చేపట్టింది. ఉమ్మడి జిల్లాను ప్రామాణికంగా తీసుకుని సిబ్బంది హేతుబద్ధీకరణ పూర్తిచేసింది.

**సచివాలయం క్లస్టర్ ఆధారంగా..** గ్రామ సచివాలయం క్లస్టర్లను పరిగణనలోకి తీసుకుని ఆర్ఎస్‌కేల సిబ్బంది హేతుబద్ధీకరణ చేపట్టారు. ఉమ్మడి జిల్లాలో 902 రైతు సేవా కేంద్రాలు ఉండగా ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో 502 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరం(2024–25) ఖరీఫ్, రబీలో ఈ–పంట నమోదును పరిగణనలోకి తీసుకుని హేతుబద్ధీకరణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామ సచివాలయాలకు అనుబంధంగా ఇటీవల మ్యాపింగ్ చేసి ఎంపిక చేసిన క్లస్టరు ఆధారంగా స్థానికంగా 600–700 నుంచి 1,200–1,400 ఎకరాలను పరిగణనలోకి తీసుకున్నారు. పంటల సాగు లెక్కలోకి తీసుకొని సిబ్బందిని సర్దుబాటు చేశారు. ఎక్కువ విస్తీర్ణంలో(వ్యవసాయం, ఉద్యాన పంటలు) ఉన్నాయో.. ఆ పంటలకు అనుగుణంగా సిబ్బందిని నియమించారు.

**ఉమ్మడి జిల్లాలో 568 ఆర్ఎస్‌కేలు..** ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 902 రైతు సేవా కేంద్రాలు ఉండేవి. క్లస్టర్ల వారీగా ఆర్ఎస్‌కేల క్రమబద్ధీకరణతో చిత్తూరు జిల్లాలో 256 ఆర్ఎస్‌కేలు, అన్నమయ్య జిల్లాలో 158, తిరుపతి జిల్లా పరిధిలో 154 రైతు సేవా కేంద్రాలు అందుబాటులోకి తెచ్చి ఇక్కడ సిబ్బందిని హేతుబద్ధీకరించారు. సిబ్బంది సర్దుబాటులో భాగంగా జిల్లాకు గ్రామ ఉద్యాన సహాయకులు 10–15 రానున్నారని, ఇక్కడి నుంచి ఆరు మంది గ్రామ వ్యవసాయ సహాయకులు ఇతర జిల్లాలకు వెళ్లనున్నారు. ఆర్ఎస్‌కేల హేతుబద్ధీకరణ నివేదికలను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆమోదంతో రాష్ట్ర వ్యవసాయ శాఖకు నివేదించామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ప్రభుత్వం ఆమోదముద్ర వేయగానే హేతుబద్ధీకరణకు అనుగుణంగా ఆర్ఎస్‌కేల వ్యవస్థ అందుబాటులోకి రానున్నదని అధికారులు తెలిపారు.

## నీటి గ్రిడ్ పనులు ఇంకెప్పుడు?

తిరుపతి : అదిగో 'వాటర్ గ్రిడ్'.. ఇవిగో 'ఇంటింటికీ నీళ్లు' అంటూ గత ఐదేళ్లు వైకాపా ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఊరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు పనుల ప్రాధాన్యాన్ని ప్రస్తావించారు. త్వరగా పూర్తిచేసి నీటి ఎద్దడి లేకుండా చేయాలని ఆదేశించగా అధికారులు మాత్రం ఈ వేగాన్ని అందుకోలేకపోతున్నారు. పొరుగునే ఉన్న అన్నమయ్య జిల్లాలో ఇటీవల టెండర్లు ఖరారుకాగా మన దగ్గర ఎప్పుడు ఈ ప్రక్రియ పూర్తవుతుంది? పనులు ఎప్పుడు మొదలవుతాయి? అన్న ప్రశ్నలు వస్తున్నాయి.

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి (2014–19)గా నారా లోకేశ్ ఉన్న సమయంలో ఈ ప్రాజెక్టును ప్రతిపాదించారు. రూ.4,375 కోట్లతో టెండర్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత జగన్ సర్కార్ అధికారంలోకి వచ్చింది. పనులు నిలిపేయడంతోపాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పుంగనూరుకు మాత్రమే నీరందించేలా ప్రణాళికలు రూపొందించి పనులు అటకెక్కించారు.

**'కుప్పం' పర్యటనలో సీఎం సూచించినా**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రిజర్వాయర్ల నుంచి ఉపరితల జలాలను గ్రామాలకు తీసుకురావాలని నిర్ణయించారు. సీఎం చంద్రబాబు తొలి కుప్పం పర్యటనలోనే ఈ దిశగా అధికారులకు సూచనలు ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ సాయం కోరడంతోపాటు డీపీఆర్ తయారు చేయాలని



ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

**మరో రెండుమూడు నెలలు**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలవుతోంది. ఈలోపే టెండర్లు ఖరారయ్యి.. ఒప్పందం పూర్తిచేసుకుని ఉంటే పనులు వేగంగా జరిగేవన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. తొలిదశలో భాగమైన అన్నమయ్య జిల్లాలో గతనెల 7న రూ.2,370 కోట్లతో టెండర్లు ఖరారు చేశారు. 30 నెలల్లో పూర్తి చేయాలని నిర్దేశించారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఇందుకు మరో రెండుమూడు నెలల సమయం పడుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు వేగంగా కదిలితే గ్రామాలకు త్వరగా రక్షిత జలాలు అందించవచ్చు.

**ప్రాథమికంగా నిర్ణయించినా..**

ప్రాథమికంగా తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి, సత్యవేడు, గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలతోపాటు నగరిలోని వడమాలపేట, పుత్తూరు, చంద్రగిరిలోని తిరుపతి గ్రామీణ, చంద్రగిరి, రామచంద్రాపురం మండలాలకు ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని కండలేరు జలాశయం నుంచి నీరు తీసుకోవాలని ఇప్పటికే నిర్ణయించారు. చిత్తూరు జిల్లాలోని చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు నియోజకవర్గాలతోపాటు నగరిలోని నింద్ర, విజయపురం, నగరి మండలాలకు ఇక్కడి నుంచే నీళ్లు తరలిస్తారు. ఉమ్మడి కడప జిల్లాలోని గండికోట రిజర్వాయర్ నుంచి పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాలతోపాటు చంద్రగిరిలోని పాకాల, చిన్నగొట్టిగల్లు, యర్రావారిపాలెం మండలాలకు నీరు తెస్తారు.

గండికోట జలాశయం నుంచి నీరందనున్న మండలాలు 18
లబ్ధి పొందే జనాభా 12.10
అవసరమైన నీరు 1.06 టీఎంసీలు

## మళ్లీ చేద్దాం.. మళ్లించేద్దాం


బంగారుపాళ్యం : ఉపాధిహామీ పథకం సిబ్బంది క్షేత్రస్థాయిలో పెద్దఎత్తున చేతివాటం చూపుతున్నారు. మూడేళ్లపాటు విధులు నిర్వర్తించిన ఏపీవో, టెక్నికల్, కంప్యూటర్ సిబ్బందిని ఉన్నతాధికారులు గతేడాది మార్చిలో బదిలీచేశారు. వారి స్థానాల్లో కొత్తవారిని నియమించగా ఇదే అవకాశంగా భావించిన వారు చేతివాటం చూపుతున్నారు.

**ఎక్కడెక్కడంటే..**

గతేడాది చేసిన కాలువల పూడికతీత పనులకు మళ్లీ అంచనాలు వేసి అనుమతులు పొంది కూలీలచే పనులు చేయిస్తున్నారు. ఇలా ఒక్కో పనికి రూ.2 లక్షలకు పైగా అంచనాలు సిద్ధం చేయడం విశేషం. తుంబకుప్పం, ముంగర మడుగు, రాగిమానుపెంట, బంగారు పాళ్యం, కె.ఎం కండ్రిగ, కాటప్పగారిపల్లె పంచాయతీల పరిధిలోని పలు గ్రామాల్లో రూ.50 లక్షల విలువచేసే పనులనే మళ్లీ చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**ఫారం పాండ్ పనులు చేయాల్సి ఉన్నా..**

ఉన్నతాధికారులు ఉపాధిహామీలో ఫారంపాండ్ పనులు చేయాలని ఆదేశించారు. ఈ పనుల్లో కూలీలకు కష్టం అధికం. కాలువ పనుల్లో అయితే అటూఇటూ గడ్డి చెక్కి అడుగు లోతు మట్టి తీసి బిల్లులు కాజేయవచ్చనేది క్షేత్రస్థాయి సిబ్బంది ఆలోచన. మండల అధికారులు తందానా అంటుండటంతో అక్రమాలకు అదుపు లేకుండా పోతోంది.



**పర్యవేక్షణ కరవు..**

నిత్యం గ్రామాల్లో జరిగే పనులను ఏపీవో, ఏపీడీ, డ్వామా ఉన్నతాధికారులు పరిశీలించాలి. అయితే క్షేత్రస్థాయిలో పరిశీలన పూర్తిగా కొరవడింది. ఇదే అవకాశంగా క్షేత్రస్థాయి సిబ్బంది కూలీల హాజరు పట్టికలో తమకు అనుకూలమైన పేర్లు రాసి జేబులు నింపుకొంటున్నారు. ఈ తంతులో ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్ల వరకు వాటాలు ఉన్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. కూలీల హాజరు ఆన్‌లైన్ చేయాల్సి ఉండగా కొన్ని ప్రదేశాల్లో యాప్ పనిచేయకపోవడంతో ఈ అక్రమాలు దర్జాగా కానిచ్చేస్తున్నారు.

**పరిశీలించి చర్యలు** ఉపాధిలో చేసిన పనులను రెండేళ్లపాటు చేయడం నేరం. బంగారు పాళ్యం మండలంలోని పలు పంచాయతీల్లో గతంలో చేసిన పనులను మళ్లీ చేస్తున్నారనే ఫిర్యాదుపై వెంటనే పరిశీలిస్తాం. సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. రవికుమార్, ఏపీడీ, పుంగనూరు

## పిక్‌టాక్ : మెహ్రీన్ ఎలా అయ్యిందో చూడండి

నాని హీరోగా నటించిన కృష్ణ గాడి వీర ప్రేమ గాథ సినిమాతో హీరోయిన్‌గా తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ మెహ్రీన్. ఈ అమ్మడు మొదటి సినిమాలో అందంతో ఆకట్టుకోవడంతో పాటు జూనియర్ మిల్కీ బ్యూటీ అనే ట్యాగ్‌ను సొంతం చేసుకుంది. మిల్కీ బ్యూటీ తమన్నా రేంజ్‌లో ఈ అమ్మడికి టాలీవుడ్‌లో ఫ్యూచర్ ఉంటుందని అంతా భావించారు. కానీ అనూహ్యంగా ఆమెకు లక్ కలిసి రాలేదు. హీరోయిన్‌గా చేసిన సినిమాల్లో కొన్ని సూపర్ హిట్ అయ్యాయి. అయినా కూడా యంగ్ స్టార్ హీరోలకు జోడీగా ఈ అమ్మడికి నటించే అవకాశం దక్కలేదు. ఆ మధ్య వరుస సినిమాలు చేసిన మెహ్రీన్ ఈ మధ్య సినిమాలే చేయడం లేదు. చివరగా మెహ్రీన్ తెలుగులో 'ఎఫ్ 3' సినిమాలో కనిపించింది. ఎఫ్ 2 లో ఈమె చేసిన హనీ పాత్రకు మంచి స్పందన దక్కింది. అందుకే ఎఫ్ 3 లోనూ అదే పాత్రలో మెహ్రీన్‌ను దర్శకుడు అనిల్ రావిపూడి నటింపజేశాడు. ఎఫ్ 3 సినిమా ఆశించిన స్థాయిలో విజయాన్ని సొంతం చేసుకోలేదు. దానికి తోడు మెహ్రీన్ పాత్ర మరీ నాసిరకంగా ఉంది అంటూ విమర్శలు వచ్చాయి. అందుకే మెహ్రీన్ హీరోయిన్‌గా తెలుగులో ఆఫర్లు దక్కించుకోవడంలో విఫలం అవుతోంది. ప్రస్తుతం ఒక కన్నడ మూవీ తప్ప మరే సినిమాలను ఈ అమ్మడు చేయడం లేదు. త్వరలో తెలుగులో ఈమె సినిమాలు చేయాలని అభిమానులు బలంగా కోరుకుంటున్నారు. సినిమాలతో పెద్దగా సందడి చేయకున్నా హీరోయిన్‌గా ఆఫర్లు రాకున్నా కూడా



సోషల్ మీడియాలో ఈమె అందాల ఆరబోత ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా ఈమె షేర్ చేసే అందాల స్కిన్ షో ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తూ ఉన్నాయి. మెహ్రీన్ హీరోయిన్‌గా వచ్చిన పాపులారిటీ కంటే ఆమె అందంగా కనిపిస్తూ షేర్ చేసిన ఫోటోల వల్ల వచ్చిన పాపులారిటీ ఎక్కువ అనే అభిప్రాయం సైతం కొందరు వ్యక్తం చేస్తూ ఉంటారు. ఆకట్టుకునే మెహ్రీన్ ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుందని మరో సారి నిరూపితం అయింది. అందంగా కనిపించడం మాత్రమే కాకుండా ఫోటోలకు అద్భుతమైన ఫోజ్‌లు ఇవ్వడం అనేది మెహ్రీన్‌కి మాత్రమే సాధ్యం అంటూ ఉంటారు. తాజాగా ఈ అమ్మడు రెడ్ టాప్ ధరించి విభిన్నమైన డిజైన్ తో ఉన్న పాయింట్‌ను ధరించింది. అంతే కాకుండా తలకు స్కార్ఫ్ కట్టుకుంది. నడుము అందం చూపిస్తూ ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోలు ప్రస్తుతం నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ మెహ్రీన్ సొంతం అంటూ ఉంటారు. ఈ ఫోటోలను చూస్తే ఖచ్చితంగా ఎవరైనా ఆ మాట అనాల్సిందే. మెహ్రీన్ ఇంతటి అందంను ఉంచుకుని సరిగ్గా సినిమాలను ఎంపిక చేసుకోవడం లేదు అంటూ కొందరు కామెంట్ చేస్తున్నారు. తెలుగులో రీ ఎంట్రీ ఇచ్చి ఇకపై అయినా వరుస సినిమాల్లో మెహ్రీన్ నటిస్తే బాగుండు అని చాలా మంది కోరుకుంటున్నారు. టాలీవుడ్‌లో మెహ్రీన్ రీ ఎంట్రీ సాధ్యమేనా అనేది చూడాలి.

## వాళ్లిద్దరి మధ్య మళ్లీ పచ్చగడ్డి వేస్తున్నారా?

త్రిష-నయనతార మధ్య ఒకప్పుడు పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది. అవకాశాల పరంగా ఇద్దరి మధ్య మొదలైన పోటీ? అటుపై వ్యక్తిగత పోటీగా మారింది. కొన్నాళ్ల పాటు తగ్గాఫ్ వార్ ఓ రేంజ్ లో కొనసాగింది. కానీ కాలం అన్నింటికి ఓ పరిష్కారం చూపిస్తుంది అన్నట్లు వాళ్ల వివాదానికి ఓ పరిష్కారంతో ఫుల్ స్టాప్ పడేలా చేసింది. కొంత కాలంగా ఇద్దరు బాగానే మాట్లాడుకుంటున్నారు. ఇద్దరి మధ్య ఉన్న పాత ఈగోలను పక్కనబెట్టి ఫ్రెండ్లీగా మెలుగుతున్నారు. అయితే వాళ్లిద్దరి మధ్య పుల్లలు పెట్టే బ్యాచ్ మాత్రం ఒకటి తయారైందని కోలీవుడ్ మీడియాలో వార్తలొ స్తున్నాయి. ఇటీవల రిలీజ్ అయిన థగ్ లైఫ్ లో త్రిష సెకెండ్ లీడ్ పోషించిన సంగతి తెలిసిందే. సినిమా ఎలా ఉంది? అన్న సంగతి పక్కనబెడితే త్రిష పాత్రను నెగిటివ్ చేసే



ప్రచారం మొదలు పెట్టారు. సినిమా లో త్రిష పాత్ర కీలకమైంది. అమర్ ( శింబు) చెల్లులు ఎవరు? అన్న దానిపై ఇంద్రాణి(త్రిష), చంద్ర ( ఐశ్వర్య లక్ష్మి) పాత్రల మధ్య కొంత సస్పెన్స్ నలుగుతుంది. ఆ రకంగా త్రిష పాత్ర బలమైంది. కానీ ఈ సినిమా అంగీకరించి త్రిష తప్పుచేసిందని నెగిటివ్ ప్రచారం మొదలైంది. త్రిష కూడా రియలైజ్ అవుతుందని కథనాలు అల్లుతున్నారు. తొలుత ఈ పాత్ర నయనతార వద్దకు వచ్చినా? ఆమెకు నచ్చకపోవడంతోనే చేయలేదనే టాక్ ఉంది. ఆమె వదిలేసింది కాబట్టే త్రిషకు ఛాన్స్ వచ్చిందని నయన్ కోలీవుడ్ వర్గం ఆరోపిస్తుంది. త్రిషను డీగ్రేడ్ చేసే ప్రయత్నానికి తెర తీసారు. త్రిష అభిమానులు మాత్రం నయన్ అభిమానులకు కౌంటర్ ఇస్తున్నారు. దీంతో మర్చిపోయిన పాత వివాదాల్ని అభిమానుల కారణంగా మళ్లీ బయట పడతాయా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయినా అబద్దాలతో కట్టిన పేక మేడ ఎంత కాలం ఉంటుంది. ఏదో రోజు అది కూలక తప్పదు.




## కన్నప్ప టీమ్ ప్రభాస్ తో ఆ పని చేయించాల్సిందే..?



మంచు విష్ణు నటిస్తూ నిర్మించిన కన్నప్ప మరో రెండు వారాల్లో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. భక్త కన్నప్ప కథను నేటి ప్రేక్షకులకు చెప్పాలనే ఉద్దేశంతో కన్నప్ప సినిమా మొదలు పెట్టారు మంచు ఫ్యామిలీ. ముఖేష్ కుమార్ సింగ్ డైరెక్షన్ లో తెరకెక్కిన కన్నప్ప సినిమాలో మంచు విష్ణు విష్ణు టైటిల్ రోల్ పోషించగా సినిమాలో ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్ లాల్, శరత్ కుమార్, మోహన్ బాబు లాంటి స్టార్స్ కూడా భాగం అయ్యారు. అసలైతే ఏప్రిల్ లోనే రిలీజ్ అవ్వాల్సిన కన్నప్ప సినిమా జూన్ 27న రిలీజ్ అవుతుంది. ఈ సినిమాకు మంచు విష్ణు ఇప్పటికే ప్రమోషన్స్ మొదలు పెట్టాడు. కన్నప్ప సినిమాతో తిరిగి కెరీర్ లో సూపర్ ఫాం లోకి రావాలని చూస్తున్నాడు మంచు విష్ణు. ఐతే కన్నప్ప సినిమా ముంబై ప్రెస్ మీట్ లో అక్షయ్ కుమార్ ఒకటి రెండుసార్లు కనిపించాడు. ఇటీవల గుంటూరులో జరిగిన కన్నప్ప ప్రీ రిలీజ్ ఈవెంట్ మాత్రం మంచ్ విష్ణు, మోహన్ బాబు మిగతా కన్నప్ప టీం సమక్షంలో జరిగింది. ప్రభాస్ కన్నప్పలో ఉన్నాడని తెలిసే ఫ్యాన్స్ ఆ సినిమా మీద ఫోకస్ చేస్తున్నారు. ఐతే ఇప్పటివరకు కన్నప్పకు సంబంధించిన ప్రమోషన్స్ లో ప్రభాస్ పాల్గొనలేదు. సినిమా రిలీజ్ కు ఇంకా 17 రోజులు మాత్రమే ఉంది కాబట్టి కన్నప్ప కోసం ప్రభాస్ తో ఒక స్పెషల్ ఇంటర్వ్యూ చేయిస్తే కచ్చితంగా ప్లస్ అవుతుందని చెప్పొచ్చు. మరి ప్రభాస్ ఆ ఇంటర్వ్యూకైనా టైం ఇస్తాడా లేదా అన్నది చూడాలి. ప్రభాస్ కూడా రాజా సాబ్ ని పూర్తి చేసి అనుకున్న డేట్ కి రిలీజ్ అయ్యేలా ప్రయత్నిస్తున్నాడు. మరోపక్క ఫౌజీ సినిమా షూటింగ్ లో కూడా పాల్గొంటున్నాడు. ఫ్యాన్స్ తన సినిమాల కోసం ఎంతో ఈగర్ గా ఎదురుచూస్తున్నారన్న విషయాన్ని గుర్తించిన ప్రభాస్ ఇక మీదట స్పీడ్ పెంచాలని ఫిక్స్ అయ్యాడు. ఐతే కన్నప్ప లో రుద్ర పాత్రలో నటించిన ప్రభాస్ ఆ సినిమా ప్రమోషన్స్ లో కూడా సపోర్ట్ అందిస్తే సినిమాకు కావాల్సినంత బజ్ వస్తుంది. మరి మంచు విష్ణు ప్రభాస్ ని ప్రమోషనల్ ఇంటర్వ్యూస్ లో పాల్గొనేలా చూస్తాడా లేదా అన్నది చూడాలి. కన్నప్ప సినిమా మీద మేకర్స్ చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నారు. సినిమాను వరల్డ్ వైడ్ గా భారీ రేంజ్ లో రిలీజ్ చేస్తున్నారు.

## యానిమల్‌ని అన్నోళ్ల నోళ్లు పడిపోయాయా?




సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించిన యానిమల్ హింస, మహిళలను తక్కువ చేసే సన్నివేశాల కారణంగా చాలా విమర్శలకు గురైంది. చాలా మంది యూట్యూబర్లు, ఫెమినిస్టులు ఈ సినిమా కంటెంట్ ని విమర్శించడమే ధ్యేయంగా జీవించారు. అయితే ఇప్పుడు హౌస్‌ఫుల్ 5 వచ్చింది.

దిగ్గజాలు నటించిన ఈ సినిమాలోని కొన్ని సీన్ల గురించి చాలా చర్చ సాగుతోంది. ముఖ్యంగా ఇందులో అసభ్యత, ఆడాళ్లపై కుళ్లు జోకులు వగైరా పూర్తిగా జుగుప్స కలిగించాయని విమర్శలొస్తున్నాయి. కామెడీ, రోమడీ పేరుతో అడల్ట్ కంటెంట్ అసహ్యం కలిగించిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇందులో చాలా భాగం సముద్రంపై క్రూయిజ్ షిప్‌లో సాగే స్టోరి.. దానికి తగ్గట్టు గ్లామర్ ని ఎంతమాత్రం సరిగా వినియోగించుకో లేకపోయారని విమర్శలొస్తున్నాయి. ఈ చిత్రానికి తరుణ్ మన్సుఖాని దర్శకత్వం వహించారు. సాజిద్ నదియాద్వాలా నిర్మించారు. అక్షయ్ కుమార్, సంజయ్ దత్, రితీష్ దేశ్‌ముఖ్, అభిషేక్ బచ్చన్, ఫర్దీన్ ఖాన్, శ్రేయాస్ తల్పాడే, నానా పటేకర్, జాకీ ష్రాఫ్, డినో మోరియా, జాక్వెలిన్ ఫెర్నాండెజ్, నర్గీస్ ఫక్రీ, చిత్రాంగద సింగ్, సోనమ్ బజ్వా, సౌందర్య డి పన్వే జాన్, చంకీ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. అయితే అంత పెద్ద దిగ్గజ స్టార్లు నటించిన ఈ సినిమాలో అసభ్యకర చెత్త సన్నివేశాల కారణంగా తీవ్ర విమర్శల్ని ఎదుర్కోవాల్సి వస్తోంది. యానిమల్ చిత్రానికి ఒక తెలుగువాడు దర్శకత్వం వహించాడు.

చాలా విమర్శించారు. ఆ సినిమాలో కొన్ని అసభ్యకర సంభాషణలు ఉన్నా కానీ, అవన్నీ సందర్భానుసారం చాలా ఫన్ ని పుట్టిస్తాయి. చాలా సన్నివేశాల్లో రణబీర్ ఎమోషనల్ పెర్ఫామెన్స్ రక్తి కట్టిస్తుంది. కానీ ఇక్కడ హౌస్ ఫుల్ లో ఎమోషన్స్ వర్కవుట్ కాలేదు, నటీనటుల ప్రదర్శన కూడా సరిగా సూట్ కాలేదని సమీక్షకులు విమర్శించారు.

## మాల్దీవుల ప్రపంచ పర్యాటక రాయబారి ఈ నటి

మాల్దీవుల పర్యాటక రంగానికి కత్రినా కైఫ్‌ను ప్రపంచ బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపిక చేసినట్లు ద్వీప దేశం ప్రకటించింది. కత్రిన తన అందచందాలు, ఆకర్షణతో పాటు అవార్డులు రివార్డులు అందుకున్న నటి. వ్యవస్థాపకురాలిగా ప్రపంచంతో కనెక్ట్ అయి ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న టూరిస్టులకు గొప్ప వారధి కాగలరు! అని మాల్దీవుల పర్యాటక శాఖ ప్రతినిధులు ప్రశంసించారు. భారతీయ సినిమాకు కత్రిన సేవలు అసమానం. ఎన్నో ప్రతిష్ఠాత్మక సినిమాల్లో నటించి బ్లాక్ బస్టర్లు అందుకుని, వినోదరంగానికి చేసిన సేవలు అపారమైనవి అని పేర్కొన్నారు. మాల్దీవుల పర్యాటకానికి బ్రాండ్ అంబాసిడర్ గా తనను ఎంపిక చేయగానే కత్రిన స్పందిస్తూ %-%సన్నీ సైడ్ ఆఫ్ లైఫ్ గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్%-%గా తన కొత్త పాత్రతో సరైన గౌరవం లభించిందని కత్రిన కైఫ్ అన్నారు. మాల్దీవులు లగ్జరీ, సహజ సౌందర్యానికి పరాకాష్ట. ప్రశాంత వాతావరణం ఈ దీవుల ప్రత్యేకత.. అని కత్రిన అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సందర్శకులకు




ఉత్తమమైన ట్రావెలింగ్ ఎక్స్ పీరియెన్స్ ని మాల్దీవులు అందిస్తాని వ్యాఖ్యానించారు. కత్రిన శక్తివంతమైన వ్యక్తిత్వం, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులతో కత్రిన బలమైన సంబంధం తనను %-%సన్నీ సైడ్ ఆఫ్ లైఫ్-కు పరిపూర్ణ ప్రతినిధిగా అవకాశం కల్పించాయి. నిజానికి మాల్దీవులతో భారతదేశ సత్సంబంధాలు దెబ్బ తిన్న తరవాత ఆ దేశానికి టూరిజం ఆదాయం భారీగా తగ్గిందని కథనాలొచ్చాయి. అటుపై దిద్దుబాటు చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు కత్రినను పర్యాటక శాఖ అంబాసిడర్ గా ఎంపిక చేయడం... సరిగ్గా మోదీ మాల్దీవుల పర్యటనకు ముందు ప్రకటించడం ఆశ్చర్యపరిచింది. గత సంవత్సరం ప్రారంభంలో దౌత్యపరమైన ఉద్రిక్తత తర్వాత రెండు దేశాల మధ్య సంబంధాలు కరిగిపోయే పరిస్థితి తలెత్తింది. ప్రధాని మోడీ సోషల్ మీడియాలో లక్షద్వీప్ వెకేషన్ నుంచి వరుస ఫోటోలను పోస్ట్ చేసినప్పుడు పరిస్థితి మరింత దిగజారింది. మాల్దీవులకు వ్యతిరేక పవనాలు వీచాయి. దేశ ప్రధాని నరేంద్ర మోదీ లక్షద్వీప్ ని ప్రమోట్ చేసారు. మాల్దీవులకు ఉత్తమమైన ప్రత్యామ్నాయం అని ప్రచారం చేసారు. 7 జూన్ 2025 నాటికి మాల్దీవులను 10లక్షల మంది విజిట్ చేసారని ఆ దేశ పర్యాటక శాఖ ప్రకటించింది.

## రంభ రీ ఎంట్రీ ఇస్తుందా? నిర్మాత గానా? నటి గానా?

టాలీవుడ్ నటి రంభ గురించి అందరికీ తెలిసిందే. తన అందం, అభినయంతో తెలుగు ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని హీరోయిన్స్ లిస్ట్ లో ఆమె పేరు కచ్చితంగా ఉంటుంది. 32 ఏళ్ల క్రితం మలయాళ చిత్రం సర్గం ద్వారా హీరోయిన్ గా కెరీర్ స్టార్ట్ చేసిన రంభ.. అదే ఏడాది తెలుగు సినీ ఇండస్ట్రీలోకి వచ్చేసింది. ఆ ఒకటి అడక్కు అంటూ డెబ్యూ మూవీతో మంచి హిట్ అందుకున్న బ్యూటీ.. అందులో ఆమె పేరు రంభ కావడంతో అదే స్థిరపడిపోయింది. ఒరిజినల్ పేరు మాత్రం విజయలక్ష్మి. అప్పట్లో దాదాపు అందరు టాప్ హీరోలతో ఆడిపాడింది. బాలీవుడ్ లో కూడా సందడి చేసింది. కోలీవుడ్ లో ప్రత్యేక గుర్తింపు ఆమె సొంతం. కన్నడం, మలయాళం, బెంగాలీ, బోజ్‌పురి భాషల్లో కూడా సినిమాలు చేసిన రంభ.. అప్పట్లో స్టార్ హీరోయిన్ గా ఓ రేంజ్ లో ఇండస్ట్రీని ఏలింది. రెండు దశాబ్దాలకు పైగా అగ్ర కథానాయకిగా రాణించింది. 100కు పైగా చిత్రాల్లో నటించిన రంభ.. 2010లో కెనడాకు చెందిన ఇంద్రకుమార్



పద్మనాథన్ అనే పారిశ్రామిక వేత్తను వివాహం చేసుకుంది. ప్రస్తుతం వారిద్దరికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. పెళ్లి తర్వాత పలు సినిమాల్లో కనిపించిన అమ్మడు.. మెల్లగా యాక్టింగ్ కు దూరమైంది. రీసెంట్ గా సెకెండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసిన ఆమె.. ఓ టీవీ షోలో జడ్జ్ గా కనిపించి సందడి చేసింది. ఇప్పుడు మళ్లీ సినిమాలపై ఫోకస్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే నటి గానా లేక నిర్మాతగా అనేది ఆమె ఇంకా ఫిక్స్ అవ్వలేదని సమాచారం. నిజానికి.. త్రీ రోజెస్ అనే సినిమాను ఇప్పటికే నిర్మించింది రంభ. కానీ ఆ సినిమా అనుకున్న స్థాయిలో మెప్పించలేకపోయింది. అదే సమయంలో ఆమె నిర్మాతగా వ్యవహరిస్తే.. కొందరు దర్శకులు సినిమాలు తెరకెక్కించాలని ఎదురుచూస్తున్నారట. కానీ ఆమె ఇంకా సందిగ్ధంలో ఉన్నారని టాక్. అదే సమయంలో రంభ లేటెస్ట్ పిక్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. దీంతో నటిగా సెకెండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేయండి మేడమ్ అంటూ అనేక మంది నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. వెయిటింగ్ ఫర్ అప్డేట్స్ అంటూ సందడి చేస్తున్నారు. మరి రంభ ఏం చేస్తారో వేచి చూడాలి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536